ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 04.08.2026 | సంపుటి : 13 సంచిక : 15 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# నిమ్స్ మన జెమ్స్

## రోబోటిక్ శస్త్ర చికిత్సల్లో అరుదైన ఘనత

- మూడేళ్లలోపే వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు
- 90 శాతానికి పైగా ఉచిత సేవలు
- నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు

**ఖైరతాబాద్, ఆగస్ట్ 03 (జనం సాక్షి) :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) రోబోటిక్ శస్త్రచికిత్సల రంగంలో మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. రోబోటిక్ సర్జరీ సేవలను ప్రారంభించిన మూడేళ్లలోపే 1,000 విజయవంతమైన రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి చేసి ప్రభుత్వ వైద్యరంగంలో విశిష్ట గుర్తింపును సాధించింది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన రోబోటిక్ శస్త్రచికిత్సలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన నిమ్స్, నాణ్యమైన వైద్యసేవలను అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆదర్శంగా నిలుస్తోంది. నిమ్స్ నిర్వహించిన 1,0 00 రోబోటిక్ శస్త్రచికిత్సల్లో యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం 248, సర్జికల్ ఆంకాలజీ విభాగం 162 శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించాయి. వీటిలో ప్రోస్టేట్, మూత్రాశయం, కిడ్నీ, కాలేయం, ప్యాంక్రియాస్, పేగులు, అండాశయం, గర్భాశయం తదితర అవ యవాలకు సంబంధించిన క్లిష్టమైన క్యాన్సర్, ఇత ర ప్రధాన శస్త్రచికిత్సలు ఉన్నాయి. ఈ 1,000 రోబోటిక్ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) పథకా ల ద్వారా రోగులకు పూర్తిగా ఉచితంగా నిర్వహించడం నిమ్స్ సాధించిన మరో విశేష విజయంగా నిలిచింది.

ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా.రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ, ఈ ఘనత సాధించడంలో కీలక పాత్ర పోషించిన యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాల వైద్యులు, అనస్థీషియా నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందం, ఇతర సహాయక విభాగాల సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో మరింత మంది పేద, మధ్యత రగతి ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలను అందిం చేందుకు నిమ్స్ కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలు

### ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం




నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందన్నారు. నిమ్స్ లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని అన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం ఆకాంక్షించారు.

# బీహార్‌లో భాజపాకు భారీ షాక్

## సొంత గడ్డపై బీజేపీ జాతీయ అధ్యక్షుడికి ఓటమి

- ఆయన ఖాళీ చేసిన నియోజకవర్గంలో ప్రశాంత్ కిషోర్ ఘన విజయం
- మూడింట రెండు ఓడిపోయిన బీజేపీ

**పాట్నా, ఆగస్టు 3 (జనంసాక్షి):** నీట్ పేపర్ లీక్ తర్వాత ఢిల్లీ జంతర్ మంతర్‌తో సహా దేశ వ్యాప్తంగా జరిగిన జెన్ జీ ఉద్యమం ఎఫెక్ట్.. బీజేపీ పార్టీపై గట్టిగానే పడింది. జెన్ జీ ఉద్యమం తర్వాత జరిగిన మూడు రాష్ట్రాల్లోని.. మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఫలితాలు వచ్చాయి. ఈ మూడు రాష్ట్రాలు బీజేపీ పాలనలోనే ఉండటం విశేషం. బీహార్‌లో కీలకమైన బంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో జన్ సురాజ్ పార్టీ (జేఎస్పీ) వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఘన విజయం సాధించారు. కంచుకోటలో బీజేపీని మట్టికరిపించారు. తొలిసారి ఎన్నికల్లో గెలిచి చరిత్ర సృష్టించారు. అలాగే ఆయన పార్టీకి తొలి ఎన్నికల విజయాన్ని సొంతం చేశారు. సోమవారం జరిగిన కౌంటింగ్‌లో ప్రశాంత్ కిషోర్ 63,203 ఓట్లు సాధించారు. 44,250 ఓట్లు పొందిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాను 18,953 ఓట్ల తేడాతో ఓడించారు. ఆర్జేడీ అభ్యర్థి రేఖా గుప్తా 14,085 ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు. కాగా, తొలి ఎన్నికల పోటీలో గెలిచిన తర్వాత ప్రశాంత్ కిషోర్ మీడియాతో మాట్లాడారు. బంకీపూర్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన తక్షణ ప్రాధాన్యత అని తెలిపారు. 'ఈ విజయం తర్వాత మా మొదటి ప్రాధాన్యత బంకీపూర్ ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని, మాకు అందించిన ఆశీర్వాదాలను గౌరవించడం. బంకీపూర్ అభివృద్ధికి సాధ్యమైనంత కృషి చేస్తాం. రాబోయే రెండు మూడు నెలల్లోనే ఆ మార్పులు మీకు కనిపిస్తాయి' అని అన్నారు. మరోవైపు అతిగా ఆశలు పెట్టుకోవద్దని బంకీపూర్ నియోజకవర్గం ప్రజలకు ప్రశాంత్ కిషోర్ సూచించారు. ఎమ్మెల్యేగా తన ఎన్నిక బంకీపూర్‌ను 'రాత్రికి రాత్రే బెంగళూరుగా' మార్చదని అన్నారు. అయితే రాబోయే కొద్ది నెలల్లోనే స్పష్టమైన అభివృద్ధి పనులు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు. కాగా, ఈ తీర్పు బీజేపీ నాయకత్వానికి ఒక రాజకీయ సందేశాన్ని ఇచ్చిందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. 'బీహార్ ముఖ్యమంత్రిగా ఒక మంచి వ్యక్తిని నియమించాలని బాంకీపూర్ ప్రజలు బీజేపీ నాయకత్వానికి స్పష్టమైన సందేశాన్ని పంపారు. ఎంపికయ్యే వ్యక్తి సమర్థుడై, నిజాయితీపరుడై ఉండాలి. అసలు ముఖ్యమైన విషయం బీహార్ అభివృద్ధి' అని ఆయన అన్నారు.





## అంతర్జాతీయ దొంగల ముఠా అరెస్ట్

- పలు రాష్ట్రాల్లో దోపిడీ, దొంగతనాలు
- నిందితులు బంగ్లాదేశ్‌కు చెందినవారే
- సహకరించిన స్వదేశీయుడు తరుణ్ సింగ్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

12 లో..

## కాక్రోచ్ విద్యార్థి ఉద్యమం ఒక కేస్ స్టడీ


### ఆర్‌ఎస్‌ఎస్‌లో అంతర్మథనం




- సీజేపీ నిరసనలు దేశ, రాజ్యాంగ వ్యతిరేకమని విమర్శ
- నీట్ పేపర్ లీక్ ఉద్యమం వామపక్ష శక్తుల చేతుల్లోకి వెళ్లిందని ఆరోపణ

**న్యూఢిల్లీ (జనంసాక్షి):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవలే కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసనలు 'దేశ వ్యతిరేకమైనవని', 'రాజ్యాంగ విరుద్ధమైనవని' రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సంయుక్త ప్రధాన కార్యదర్శి అతుల్ లిమాయే అభివర్ణించారు. ఈ ఆందోళనను ఒక 'కేస్ స్టడీ'గా పరిగణించి, దానిపై లోతైన అధ్యయనం చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.
మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన ఏబీవీపీ కార్యకర్తల సమావేశంలో అతుల్ లిమాయే ప్రసంగించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థుల్లో మొదట వ్యక్తమైన ఆగ్రహం సహజమైనదేనని, అయితే కాలక్రమేణా ఆ ఉద్యమం అసాంఘిక శక్తుల చేతుల్లోకి మిగతా 2లో..

## కేవలం 175 నిమిషాల్లో.. అగ్గిపెట్టెలో చీర



- వరల్డ్ రికార్డ్ సాధించిన సిరిసిల్ల నేతన్న
- ఐదున్నర మీటర్ల పొడవుతో.. మగ్గంపైనే ఈ చీర

**సిరిసిల్ల, ఆగస్ట్3 (జనంసాక్షి) :** సిరిసిల్ల నేతన్న మరో అద్భుతాన్ని ఆవిష్కరించాడు. కేవలం మూడున్నర గంటల్లోనే చీరను తయారుచేసి రికార్డ్ సృష్టించాడు . పూర్తిగా మగ్గం పైనే ఈ చీరను నేసి.. ఆశ్చర్య పరిచాడు. ఐదున్నర మీటర్ల పొడవుతో తయారు చేశాడు. తయారు చేసిన చీరను అగ్గి పెట్టలో..పెట్టి.. తన కళా నైపుణ్యాన్ని చాటి చెప్పాడు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ ఈ అద్భుతాన్ని ఆవిష్కరించాడు. సాంప్రదాయ చేనేత మగ్గంపై కేవలం (2 గంటల 50 నిమిషాల్లో) 5.5 మీటర్ల పొడవు, 45 అంగుళాల వెడల్పు గల పూర్తి చేనేత చీరను నేశారు. అనంతరం అదే చీరను ప్రత్యేకమైన నైపుణ్యంతో, 12 సెం.మీ. పొడవు, 6.5 సెం.మీ. వెడల్పు, 2.5 సెం.మీ. ఎత్తు గల అగ్గిపెట్టెలో ఇమిడే విధంగా ప్రదర్శించారు. ఇంత పెద్ద చీరను అవలీలగా అగ్గిపెట్టెలో పెట్టాడు. పూర్తిగా మగ్గం ద్వారానే చీరను తయారు చేశాడు. ఎలాంటి విశ్రాంతి తీసుకోకుండా.. ఈ చీరను రూపొందించారు. సహజంగా.. ఒక చీరను తయారు చేయాలంటే, మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతుంది. కానీ. ఈయన మాత్రం మూడున్నర గంటల్లోనే చీరను తయారు చేశాడు. ఇలాంటి రికార్డు ఎవరు చేయలేదు. హరి ప్రసాద్.. ఈ రికార్డు కోసం సంవత్సరం పాటు ప్రాక్టీస్ చేశారు. దీంతో ఎలాంటి అలసట లేకుండా, పూర్తిగా ఏకాగ్రతతో ఈ మిగతా 2లో..



'న్యాయం గెలుస్తుంది' అన్న మాట నిజమే కావచ్చు... కానీ..

## మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్ నిర్దోషిగా తీర్పు

2 లో..

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

## బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (జనంసాక్షి):** సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులు మాట్లాడాలని సభాపతి ఓం బిర్లా కోరినప్పటికీ, విపక్షాల నినాదాలు కొనసాగడంతో బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026కు సభ ఆమోదం తెలిపింది. ఇటీవల జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు కూడా లోక్‌సభలో చర్చ లేకుండానే ఆమోదం పొందింది. తాజా బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.

# పశ్చిమాసియాలో చల్లారిన ఉద్రిక్తతలు

9 లో..

## జాబ్ క్యాలెండర్ విడుదల చేయండి

- అరకొర నోటిఫికేషన్లు ఎందుకు..?
- నోటిఫికేషన్లు అడిగితే ఎండ్రిన్ తాగమంటారా?
- సీఎం రేవంత్ పై కేటీఆర్ ధ్వజం




**హైదరాబాద్, ఆగస్టు 3 (జనంసాక్షి):** రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. యూత్ డిక్లరేషన్ పేరుతో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఉద్యోగాల భర్తీ విషయంలో యువతను నిరాశపరిచిందని మిగతా 2లో..

## జార్ఖండ్‌లో జేపీఎస్సీ పేపర్ లీక్ కలకలం



- పరీక్ష రద్దు, సీబీఐ విచారణకు విద్యార్థుల డిమాండ్
- నిరాహార దీక్షకు దిగిన విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో
- రాంచీలో ఉద్రిక్తంగా కొనసాగుతున్న ఆందోళనలు
- విద్యార్థుల పోరాటానికి కాక్రోచ్ జనతా పార్టీ మద్దతు

2 లో..

## కర్ణాటక మంత్రివర్గ విస్తరణ

- 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారం
- మొదటిసారిగా 7 మంది ఎస్సీ నేతలకు కేబినెట్‌లో చోటు
- ఏకైక మహిళా నేతగా గాయత్రి శాంతెగౌడ

2 లో..



## సహజీవనం... చట్టబద్ధమే

2 లో..

- భాగస్వామి వేధింపులపై 498ఏ కింద కేసు నమోదు చేయొచ్చు
- పెళ్లి పేరుతో సహజీవనం చేసి హింసిస్తే శిక్ష తప్పదు
- చట్టబద్ధ వివాహం లేదనే కారణంతో రక్షణ నిరాకరించలేం



## విద్యార్థులపై కేసులు ముందుకు తీసుకెళ్లం

- ఎలాంటి బలవంతపు చర్యలు ఉండవు.. సుప్రీంకోర్టుకు కేంద్రం స్పష్టీకరణ
- ఇచ్చిన హామీని కచ్చితంగా అమలు చేయాలని ధర్మాసనం ఆదేశం
- ఎఫ్ఐఆర్‌ల పూర్తి ఉపసంహరణకు విద్యార్థి సంఘాల డిమాండ్

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
4 ఆగస్టు 2026

# నా విద్యార్హతలు...రుణాలు తెరిచిన కాగితం

- బోస్టన్ వర్సిటీలో చదవడంపై వారికెందుకంత కచ్చ
- బిజెపి నేతలు కూడా వారి విద్యార్హతలు తెలిపితే మంచిది
- ఆర్‌టిఐ ద్వారా సమాచార ప్రశ్నకు అభిజిత్ దీప్కే ఘాటు స్పందన

**ముంబై, ఆగస్టు 3 (జనంసాక్షి):**
బీజేపీ కార్యకర్త ఒకరు సమాచార హక్కు చట్టం ఆర్టీఐ ద్వారా తన విద్యార్హతల వివరాలను కోరడంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. బీజేపీ నేతలు కూడా కూడా తమ విద్యకు సంబంధించిన డిగ్రీలను బహిరంగపరచాలని సవాల్ చేశారు. 'నా స్కాలర్‌షిప్ లేఖ, విద్యారుణ లేఖను వెల్లడించడానికి నేను సిద్ధంగా ఉన్నా. చక్రవర్తి తన డిగ్రీని చూపిస్తారా అని అభిజిత్ ప్రధాని మోదీ విద్యార్హతను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, బీజేపీ నాయకులు కూడా తమ విద్యార్హతలను బహిరంగపరుస్తారా? అని అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. 'ఒక బీజేపీ కార్యకర్త నాపై ఆర్‌టిఐ దాఖలు చేసి, నా చదువు ఎలా పూర్తి చేశానో తెలుసుకోవాలనుకుంటున్నట్లు ఇప్పుడే చూశాను. మీ నాయకులు వారి డిగ్రీని చూపిస్తారా అని ఆయనను నేను అడగాలనుకుంటున్నా అని అన్నారు. మరోవైపు తన విద్యా నేపథ్యం ఎందుకు ఒక సమస్యగా మారింది? అని అభిజిత్ ప్రశ్నించారు. 'ఒక సాధారణ యువకుడు బోస్టన్ యూనివర్సిటీలో చదివితే వారికేం బాధ. విద్య పట్ల మీకెందుకంత వ్యతిరేకత? అని నిలదీశారు. బోస్టన్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్, విద్యా రుణంతో తన చదువు కోసం ఆర్థిక సహాయం పొందినట్లు ఆయన వివరించారు. విద్యా రుణం తిరిగి చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై విచారణ జరుపవచ్చని దీప్కే అన్నారు. నీట్ లీక్ వివాదంపై నిరసన ఉద్యమానికి నేతృత్వం వహించడానికి జూన్‌లో భారత్‌కు ఆయన తిరిగి వచ్చారు.

# సింగరేణికి డీప్‌సైడ్ కోల్ బ్యాక్ దక్కదడం సంతోషకరం

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (జనంసాక్షి):**
డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల -2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. ఖఇక్షఅ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. ఖఇక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు. తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సోమవారం వేలం ప్రక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ఖఇక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు. దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే ఉ-8 బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు

## వైభవంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

### అన్ని శాఖల అధికారులను ఆదేశించిన సిఎస్

**హైదరాబాద్,ఆగస్టు 3 (జనంసాక్షి):** స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు అత్యంత ప్రాధాన్యత కలిగినవని, దేశ స్వాతంత్య్ర స్ఫూర్తికి తగిన విధంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ముందుగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని సైనిక్ స్మారక్ వద్ద అమరవీరులకు పుష్పాంజలి ఘటిస్తారని, అనంతరం హైదరాబాద్ గోల్కొండ కోటలోని రాణీ మహల్ లాన్స్‌లో నిర్వహించే ఈ వేడుకలకు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని సిఎస్ తెలిపారు. వేడుకల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖలు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

'న్యాయం గెలుస్తుంది' అన్న మాట నిజమే కావచ్చు... కానీ..!

# మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసు

**ఢిల్లీ ఆగస్టు 3 (జనంసాక్షి):** రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ చీఫ్, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో భారీ ఊరట లభించింది. మైనర్ సహా మహిళా రెజ్లర్ల ఫిర్యాదు మేరకు నమోదైన లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌తోపాటు.. డబ్ల్యూఎఫ్ఐ అసిస్టెంట్ సెక్రటరీగా పని చేసిన వినోద్ తోమర్‌లను ఢిల్లీ న్యాయస్థానం నిర్దోషులుగా తేల్చింది. ఢిల్లీ రోజ్ అవెన్యూ కోర్టులో అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అశ్విని పన్వార్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో వాదనలు విన్న న్యాయస్థానం గురువారం తన తీర్పును రిజర్వ్ చేసింది. మహిళా రెజ్లర్ల ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు బ్రిజ్ భూషణ్‌పై 2023 జూన్ 15న ఛార్జ్‌షీట్ నమోదు చేశారు. ఐపీసీ 354, 354ఏ, 354డీ, 506 సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైంది. 2024 మే నెలలో బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపులు, నేరపూరిత బెదిరింపుల కింద అభియోగాలు నమోదు చేయాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. అయితే ఆరుగురు ఫిర్యాదుదారుల్లో ఒకరు చేసిన ఆరోపణల నుంచి ఆయనను విముక్తి కల్పించింది. డబ్ల్యూఎఫ్ఐ మాజీ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌పైనా అభియోగాలు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణ సమయంలో బ్రిజ్ భూషణ్, తోమర్ ఇద్దరూ బెయిల్ మీద బయట ఉన్నారు. మూడేళ్ల క్రితం భారత ప్రముఖ రెజ్లర్లు బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ.. నిరసనలు చేపట్టడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో రెజ్లర్లు చేపట్టిన ఆందోళన అప్పట్లో దేశ ప్రజల దృష్టిని ఆకర్షించింది. రెజ్లర్లపై వేధింపులు పాల్పడేందుకు తన అధికారాన్ని బ్రిజ్ భూషణ్ ఉపయోగించుకున్నాడని ఢిల్లీ పోలీసులు 2023 సెప్టెంబర్లో కోర్టుకు తెలిపారు.

## జాబ్ క్యాలెండర్ విడుదల చేయండి

**హైదరాబాద్ :** రాష్ట్రంలో నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట ప్రచారంలో కాంగ్రెస్ ఊదరగొట్టిందని విమర్శించారు. జాబ్స్ భర్తీ చేయకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. "రాష్ట్రంలో 20వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీలు ఉంటే.. 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడమేంటి? ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావాలని.. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్ అని సీఎం అంటున్నారు. ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. సీఎం వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించరా..? యూత్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చి ఒక్కటైనా నెరవేర్చిందా..? అని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**రేవంత్ విద్యార్హతపై అనుమానాలు**

"రేవంత్ రెడ్డి అసలు ఏం చదివారో కూడా నాకు అనుమానంగానే ఉంది. ఎవరి సహాయం లేకుండా ఆయన తన ఎన్నికల అఫిడవిట్ నింపగలరా? కనీసం ఒక్క ఉద్యోగ ఇంటర్వ్యూ అయినా ఫేస్ చేశారా? అసలు విద్యార్థుల కష్టాలు, వారి శ్రమ రేవంత్ రెడ్డికి ఏం తెలుసు?" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కరోనా సంక్షోభం వచ్చినా, కేంద్రం నుంచి నిధులు ఆగిపోయినా నిరుద్యోగుల కోసం 2 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా 2 లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తారో సీఎం రేవంత్ రెడ్డి. రాహుల్ గాంధీ వెంటనే సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ప్రజా ప్రభుత్వంలో సింగరేణికి కొత్త ఊపిరి

- వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్ సైడ్ సింగరేణికి దక్కడం చారిత్రక విజయం
- మొన్న నైనీ ప్రారంభించాం, నిన్న తాడిచర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజు సంపాదించాం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క



**మణుగూరు ఆగస్టు 3 (జనంసాక్షి):** ప్రజా ప్రభుత్వంలో సింగరేణి పరిరక్షణ, విస్తరణతోపాటు రాష్ట్ర ఇంధన భద్రతను సుస్థిరం చేయాలన్న సంకల్పంతో గత 30 నెలలుగా అవిశ్రాంతంగా చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తూ సింగరేణికి కొత్త ఊపిరి లభిస్తోందని, ఈ రోజు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు ఏరియా అస్తిత్వానికి అతి కీలకమైన పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కడం చారిత్రక విజయంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అభివర్ణించారు. తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణిని కాపాడుకోవడానికి కొత్త బ్లాక్‌లను దక్కించుకోవాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు.. సింగరేణికి అందిస్తున్న సహకారం వల్లే ఈ రోజు ఈ విజయం సాధ్యమైందన్నారు. అసలు ప్రారంభం అవుతుందా లేదా తెలియని స్థితిలో ఉన్న ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌కు అనుమతులు సాధించేందుకు తానే ఒడిశాకు వెళ్లి అక్కడి ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలిసి ఒప్పించానని, ఫలితంగా ఈ రోజు 36 ఏళ్ల పాటు సంస్థకు బలమైన పునాది వేసే నైనీలో బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. అదే సమయంలో 2013 లో యూపీఏ హయాంలో మైనింగ్ అనుమతులు జారీ చేసిన తాడిచర్ల -2 బొగ్గు బ్లాక్‌ను గత బీఆర్ఎస్ పాలకులు విస్మరిస్తే తాము అధికారంలోకి వచ్చాక కేంద్రంతో సంప్రదింపులు జరిపి గత నెల రెండో వారంలో మైనింగ్ లీజులు జారీ చేయించామని తెలిపారు. ఈ గని ద్వారా 336 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను 45 ఏళ్ల పాటు వెలికితీయడానికి అవకాశం ఉంటుందన్నారు. తాజాగా ఈరోజు (సోమవారం) కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన వేలంలో సింగరేణి పాల్గొని మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ ను దక్కించుకుందని, గత పాలకులు సింగరేణి సంస్థను వేలంలో పాల్గొనకుండా నిరోధించి మన రాష్ట్రంలోని విలువైన బొగ్గు బ్లాక్‌లను వారి అస్మదీయులకు కట్టబెట్టే కుట్రలు చేశారని, తాము సింగరేణి మనుగడ కోసం వేలంలో పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వడం వల్లే ఈ రోజు సింగరేణికి దాదాపు 12 ఏళ్ల తర్వాత వేలంలో ఒక బ్లాక్ దక్కిందని తెలిపారు. ఇది ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో నమోదైన ప్రజా విజయంగా అభివర్ణించారు.

గత నెల రోజుల వ్యవధిలో సింగరేణిలో నమోదైన రెండో అతి పెద్ద విజయంగా పేర్కొన్నారు. మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ గనితో 120 మిలియన్ టన్నుల నాణ్యమైన జీ-8 గ్రేడ్ బొగ్గును వెలికితీయొచ్చని, ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గును మన విద్యుత్ అవసరాలకు వినియోగించుకోవచ్చన్నారు. మరీ ముఖ్యంగా, సింగరేణిలో అత్యంత కీలకమైన ఏరియాల్లో ఒకటైన మణుగూరు ఏరియా అస్తిత్వాన్ని పరిరక్షించడంలో ఈ బ్లాక్ కీలక పాత్ర పోషించనుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 2 వేల మందికి పైగా కార్మికులకు దీర్ఘకాలిక ఉపాధి భద్రత లభించడమే కాకుండా, మణుగూరు ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే, ఈ బ్లాక్‌లోని నాణ్యమైన బొగ్గు నిల్వల ద్వారా రాబోయే 20 సంవత్సరాల పాటు తెలంగాణ విద్యుత్ అవసరాలకు అవసరమైన బొగ్గు సరఫరా చేయడంతో రాష్ట్ర ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో సింగరేణి ప్రయోజనాల పరిరక్షణలో తగిన చొరవ చూపకపోవడం వల్ల కోయగూడెం-3 మరియు సత్తుపల్లి-3 వంటి కీలక బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లిపోయాయని ఆయన విమర్శించారు. ప్రజా ప్రభుత్వం మాత్రం సింగరేణి ప్రయోజనాలనే కేంద్రబిందువుగా తీసుకుని ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటోందని స్పష్టం చేశారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడం, కొత్త బొగ్గు నిల్వలను సంస్థకు అందించడం, ఉద్యోగ భద్రతను పెంపొందించడం, తెలంగాణ విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలికంగా బొగ్గు సరఫరా భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ దక్కడంపై సింగరేణి యాజమాన్యానికి, కార్మిక సంఘాల నాయకులకు, కార్మికులందరికీ అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో గతంలో ప్రైవేట్ పరమైన కోయగూడెం -3 బ్లాక్, సత్తుపల్లి -3 బ్లాక్‌ల ను కూడా సింగరేణికి దక్కేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కేవలం మన రాష్ట్రానికే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ బొగ్గు గనుల సాధన, ఇతర క్రిటికల్ మినరల్స్ అన్వేషణలోనూ సింగరేణి విస్తరించడానికి కార్యచరణ ప్రణాళికను రూపొందించుకొని ముందుకు వెళుతున్నదని తెలిపారు.

# కేవలం 175 నిమిషాల్లో..అగ్గిపెట్టెలో చీర

చీరను తయారు చేశారు. చీర తయారు చేస్తున్న సమయంలో స్థానికులు పెద్ద ఎత్తున వచ్చి తిలకించారు. చీర తయారీ తర్వాత అతన్ని అభినందించారు. ఆగస్టు 7న చేనేత దినోత్సవ సందర్భంగా రికార్డు నెలకొల్పారు. తోటి నేత కార్మికులు అభినందించారు. భారతీయ చేనేత సంప్రదాయానికి, తెలంగాణ చేనేత కళాకారుల నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తుందని హరి ప్రసాద్ చెబుతున్నారు . చేనేత రంగానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడం, యువతలో చేనేతపై ఆసక్తి పెంపొందించడం కోసం ఈ రికార్డు నెలకొల్పినట్లు తెలుపుతున్నారు. సిరిసిల్ల నేతన్నల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు.

# కాక్రోచ్ విద్యార్థి ఉద్యమం ఒక కేస్ స్టడీ

వెల్లిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "సీజేపీ ఆందోళన వెనుక ఉన్న పనితీరు, దానికి అందుతున్న మద్దతు, దాని సైద్ధాంతిక నేపథ్యం గురించి కూలంకషంగా అర్థం చేసుకోవాలి. జూన్ 20 తర్వాత ఈ నిరసనలు ఒక్కసారిగా ఏ విధంగా ఉద్ధృతమయ్యాయి అనేది గమనించాలి" అని ఆయన పేర్కొన్నారు. ఈ నిరసనలకు మద్దతు పలికిన సంస్థల్లో అత్యధికం వామపక్ష భావజాలం ఉన్నవేనని లిమాయే ఆరోపించారు. "భారత్ తేరే తుక్డే తుక్డే" వంటి వివాదాస్పద నినాదాలు చేసే బృందాలతో సంబంధమున్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) వంటి సంఘాలు ఈ ఆందోళనల్లో క్రియాశీలకంగా వ్యవహరించాయని ఆయన తెలిపారు. విభిన్న రంగాలకు చెందిన ఇన్ని సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన శక్తులు ఎవరని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తులు 38 మందికి..

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (జనంసాక్షి):** సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య (సవరణ) బిల్లు-2026కు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రధాన న్యాయమూర్తితో కలిపి న్యాయమూర్తుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 34 నుంచి 38కు పెంచేందుకు జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం అంశాలపై విపక్ష సభ్యులు సభలో నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేయడంతో బిల్లుపై ఎలాంటి చర్చ జరగలేదు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం సభ్యులను మాట్లాడాలని స్పీకర్ ఓం బిర్లా కోరినా ఆందోళనలు కొనసాగడంతో బిల్లును నేరుగా ఓటింగ్‌కు పెట్టగా సభ ఆమోదించింది. ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ విపక్షాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా సభ తిరస్కరించింది.

బిల్లు ఆమోదంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో దాదాపు లక్ష కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతి ఏడాది వేల సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతున్న నేపథ్యంలో న్యాయమూర్తుల సంఖ్య పెంపుతో కేసుల పరిష్కారం వేగవంతమవుతుందని తెలిపారు. పెండింగ్ కేసుల భారం తగ్గించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

## ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కస్టడీ కోరుతూ పిటిషన్

**హైదరాబాద్,ఆగస్టు 3 (జనంసాక్షి):** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణా రెడ్డి కస్టడీ కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఏడు రోజులపాటు కస్టడీకి కోరారు. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ఉదయ్‌కృష్ణారెడ్డి ఫోన్, ల్యాప్‌టాప్‌లను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. మరో ఇద్దరి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీల కోణంలోనూ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇన్‌స్టాలో పరిచయమైన మరో యువతికి ఉదయ్ పెళ్లి ప్రతిపాదనలు పంపినట్లు గుర్తించారు. ఆ యువతి స్టేట్‌మెంట్‌ను ఇప్పటికే పోలీసులు రికార్డు చేశారు. మరోవైపు ఉప్పరపల్లి కోర్టులో ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై మధ్యాహ్నం కోర్టు విచారణ చేపట్టనుంది. పోలీసు కస్టడీ పిటిషన్ రేపు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# సహజీవనం... చట్టబద్ధమే

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (జనంసాక్షి):** సహజీవనం (లివ్-ఇన్ రిలేషన్‌షిప్)లో ఉన్న మహిళలకు కూడా చట్టపరమైన రక్షణ వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ భాగస్వామిని మానసికంగా లేదా శారీరకంగా వేధించిన వ్యక్తిపై భారతీయ శిక్షాస్మృతిలోని (ప్రస్తుతం భారతీయ న్యాయ సంహితకు సంబంధించిన నిబంధనలు) సెక్షన్ 498ఏ కింద క్రిమినల్ కేసు నమోదు చేయవచ్చని తీర్పు వెలువరించింది. వివాహం జరగలేదనే కారణంతో బాధిత మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లోని సమానత్వ హక్కుకు విరుద్ధమని పేర్కొంది.జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. సహజీవనం చేస్తున్న వ్యక్తిని కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో భర్తతో సమానంగా పరిగణించవచ్చని, అలాంటి వ్యక్తి వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోలేడని స్పష్టం చేసింది.

అయితే అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని ధర్మాసనం పేర్కొంది. వివాహం చేస్తానని నమ్మబలికి సహజీవనం కొనసాగిస్తూ హింసకు పాల్పడిన సందర్భాల్లోనే ఈ రక్షణ వర్తిస్తుందని వివరించింది. అలాగే ఇలాంటి కేసుల్లో ప్రాథమిక విచారణ పూర్తి చేయకుండా వెంటనే అరెస్టులు చేయవద్దని పోలీసులకు సూచించింది.సెక్షన్ 498ఏ ఉద్దేశం మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల వేధింపుల నుంచి రక్షించడమేనని, అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం సరికాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒకే తరహా సంబంధంలో ఉన్న మహిళల్లో వివాహితకు మాత్రమే రక్షణ కల్పించి, సహజీవనంలో ఉన్న మహిళకు రక్షణ నిరాకరించడం సమానత్వ సూత్రానికి విరుద్ధమని పేర్కొంది. జీవిత భాగస్వామిని ఎంచుకోవడం వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమని, ఆ స్వేచ్ఛను వినియోగించుకున్న మహిళకు కూడా చట్టపరమైన రక్షణ సమానంగా లభించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

# విద్యార్థులపై కేసులు ముందుకు తీసుకెళ్లం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (జనంసాక్షి):** జంతర్‌మంతర్ వద్ద గత నెల జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లపై ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న గత హామీకి కట్టుబడి ఉన్నామని కేంద్రం ధర్మాసనానికి తెలిపింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ, కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ అమలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గతంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యార్థులపై ఎలాంటి బలవంతపు లేదా అనవసర చట్టపరమైన చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది. ఇప్పటికే విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని కూడా ధర్మాసనం గుర్తుచేసింది.ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశం కోర్టు పరిశీలనలో ఉండగా, ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందనే విషయంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. మరోవైపు విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న సంఘాలు అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నాయి.

## ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతం

**రాంచీ :** ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. పోలీసుల తుపాకీ లాక్కుని పారిపోతుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ సుజిత్ సిన్హా మరణించాడని పోలీసులు తెలిపారు. సాహిబ్‌గంజ్ డివిజనల్ జైలుకు అతడిని తరలిస్తుండగా శనివారం రాత్రి ఈ ఘటన జరిగిందని చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ధన్‌బాద్ జైలు నుంచి సాహిబ్‌గంజ్ మండల్ జైలుకు తరలిస్తుండగా సాహిబ్‌గంజ్ హైవేపై ఈ ఘటన జరిగింది. నాలుగు పోలీసు వాహనాల ఎస్కార్ట్‌తో అతడిని పోలీసులు తరలించారు. అయితే, జమ్‌తారా పోలీస్ స్టేషన్ పరిధిలోకి కాన్వాయ్ వచ్చేసరికి తాను మరుగుదొడ్డికి వెళ్లాలని అతడు కోరాడు. వాహనాలు ఆపిన సమయంలో అతడు తుపాకీ లాక్కుని చీకట్లోకి పారిపోయేందుకు ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. తమపై కాల్పులు కూడా జరిపాడని అన్నారు. స్వీయరక్షణ కోసం తామూ కాల్పులు జరపాల్సి వచ్చిందని చెప్పారు. అతడు ఘటనా స్థలంలోనే మరణించినట్టు అక్కడికి వచ్చిన మెడికల్ టీమ్ ప్రకటించింది. జమ్‌తారా ఎస్పీ శంభు కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఝార్ఖండ్‌లో సిన్హాపై అనేక కేసులు ఉన్నాయి. బలవంతపు వసూళ్లు, హత్య, హత్యాయత్నం తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రాష్ట్రంలో తన ఇన్‌ఫ్లుయెన్స్‌ను కొనసాగించేందుకు పలు గ్యాంగులతో జట్లు కట్టి నెట్‌వర్క్‌ను నిర్మించుకున్నాడని పోలీసులు తెలిపారు.

# జార్ఖండ్‌లో జేపీఎస్‌సీ పేపర్ లీక్ కలకలం



**రాంచీ, ఆగస్టు 3 (జనంసాక్షి):** జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) ప్రిలిమినరీ పరీక్షలో పేపర్ లీక్, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో రాష్ట్ర రాజధాని రాంచీలో విద్యార్థుల ఆందోళనలు ఉద్ధృతమయ్యాయి. పరీక్షను వెంటనే రద్దు చేయడంతో పాటు మొత్తం వ్యవహారంపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో పారదర్శక సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ప్రభుత్వం, జేపీఎస్‌సీకి పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడంతోనే దీక్షకు దిగాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విద్యార్థుల డిమాండ్లపై స్పందించి చర్యలు తీసుకునే వరకు తన దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు.గత నెల జేపీఎస్‌సీ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదలైన తర్వాత పేపర్ లీక్‌కు సంబంధించిన ఆధారాలను ప్రభుత్వానికి సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ పరీక్షలకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లు వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని, నియామక ప్రక్రియలో సమూల మార్పులు అవసరమని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనకు కాక్రోచ్ జనతా పార్టీ మద్దతు ప్రకటించింది. పార్టీ నేత అభిజిత్ దీప్కే నిరసనకారులను కలిసి సంఘీభావం ప్రకటిస్తూ, వారి న్యాయమైన డిమాండ్లకు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం రాంచీలో విద్యార్థుల నిరసనలు కొనసాగుతుండగా, ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.




# కర్ణాటక మంత్రివర్గ విస్తరణ

- 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారం
- మొదటిసారిగా 7 మంది ఎస్సీ నేతలకు కేబినెట్‌లో చోటు
- ఏకైక మహిళా నేతగా గాయత్రి శాంతెగౌడ

**బెంగళూరు, ఆగస్టు 3 (జనంసాక్షి):** కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన మంత్రివర్గాన్ని భారీగా విస్తరించింది. కాంగ్రెస్ అధిష్టానం ఆమోదం తెలపడంతో 20 మంది నూతన నాయకులను కేబినెట్‌లోకి తీసుకున్నారు. సామాజిక సమతుల్యత, అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఎస్సీ, ఎస్టీ, లింగాయత్, వొక్కలిగ, మైనారిటీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేశారు. బెంగళూరులోని లోక్‌భవన్‌లో ఈ సాయంత్రం నూతన మంత్రుల ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది.

**కేబినెట్‌లో కులాల వారీ ప్రాతినిధ్యం**

రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా 7 మంది ఎస్సీ నేతలకు కేబినెట్‌లో చోటు దక్కింది. వీరిలో ఎస్సీ-రైట్ నుంచి ముగ్గురు, ఎస్సీ-లెఫ్ట్ నుంచి ఇద్దరు, లంబానీ, భోవి వర్గాల నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. వీరితో పాటు ముగ్గురు ఎస్టీ (రా) వర్గానికి చెందిన నేతలకు స్థానం లభించింది. లింగాయత్ సామాజిక వర్గం నుంచి 7 మంది, వొక్కలిగ సామాజిక వర్గం నుంచి 5 మంది మంత్రులు తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. ముస్లిం సమాజానికి చెందిన నలుగురికి కీలక పదవులు లభించాయి. ముగ్గురు కేబినెట్ మంత్రులుగా ఎంపికవ్వగా, మరొకరు శాసనమండలి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇతర వెనుకబడిన తరగతుల నుంచి 5 మందికి మంత్రివర్గంలో చోటు కల్పించారు.

**నూతన మంత్రుల జాబితా**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించిన జాబితా ప్రకారం: పి.ఎం. నరేంద్రస్వామి, శివరాజ్ తంగడగి, రుద్రప్ప లామణి, కె.ఎస్. బసవంతప్ప, బి. నాగేంద్ర, టి. రఘుమూర్తి, బి.జెడ్. జమీర్ అహ్మద్ ఖాన్, రిజ్వాన్ అర్షద్, సంతోష్ లాడ్, మధు బంగారప్ప, పుట్టరంగశెట్టి, మంకాల్ వైద్య, అజయ్ సింగ్, ఎన్. చెలువరాయ స్వామి, కె.ఎమ్. శివలింగే గౌడ, హెచ్.సి. బాలకృష్ణ, గాయత్రి శాంతెగౌడ, బసవరాజ్ రాయరెడ్డి, విజయానంద్ కాశప్పనవర్, లక్ష్మణ్ సవది మంత్రులుగా ప్రమాణం చేశారు. మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న ఏకైక మహిళా నేతగా గాయత్రి శాంతెగౌడ నిలిచారు.

# ఈయేడు భారీగా వర్షాలు

- రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి



హైదరాబాద్, ఆగస్ట్3 (జనంసాక్షి) : సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరె-వరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నారు.

# ఇంటర్ గురుకుల విద్యాలయంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మాయత్నం

- వాషింగ్ కంపోర్ట్ తాగిన విద్యార్థిని
- చికిత్స కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- పాఠాలు నేర్వని నిర్వాహకులు




అమ్రాబాద్ ఆగస్టు 03 (జనం సాక్షి): మండల పరిధిలోని గురుకుల విద్యాలయాల్లో వరుస సంఘటనలు చోటు చేసుకుంటున్న నిర్వాహకుల తీరులో మార్పు రావడం లేదు. కొద్ది రోజుల క్రితం నాగర్ కర్నూలు జిల్లా మన్ననూరులోని గురుకుల విద్యాలయం (పిటిజి)లో కలుషిత ఆహారం తిని పలువురు విద్యార్థినిలు ఇబ్బందులకు గురైన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం మననూరులోని టీజీఎస్ఆర్ఈఎస్ జూనియర్ బాలికల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దుస్తులు శుభ్రం చేసేందుకు వినియోగించే వాషింగ్ కంపోర్ట్ తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. పదర మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని మన్నూరులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. కాదా విద్యార్థిని సోమవారం మధ్యాహ్నం దుస్తులు శుభ్రం చేసే దానికి వినియోగించే కంపోర్టు తాగి ఆత్మహత్యాయత్నం ప్రయత్నించింది. గమనించిన తోటి విద్యార్థులు హౌస్ మాస్టర్ మాలికకు తెలియజేశారు. దీంతో ఆమె స్టాఫ్ నర్స్ దివ్యతో కలిసి సదర్ విద్యార్థినిని అచ్చంపేటలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి గల కారణాలు తెలియ రాలేదు. వ్యక్తిగత కారణాల లేక కళాశాలలోని సమస్యల అన్నది స్పష్టం కాలేదు. దీని గురించి విద్యార్థిని స్పందించేందుకు నిరాకరించింది. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు దేవేందర్ తెలిపారు.

### మార్పురాని ప్రిన్సిపల్

ఇటీవల గురుకుల విద్యాలయాల్లో వరుస ఇబ్బందికర సంఘటనలు చోటుచేసుకుంటున్న వాటి నిర్వహణ బాధ్యతలు చూసే ప్రిన్సిపల్ విషయంలో మార్పు రావడం లేదు. మున్ననూరు లో జరిగిన సంఘటన విషయంలో సదర్ ప్రిన్సిపల్ విషయాన్ని బయటకు రాకుండా ప్రయత్నించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా జిల్లా ఉన్నతాధికారులు ఇలాంటి సంఘటనలపై దృష్టి సారిస్తే విద్యా వ్యవస్థలోని లోపాలను సరి చేసే అవకాశం ఉంటుంది.

# అనార్పల్లి వాగులో చిక్కుకున్న అటవీ శాఖ వాహనం




కెరమెరి,ఆగస్టు3 (జనంసాక్షి) : కేరమెరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అంతాపూర్, ఇంద్రానగర్ గ్రామాల్లో ఫీల్డ్ పరిశీలనకు వెళ్లిన అటవీశాఖ సిబ్బంది వాహనం తిరుగు ప్రయాణంలో అనార్పల్లి వాగులో చిక్కుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎఫ్ఆర్ఓ మజారుద్దీన్ ఆధ్వర్యంలో సిబ్బంది అంతాపూర్, ఇంద్రానగర్ తో పాటు బోరిలాల్గూడ, కరంజివాడ ఫీల్డ్ పరిశీలన అనంతరం కెరమెరికి తిరిగి వెళుతున్న క్రమంలో ఇంద్రానగర్, లేండిగూడ మార్గంతో దూరభారం అధికంగా ఉందనే కారణంతో సమీపంలోని అనార్పల్లి వాగును వాహనంతో వెళ్లేందుకు ప్రయత్నించగా వారి వాహనం నీటి ప్రవాహంలో ఉన్న ఇసుకలో ఇరుక్కుపోయింది. సిబ్బంది ఎంత ప్రయత్నించినా వాహనం బయటకు రాకపోవడంతో చివరికి జేసీబీ సహాయంతో వాహనాన్ని బయటకు తీశారు. ఈ ప్రాంతంలో సరైన రోడ్డు, వంతెన సౌకర్యం లేకపోవడంతో ప్రజలతో పాటు అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత వంతెన,రహదారి నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు

- జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్, ఆగస్ట్3 (జనంసాక్షి) : లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా, దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో-ఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.

## క్రికెట్ ఆడటం సులువు..

# రాయి కొట్టే పని ఎంతో కష్టమైనది

- రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్
- రాష్ట్రంలోని తుర్క కాశ ముస్లిం వర్గాలకు యాంత్రిక పనిముట్లు
- రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్




వనపర్తి బ్యూరో, ఆగస్టు3 (జనంసాక్షి) : తుర్క కాషా ముస్లిం కమ్యూనిటీ అభ్యున్నతి, ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోటలోని ఏటీఆర్ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తుర్క కాశ ముస్లిం వర్గాలకు యాంత్రిక పనిముట్లను అందజేసే రాష్ట్ర స్థాయి పథకాన్ని మంత్రి అజరుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన 90 మంది తుర్క కాషా కమ్యూనిటీ లబ్ధిదారులకు రూ.54 లక్షల వ్యయంతో(ఒక్కో లబ్ధిదారునికి రూ.60 వేల విలువైన యూనిట్) జనరేటర్లు, టూల్ కిట్లను పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2025-26 సంవత్సరానికి 2,000 మంది లబ్ధిదారులకు(100శాతం సబ్సిడీ ) రూ.12 కోట్ల వ్యయంతో మంజూరు చేశారు. మంత్రితో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్ రెడ్డి, తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ తుర్క కాషా కమ్యూనిటీ సభ్యులు అత్యంత కష్టమైన వృత్తిలో జీవనోపాధి పొందుతున్నారని, ప్రభుత్వం అందిస్తున్న జనరేటర్లు, టూల్ కిట్లు వారి ఉపాధికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. లబ్ధిదారులు వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. క్రికెట్ ఆడటం సులువు.. కానీ రాయి కొట్టే పని ఎంతో కష్టమైనదని తెలిపారు. కమ్యూనిటీ నుంచి వచ్చిన సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సహకరిస్తుందని, షాదీఖానాల నిర్మాణానికి కూడా అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. విద్యారంగానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి కొత్తకోటలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అహంభావాన్ని వీడి సమాజ అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తుర్క కాషా కమ్యూనిటీ కోసం ప్రభుత్వం తొలిసారిగా ప్రత్యేకంగా ఈ పథకాన్ని అమలు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమాన్ని దేవరకద్ర నియోజకవర్గం నుంచి ప్రారంభించడం గర్వకారణమని తెలిపారు. ప్రజాపాలనలో అన్ని వర్గాలు, అన్ని రంగాలు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయని, గతంలో తుర్క కాషా కమ్యూనిటీ సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వారి సంక్షేమం కోసం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని అన్నారు. కమ్యూనిటీ అవసరాల దృష్ట్యా షాదీఖానాల నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని మంత్రిని కోరారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ కమ్యూనిటీ సంక్షేమం కోసం విశేషంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు.

తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఏర్పడిన ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తోందన్నారు. రాయి కొట్టే పనులు చేసే తుర్క కాషా కమ్యూనిటీ సభ్యులు గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారి కష్టాలను గుర్తించిన ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి జనరేటర్, టూల్ కిట్ అందించే పథకానికి ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2025-26 సంవత్సరానికి 2,000 మంది లబ్ధిదారులకు రూ.12 కోట్ల వ్యయంతో ఈ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. మైనార్టీల ఉపాధి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని, రాష్ట్రంలోని 50 లక్షల మంది మైనార్టీలకు అన్ని రకాల సంక్షేమ ప్రయోజనాలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. శ్రమజీవులైన తుర్క కాషా సామాజిక వర్గానికి అవసరమైన పరికరాలను అందిస్తున్నామని, ఇంకా అర్హులైన వారు ఉంటే వారికీ కూడా ఈ పథకం ద్వారా లబ్ధి కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, కొత్తకోట మున్సిపల్ చైర్‌పర్సన్ పల్లవి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, తుర్క కాషా కమ్యూనిటీ అధ్యక్షుడు బడే సాబ్, టీజీఎంఎఫ్‌సీ ఏజీఎం ప్రవీణ్ కులకర్ణి, పవర్‌బిల్ట్ ఎగ్జిక్యూటివ్ కార్తీక్, సీడీసీ చైర్మన్ చంద్రమోహన్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కమ్యూనిటీ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుకుంటలో పడి ఇద్దరు విద్యార్థుల మృతి



మల్యాల ఆగస్టు 3 (జనంసాక్షి) : మండలంలోని ఎంపీపీఎస్ ఒడ్డెర కాలనీ పాఠశాలలో చదువుతూ సమీకృత బాలుర వసతి గృహంలో ఉంటున్న ఇద్దరు విద్యార్థులు సోమవారం మధ్యాహ్నం టాయిలెట్‌కు వెళు తున్నామని చెప్పి బయటకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు చెరువు కుంటలో పడి మృతి చెందిన సంఘటనతో విషాద ఛాయలు అలుముకున్నాయి. మల్యాల మండల కేంద్రం శివారులోని భీమన్న గుట్ట చెరువు కుంట సమీపంలో విద్యార్థుల దుస్తులు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గల్లంతైన విద్యార్థుల మృతదేహాలను చెరువు నుండి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో విద్యార్థుల మృతదేహాలను తరలించారు. వడ్డెర కాలనీ సమీపంలోని బీసీ హాస్టల్ లో ఉంటూ చదువుతున్న జగిత్యాల పట్టణంలోని టీఆర్‌నగర్ కాగా 4 తరగతి విద్యార్థి జగన్నాథం సుశాంత్, నిజామాబాద్ జిల్లా మోర్తాడు మండల కేంద్రానికి చెందిన 5 తరగతి విద్యార్థి వనం విష్ణు విద్యార్థులు గా గుర్తించారు. సరదాగా స్నానం చేసేందుకు చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. విద్యార్థుల మృతికి బాధ్యులెవరు తమ పిల్లలు భద్రంగానే హాస్టల్లో ఉండి చదువుకుంటున్నారని భావిస్తూ ప్రశాంతంగా ఉంటున్న తల్లిదండ్రులకు సంఘటన భయాందోళనలు కలిగిస్తున్నాయి. నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు బయటకు వెళ్లడం ప్రమాదం జరిగినట్లుగా స్థానికులు భావిస్తున్నారు.

### విద్యార్థుల మృతి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి : మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో సోమవారం చోటుచేసుకున్న విషాద ఘటనపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమాయక విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని,మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సంఘటన కేవలం ప్రమాదం కాదని,ప్రభుత్వ యంత్రాంగం, సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. హాస్టల్ వెనుక ప్రమాదకరమైన కుంట ఉన్నప్పటికీ కంచె ఏర్పాటు,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం,విద్యార్థుల భద్రతకు అవసరమైన పర్యవేక్షణ చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు.

# మహంకాళి ఆలయం వద్ద జోగినిలకు అవమానం

- జోగినిలను అడ్డుకోవడంపై ఆలయం ముందు ఆందోళన
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ జోగిని శ్యామల

హైదరాబాద్, ఆగస్ట్3 (జనంసాక్షి) : ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అధికారుల నిర్లక్ష్యంపై జోగిని శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరం వచ్చినప్పుడే జోగినిలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటుందని ధ్వజమెత్తారు. బోనాల సందర్భంగా జోగినిలకు కనీస ఏర్పాట్లు కూడా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆలయ సిబ్బంది జోగినిలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అత్యుత్సాహం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని జోగిని శ్యామల ఆగ్రహించారు. ఉదయం నుంచే గేట్ల వద్ద పోలీసులు జోగినిలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జోగినిలను అవమానించారని దుయ్యబట్టారు. ఆలయ కమిటీ జోగినిలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు కనీసం జోగినిలని అని కూడా చూడకుండా బయటకు ఎందుకు నెట్టేశారని ప్రశ్నించారు. జోగినిలకు గౌరవం, ప్రత్యేక ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని జోగిని శ్యామల కోరారు.

# బాలికపై హత్యాచారం

గౌహతి, ఆగస్ట్ 3 (జనంసాక్షి) : అస్సాంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల బాలిక అత్యాచా రానికి గురై, అతి దారుణమైన స్థితిలో ప్రాణాలు కోల్పోయింది. కుటుంబ సభ్యులే ఆమెను గుర్తించలేని స్థితిలో ఇంట్లో శవమై కనిపించిందని పోలీసు వర్గాలు వెల్లడిం చాయి. అస్సాంలోని హైలాఖాండీ జిల్లాకు చెందిన ఓ బాలిక కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లింది. తన కజిన్‌తో గొడవ కారణంగా తిరిగి ఇంటికి వచ్చేసింది. వేడుక అనంతరం వారు ఇంటికి వచ్చేసరికి తమ కుమార్తెను ఆ స్థితిలో చూసి హతాశులయ్యారు. హత్య చేయడానికి ముందు తమ బిడ్డపై అత్యాచారం జరిగిందని వారు ఆరోపించారు.

# పోలవరం బ్యాక్‌వాటర్‌పై ముందస్తు అప్రమత్తత

### అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచన



హైదరాబాద్, ఆగస్ట్3 (జనంసాక్షి) : పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ కారణంగా తెలంగాణలోని ప్రాంతాలపై పడే సంభావ్య ప్రభావాన్ని కూడా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ విస్తృతంగా సమీక్షించారు. భూములు, గ్రామాలు, నివాస ప్రాంతాలు, ప్రజా మౌలిక వసతులు, ఇతర ఆస్తులు ఎంతవరకు ముంపునకు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందో నిర్ధారించేందుకు శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణ వాదన కేవలం అంచనాలపై కాకుండా విశ్వసనీయమైన క్షేత్రస్థాయి సమాచారం, సాంకేతిక అధ్యయనాలు, సమగ్ర ఆర్థిక అంచనాలపై ఆధారపడి ఉండాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సంబంధిత ఇతర సంస్థల వద్ద రాష్ట్ర ప్రయోజనాలను దృఢంగా వినిపించాలని సూచిం చారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బ్యాక్‌వాటర్ ప్రభావం ఎంతవరకు ఉంటుందో తెలంగాణ ప్రభుత్వం స్పష్టంగా అంచనా వేసి, సంబంధిత సంస్థల ముందు ఉంచాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పోలవరం ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక వసతులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదేనని సమావేశంలో స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయ సమావేశాలు నిర్వహించి, పెండింగ్ అంచనాలను త్వరగా పూర్తి చేసి, తెలంగాణకు సంబంధించిన పరిహార దావాలను అధికారికంగా సమర్థ సంస్థల ముందు ఉంచాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సమావేశంలో ఇంజినీర్- ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వీ. రమేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, ఇంజినీర్- ఇన్-చీఫ్ (అడ్మిన్) పి.శ్రీనివాస్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) ఆర్.మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మరింత పటిష్టంగా మీ సేవ కేంద్రాలు

- అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించాలి
- ప్రపంచ బ్యాంక్ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్‌తో సిఎస్ భేటీ

హైదరాబాద్, ఆగస్ట్ 3 (జనంసాక్షి) : రాష్ట్రంలో మీ సేవ కేంద్రాలను మరింత పటిష్టపరిచి ప్రజలకు అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రపంచ బ్యాంక్ గ్రూప్‌కు చెందిన డిజిటల్ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. సమావేశంలో డిజిటల్ ఇండియా వికసిత్ భారత్?2047 లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల ఆధునీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాల కల్పన, కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, యువతకు ఐటీ ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్ రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు అభినందించారు. రాష్ట్రంలో డిజిటల్ సామర్థ్యాల పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం, ప్రజా సేవల నాణ్యత మెరుగుదల, డేటా గవర్నెన్స్ వంటి రంగాల్లో ప్రపంచ బ్యాంక్ అందించగల సాంకేతిక సహకారం, జ్ఞాన భాగస్వామ్యం, అంతర్జాతీయ ఉత్తమ విధానాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశంలో డిజిటల్ రంగంలో పెట్టుబడులకు హర్యానా, తెలంగాణ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. అనంతరం టి-ఫైబర్ ప్రాజెక్టు పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవల విస్తరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. టి-ఫైబర్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, ప్రపంచ బ్యాంక్ డిజిటల్ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ, టి-ఫైబర్ ఎం.డి. తదితరులు పాల్గొన్నారు.

# బీహార్‌లో బీజేపీకి గట్టి హెచ్చరిక

## యువత రాజకీయ మార్పుకు సంకేతమా?

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీశాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాజీనామా చేసిన అసెంబ్లీ నియోజకవర్గంలో ఆ పార్టీ ఓటమి చెందడం, అదే స్థానంలో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ విజయం సాధించడం కేవలం ఒక నియోజకవర్గ ఫలితంగా మాత్రమే చూడలేం. ఇది రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అధికార పక్షం, ప్రజల మనోభావాలను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరాన్ని గుర్తు చేసిన పరిణామంగా భావించాలి.

ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకి శాశ్వత విజయాలు ఉండవు. ప్రజల విశ్వాసాన్ని నిరంతరం నిలబెట్టుకున్నవారే రాజకీయంగా నిలదొక్కుకుంటారు. గత విజయాలపై ఆధారపడుతూ, ప్రజల మారుతున్న ఆశలు, ఆకాంక్షలను విస్మరించినప్పుడు ఎన్నికల ఫలితాలు అనూహ్యంగా మారిపోతాయని బీహార్ మరోసారి గుర్తు చేసింది.

ప్రశాంత్ కిషోర్ విజయం కూడా ప్రత్యేక చర్చకు కారణమైంది. ఎన్నికల వ్యూహకర్తగా అనేక పార్టీలను విజయతీరాలకు చేర్చిన ఆయన, ఇప్పుడు స్వయంగా ప్రజల తీర్పు కోరగా విజయాన్ని అందుకోవడం కొత్త రాజకీయ ప్రయోగాలకు ప్రజలు అవకాశమిస్తున్నారనే సంకేతంగా పలువురు విశ్లేషిస్తున్నారు. వ్యక్తి కంటే ప్రజలకు ప్రత్యామ్నాయం ముఖ్యమవుతోందనే భావన ఈ ఫలితంలో కనిపిస్తోంది.

సంపాదకీయం

ముఖ్యంగా యువత రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదుగుతోంది. దేశంలో అత్యధిక ఓటర్ల వర్గంగా ఉన్న యువత ఇప్పుడు కులం, మతం, నినాదాల కంటే ఉపాధి, విద్య, ఆర్థిక అవకాశాలు, జీవన ప్రమాణాలు, పారదర్శక పాలన వంటి అంశాలపై ఎక్కువ దృష్టి పెడుతోంది. సోషల్ మీడియా, డిజిటల్ సమాచార విస్తరణతో రాజకీయాలను విశ్లేషించే తీరు కూడా మారింది. గతంలోలా ప్రచారమే గెలుపును నిర్ణయించే పరిస్థితులు క్రమంగా మారుతున్నాయి.

జనంసాక్షి

ఇటీవలి సంవత్సరాల్లో దేశంలోని పలు రాష్ట్రాల్లో వచ్చిన ఎన్నికల ఫలితాలను పరిశీలించినా ఓటర్లు అధికార పార్టీలను ప్రశ్నించే ధోరణి పెరిగినట్లు కనిపిస్తోంది. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైతే ఎంత బలమైన పార్టీ అయినా ఎదురుదెబ్బ తప్పదనే సందేశం పలుమార్లు వ్యక్తమైంది. బీహార్ ఫలితం కూడా అదే వరుసలో నిలిచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఒక నియోజకవర్గం లేదా ఒక రాష్ట్ర ఎన్నిక ఆధారంగా దేశ రాజకీయాలపై తుది నిర్ణయానికి రావడం సరైంది కాదు. ప్రతి రాష్ట్ర రాజకీయ పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. అయినప్పటికీ ఈ ఫలితం అన్ని రాజకీయ పార్టీలకు ఒక హెచ్చరిక. ప్రజల విశ్వాసాన్ని శాశ్వతంగా భావించకుండా, నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యతను ఇది గుర్తు చేస్తోంది.

రాజకీయాల్లో మార్పు సహజం. కానీ ఆ మార్పును ముందుగా గుర్తించి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ విధానాలను మార్చుకునే పార్టీలే భవిష్యత్తులో నిలబడగలవు. బీహార్ ఫలితం ఒక నియోజకవర్గానికి మాత్రమే పరిమితం కాదు. దేశ రాజకీయాలకు, ముఖ్యంగా యువత మనోభావాలను అర్థం చేసుకోవాలనుకునే ప్రతి రాజకీయ పార్టీకి ఇది ఒక స్పష్టమైన రాజకీయ సందేశం.

# జన్-జీ యువత ప్రశ్నలకు సమాధానం - అణచివేత కాదు

ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యార్థి ఉద్యమాలు, యువజన నిరసనలు కొత్త విషయం కావు. ప్రపంచ చరిత్రను పరిశీలించినా, భారతదేశ రాజకీయ పరిణామాలను విశ్లేషించినా, సామాజిక మార్పులకు, విద్యా సంస్కరణలకు, ప్రజాస్వామ్య పునరుజ్జీవనానికి యువతే ప్రధాన చోదకశక్తిగా నిలిచింది. అధికార వ్యవస్థలు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయిన సందర్భాల్లో విద్యార్థులే ముందుకు వచ్చి ప్రజా చర్చను నిర్మించారు. ఇటీవల పరీక్షల నిర్వహణలో లోపాలు, ప్రశ్నాపత్రాల లీకులు, ఉపాధి అవకాశాలపై అనిశ్చితి, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా యువతలో పెరిగిన అసంతృప్తి జంతర్ మంతర్ వేదికగా మరోసారి బయటపడింది.




ప్రజాస్వామ్యం ప్రభుత్వం మాత్రమే కాపాడాల్సిన వ్యవస్థ కాదు; పౌరులు కూడా అదే బాధ్యతను పంచుకోవాలి. ఈ మొత్తం పరిణామం నుంచి ఒక స్పష్టమైన సందేశం వెలువడుతోంది. నేటి యువతకు అధికార భాష కంటే జవాబుదారీతనం ముఖ్యమైంది; ప్రచారం కంటే పారదర్శకత ముఖ్యమైంది; హామీల కంటే ఫలితాలు ముఖ్యమయ్యాయి.

కాక్రోచ్ జనతా పార్టీ పిలుపుతో జరిగిన ఈ నిరసనల్లో విద్యార్థులు, యువతతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సాధారణ పౌరులు కూడా పాల్గొనడం ఉద్యమానికి విస్తృత సామాజిక మద్దతు లభించిందనే సంకేతాన్ని ఇచ్చింది. ఉద్యమం తీవ్రతరమైన తర్వాత కేంద్ర ప్రభుత్వం పరీక్షా వ్యవస్థలో సంస్కరణల అవసరాన్ని అంగీకరించడం, కొన్ని రాజకీయ పరిణామాలు చోటుచేసుకోవడం, విద్యార్థులపై నమోదైన కొన్ని కేసులను ఉపసంహరించుకునే దిశగా చర్యలు తీసుకుంటామని ప్రకటించడం ప్రజాస్వామ్య ఒత్తిడికి ప్రభుత్వాలు ఎలా స్పందిస్తాయో చూపించింది. అయితే మరోవైపు, నిరసనల్లో పాల్గొన్న కొందరిపై నమోదైన కేసులు కొనసాగుతున్నాయనే వార్తలు ప్రజల్లో కొత్త ప్రశ్నలను లేవనెత్తాయి.

జనంసాక్షి

ప్రత్యేకంగా విద్యార్థిని రుచిగా సింగ్‌పై ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఎఫ్.ఐ.ఆర్. నమోదు కావడం, ఆ కేసు కొనసాగుతుండడం రాజకీయంగానూ, న్యాయపరంగానూ చర్చనీయాంశమైంది. ఈ చర్యను ప్రతిపక్ష నాయకులు రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణిస్తుండగా, చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యత అని అధికార వర్గాలు వాదిస్తున్నాయి. ఈ రెండు వాదనల మధ్య అసలు ప్రశ్న మాత్రం ఒకటే---ప్రజాస్వామ్యంలో విమర్శకు ఉన్న హద్దులు ఏమిటి? అలాగే చట్ట అమలులో సమానత్వం ఎంతవరకు పాటించబడుతోంది?

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను కల్పించింది. అదే సమయంలో ఆ స్వేచ్ఛకు రాజ్యాంగపరమైన పరిమితులు కూడా ఉన్నాయి. వ్యక్తిగత దూషణలు, ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు, హింసకు ప్రేరేపించే చర్యలు చట్టపరమైన పరిశీలనకు లోబడతాయి. అయితే ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలను, ప్రధానమంత్రిని లేదా ఇతర ప్రజాప్రతినిధులను విమర్శించడం మాత్రమే నేరంగా పరిగణించబడదు. అందువల్ల ప్రతి కేసును దాని వాస్తవ పరిస్థితులు, వర్తించే చట్టాలు, న్యాయస్థానాల పర్యవేక్షణ ఆధారంగా పరిశీలించడం అవసరం. అదే సమయంలో చట్టం ఎంపికచేసి అమలవుతోందనే భావన ప్రజల్లో ఏర్పడకుండా ప్రభుత్వం జాగ్రత్త పడాలి.

ఈ ఉద్యమం మరో ముఖ్యమైన అంశాన్ని కూడా తెరపైకి తీసుకొచ్చింది. రాజకీయ పార్టీల నిధుల పారదర్శకత. దేశంలో అన్ని రాజకీయ పార్టీల ఆదాయ వనరులు, విరాళాల వివరాలు, వ్యయ విధానం ప్రజలకు మరింత పారదర్శకంగా అందుబాటులో ఉండాలనే డిమాండ్ గత కొన్నేళ్లుగా బలపడుతోంది. ప్రజాస్వామ్యంలో పారదర్శకత ఏ ఒక్క పార్టీకి మాత్రమే వర్తించే సూత్రం కాదు. అధికార పార్టీ అయినా, ప్రతిపక్ష పార్టీ అయినా, కొత్తగా ఏర్పడిన రాజకీయ సంస్థ అయినా ఒకే ప్రమాణాలకు లోబడి ఉండాలి. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేది చట్టపరమైన సమానత్వమే.

అలాగే రాజకీయ నాయకులపై నమోదైన క్రిమినల్ కేసుల అంశం కూడా నిరంతరం చర్చలో ఉంది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులపై తీవ్రమైన ఆరోపణలు నమోదైన సందర్భాలు ఉన్నాయి. అయితే ఆరోపణ నమోదు కావడం, నేరం నిరూపితమవడం రెండూ ఒకటి కావు. ప్రతి ఒక్కరికీ న్యాయపరమైన విచారణ, సహజ న్యాయ సూత్రాల ప్రకారం తన వాదన వినిపించే హక్కు ఉంది. అదే సమయంలో ప్రజాప్రతినిధులపై ఉన్న తీవ్రమైన కేసులను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడం కూడా ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. వేగవంతమైన, నిష్పాక్షిక విచారణే ప్రజల విశ్వాసాన్ని పెంచుతుంది.

ఇటీవలి కాలంలో యువత ఉద్యమాల స్వరూపం కూడా మారింది. ఒకప్పుడు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మాత్రమే ఉద్యమాలు జరిగేవి. ఇప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా స్వయంగా యువత అభిప్రాయాలను వ్యక్తం చేస్తోంది. సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్న ఈ కాలంలో ప్రభుత్వ నిర్ణయాలు, పోలీసు చర్యలు, న్యాయపరమైన పరిణామాలు క్షణాల్లో దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్నాయి. ఈ కొత్త వాస్తవాన్ని ఏ ప్రభుత్వం కూడా విస్మరించలేను. సంభాషణకు బదులుగా అనుమానంతో స్పందిస్తే అసంతృప్తి మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. అదే సమయంలో ఉద్యమాలు కూడా బాధ్యతాయుతంగా ఉండాలి. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కు ప్రజాస్వామ్యానికి బలం. అయితే శాంతియుత నిరసన, వాస్తవాధారిత విమర్శ, ప్రజా ఆస్తుల రక్షణ, వ్యక్తిగత గౌరవాన్ని కాపాడడం వంటి విలువలు కూడా అంతే ముఖ్యమైనవి. ప్రజాస్వామ్యం ప్రభుత్వం మాత్రమే కాపాడాల్సిన వ్యవస్థ కాదు; పౌరులు కూడా అదే బాధ్యతను పంచుకోవాలి. ఈ మొత్తం పరిణామం నుంచి ఒక స్పష్టమైన సందేశం వెలువడుతోంది. నేటి యువతకు అధికార భాష కంటే జవాబుదారీతనం ముఖ్యమైంది; ప్రచారం కంటే పారదర్శకత ముఖ్యమైంది; హామీల కంటే ఫలితాలు ముఖ్యమయ్యాయి. విద్య, ఉపాధి, పరీక్షల విశ్వసనీయత, సమాన అవకాశాలు, అవినీతి నియంత్రణ వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకుంటేనే యువత విశ్వాసాన్ని తిరిగి పొందగలదు. విమర్శలను శత్రుత్వంగా కాకుండా ప్రజాస్వామ్య స్పందనగా స్వీకరించినప్పుడే పరిపాలన బలపడుతుంది.

**చరిత్ర చెబుతున్న ఒక గొప్ప పాఠం ఏమిటంటే**---ప్రజల ప్రశ్నలను తాత్కాలికంగా అణచివేయడం సాధ్యమవచ్చు; కానీ వాటిని శాశ్వతంగా మూయించడం సాధ్యం కాదు. ముఖ్యంగా చదువుకున్న, సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించే నేటి యువతతో ప్రభుత్వాల సంబంధం భయపెట్టడం పై కాకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా, పారదర్శకతతో వ్యవహరించాలి, ఇప్పటికే ప్రజలు విశ్వాసం కోల్పోయిన కేంద్ర ప్రభుత్వం మరింత ఆత్మవిమర్శతో నిజాయితీగా రాజ్యాంగ నియమాలకు, పౌర హక్కులకు విలువ ఇస్తూ. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారానికి నిజమైన బలం ప్రతిపక్షాన్ని బలహీనపరచడంలో కాదు; విమర్శలను వినగల ధైర్యంలో, తప్పులను సరిదిద్దుకునే సంస్కృతిలో, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే పరిపాలనలో ఉంటుంది అనే విషయాన్ని గ్రహించటం మంచిది. జన్-జీ యువత కు ఇచ్చిన మాటను నిలబెట్టుకొనే బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వం పైనే ఉంది. మాట తప్పితే కేంద్ర ప్రభుత్వం అధికారానికే ప్రమాదం ముంచుకు రావచ్చు.



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
ramkishore.1504
@gmail.com

# ఉద్యమ గొంతుక మూగబోయింది..

తెలంగాణ ఉద్యమ చరిత్రలో 2001 నుంచి 2026 వరకు సాగిన పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రస్థానం ఒక ప్రత్యేక అధ్యాయం.తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావ దశ నుంచే ఉద్యమంలో భాగస్వామిగా నిలిచిన ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ బలోపేతానికి, ఉద్యమ కార్యక్రమాల నిర్వహణకు క్షేత్రస్థాయిలో పనిచేశారు.పదవుల కోసం ఉద్యమాన్ని ఆశ్రయించిన నాయకుడిగా కాకుండా, ఉద్యమాన్నే రాజకీయ జీవితానికి పునాదిగా చేసుకున్న నాయకుడిగా ఆయన ప్రస్థానం సాగింది.జిల్లా పార్టీ కన్వీనర్,ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు,రాష్ట్ర స్థాయి బాధ్యతలు నిర్వహిస్తూ తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తనవంతు పాత్ర పోషించారు. ఉద్యమ ఉధృతిలో ఆందోళనలు, రాస్తారోకోలు, ప్రజా సమస్యలపై పోరాటాల్లో ముందుండి నడిచారు.2001లో ఏర్పాటుచేసిన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరి రైతు నాగలి గుర్తుపై నల్లబెల్లి మండల జెడ్పిటిసిగా గెలుపొంది,జెడ్పీ ఫ్లోర్ లీడర్‌గా కొనసాగారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 2016 నుండి 2018 వరకు తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ (Civil Supplies Corporation) ఛైర్మన్‌గా పనిచేశారు. 2018లో నర్సంపేట ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాప్రతినిధిగా బాధ్యతలు చేపట్టారు.2018లో శాసనసభలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) సభ్యుడిగా ఉన్నాడు.అయితే ఆయన రాజకీయ ప్రస్థానాన్ని కేవలం ఒక పదవీ కాలంతో కొలవడం సరికాదు. 2001లో ఉద్యమ బాట పట్టి.. 2026 వరకు తెలంగాణ రాజకీయాల్లో కొనసాగిన 25 ఏళ్ల ప్రయాణమే ఆయనకు అసలైన గుర్తింపు.పెద్ది సుదర్శన్ రెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని కేవలం ఎమ్మెల్యేగా గెలిచిన ఐదేళ్లతో కొలవలేం.2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావ దశ నుంచి 2026 వరకు సాగిన ఆయన రాజకీయ ప్రయాణంలో ఉద్యమం, పార్టీ నిర్మాణం, ప్రజా సమస్యలు,ఎన్నికల రాజకీయాలు కలిసిపోయాయి. జిల్లా కన్వీనర్‌గా,జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర స్థాయి నాయకుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా,ఎమ్మెల్యేగా ఆయన నిర్వహించిన బాధ్యతలు ఒక్కొక్కటి ఒక్కో దశను సూచిస్తాయి. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలో వరంగల్ జిల్లాలో పార్టీ



జనంసాక్షి

కార్యక్రమాలను ముందుండి నడిపించడం ఆయన రాజకీయ జీవితంలో కీలక అధ్యాయంగా మిగిలిపోయింది. ఎమ్మెల్యే అయిన తర్వాత కూడా కనీ విని ఎరగని రీతిలో వేలాది రూపాయలను నర్సంపేట నియోజకవర్గానికి తెచ్చి అభివృద్ధి చేసిన ఘనత తనది.తన నియోజకవర్గంలో ఎవరికి ఏం అవసరమో ముందే తెలుసుకొని చేసినటువంటి వ్యక్తి తాను.

తెలంగాణ ఉద్యమంలో ఓరుగల్లు వరంగల్ కు ఒక చరిత్ర ఉంది.ఆనాటి టిఆర్ఎస్ నేటి బి ఆర్ ఎస్ పార్టీ 2001 నుండి 2026 వరకు అనేక భారీ బహిరంగ సభలు నిర్వహించి విజయవంతం చేశాయి.దానికి ముఖ్య కారణం పెద్ది సుదర్శన్. తెలంగాణ ఉద్యమ చరిత్రలో 2010 డిసెంబర్ 16 ఒక కీలక ఘట్టం.ఓరుగల్లు ప్రకాశ్‌రెడ్డి పేటలో కేసీఆర్ నిర్వహించిన భారీ బహిరంగ సభ "మహా గర్జన" తెలంగాణ ఆకాంక్షకు బలమైన స్వరంగా మారింది.ఆ సభను విజయవంతం చేయడంలో క్షేత్రస్థాయి నాయకత్వం కీలకంగా నిలిచింది.ఆ సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉద్యమాన్ని ముందుకు నడిపించిన నాయకుల్లో పెద్ది సుదర్శన్‌రెడ్డిది ప్రత్యేక పాత్ర. ఈ సభ ప్రపంచంలోనే అత్యంత పేరుగాంచి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో పేరు సంపాదించింది. 2017 ఏప్రిల్ 27 నగరంలోని ప్రకాశ్‌రెడ్డిపేటలో పది లక్షల మందితో ప్రగతి నివేదన పేరుతో భారీ బహిరంగసభ ను నిర్వహించడంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పాత్ర కీలకమైంది.14 విద్యార్థి సంఘాలను సమన్వయం చేసి, కాకతీయ విశ్వవిద్యాలయం వేదికగా విద్యార్థి పొలికేక నిర్వహించడంలో తన పాత్ర పోషించింది కూడా పెద్ది సుదర్శన్ రెడ్డి. విద్యార్థి ఉద్యమాలకు కూడా తన వంతు సహాయ సహకారాలు అందించి, విద్యార్థులు అరెస్ట్ అయినప్పుడు కూడా ముందుండి పోరాడిన వ్యక్తి.పార్టీ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సమీపంలో ఏప్రిల్ 27, 2025న కేసీఆర్ అధ్యక్షతన భారీ రజతోత్సవ బహిరంగ సభ నిర్వహించారు. దీనికి కూడా వేసినటువంటి కమిటీలో ముఖ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి. లీడర్లు వస్తా ఉంటారు పోతా ఉంటారు. కానీ ఒకే నాయకున్ని కెసిఆర్ నమ్ముకుని తన వెంట నడిచి, ఎన్నో ఆటుపోటులు ఎదురైన, ఎంతోమంది కించపరిచిన,గుండె నిబ్బరంతో ముందుకు సాగిన మహోన్నత వ్యక్తి. విద్యార్థులే కాదు, మహిళలు,జర్నలిస్టులు, డాక్టర్లు, న్యాయవాదులు, టీచర్లు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్లు, పోలీసులు, ఇంజనీర్లు, వివిధ యూనియన్లకు సంబంధించినటువంటి వ్యక్తులు కుల సంఘాలతో మంచి సంబంధం కలిగినటువంటి వ్యక్తిగా పెద్దిని చెప్పవచ్చు.ఏ రోజు ఎవర్ని కూడా కించపరచకుండా, గౌరవమించి మర్యాదగా మాట్లాడిన వ్యక్తి తాను. కష్టం వస్తే కడుపులో పెట్టుకున్నాడు తప్ప బయటికి చెప్పుకోలేదు.ఇలా అన్ని సబ్బండ వర్గాల ను మమేకం చేసిన మేధావి సుదర్శన్ అన్న. ఎలా బతికావురా అనేది కాదు ఏం బతికావురా అనేలా వుంది పెద్ది జీవితం. అంతిమయాత్రలో విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు వివిధ వర్గాల ప్రజలు పార్టీలకతీతంగా వేలాది మందిగా తరలివచ్చి పెద్దన్న మళ్లీ రా అని దిక్కులు బిక్కటిల్లెల రోదించారు. అశేష జనం రావడానికి ఆయన స్వభావం అతి ముఖ్యమైనది. ఎవరిని కూడా పల్లెత్తు మాట అనని యోధుడు, ప్రతి ఒక్కరికి మర్యాదపూర్వకంగా పలకరించే ఉద్యమ వీరుడు.. పెద్దన్న...ఉద్యమం మార్గం.. ప్రజలే గమ్యం.. తెలంగాణ సాధనే లక్ష్యం.పెద్ది సుదర్శన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ఈ మూడు మాటలకు ప్రతిరూపంగా నిలిచింది.అందుకే తెలంగాణ జనం అంటుంది లాల్ సలాం. నీ జ్ఞాపకాలు ఎప్పుడూ సజీవంగానే ఉంటాయి.



డా. మోటె చిరంజీవి
సామాజిక వేత్త,విశ్లేషకుడు,

# బీజేపీ భవిష్యత్తు ఇక బేఫికర్ కాదు!

జెన్ జీ ఎఫెక్ట్ బీజేపీకి ఆరంభం మాత్రమే అనే సంకేతం తాజాగా బిహార్ లో నమోదైంది. సౌత్‌నూ ఏలుతానంటూ గాంభీర్యం ప్రదర్శిస్తున్న కాషాయ పార్టీకి తన స్థావరమైన నార్త్ లోనే ప్రాభవం మసకబారుతున్నది. కడపటి జెన్ జీల ఉద్యమంలోనూ మెజారిటీ భాగస్వామ్యం ఉత్తర భారతం నుంచే ఉండగా, ఇపుడు అక్కడే మళ్ళీ జెన్ జీ ఎఫెక్ట్ తో కీలకమైన, ప్రాముఖ్యత గల తన సిటింగ్ స్థానాన్ని సింపుల్‌గా కోల్పోయింది.

సాక్షాత్తూ భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాజీనామాతో అనివార్యమైన బాంకీపూర్ బై పోల్ లో కమలం పువ్వు అమాంతం వాడిపోయింది. ఏకంగా 1995 నుంచి ఆ నియోజకవర్గంలో ఓటమి ఎరుగని బీజేపీ మొట్టమొదటిసారి అదీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉండగా నిలువునా ఓడిపోయింది. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన దరిమిలా, పెద్దల సభకు పోయిన నేపథ్యంలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బాంకీపూర్ శాసన సభ్యత్వానికి నితిన్ నబీన్ రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆ స్థానంలో జన్ సురాజ్ పార్టీ (జేఎస్పీ) అధిపతి ప్రశాంత్ కిశోర్ చాలా ప్రశాంతంగా, అలవోకగా విజేత అయ్యారు. నితిన్ నబీన్‌కు, బీజేపీకి ప్రతిష్టాత్మకమైన బాంకీపూర్ లో పీకే తొలిసారి ఎమ్మెల్యే గా విజయం సాధించి సంచలనం సృష్టించారు. ఎందరినో విజేతలను చేస్తూ, ప్రభుత్వాల ఏర్పాటులో, రాజకీయ పార్టీల తలరాతలు మార్చడంలో నిపుణుడైన పీకే ఈసారి తానే విజయతీరాలకు అదీ గట్టి శిఖరాన్ని ఢీకొట్టి సునాయాసంగా చేరారు. బిహార్ లోని ఈ ఉప ఎన్నిక ఫలితం బీజేపీకి తీరని చేదు అనుభవాన్నే మిగిల్చింది. అసలే నీట్ వ్యవహారంలో జెన్ జీతో పెట్టుకొని, నిద్రకు దూరమైన భారతీయ జనతా పార్టీ తాజా పరిణామంతో ఆకాశం వీడి నేల మీద నడిచే స్థితికి చేరుతోంది. బీజేపీ భవిష్యత్తు ఇక బేఫికర్ కాదు అనే తీక్షణమైన సందేశాలు వరుసగా దేశ రాజకీయాల్లో చోటుచేసుకోవడం గమనించదగిన పరిణామం. మిడిసిపాటు, అతి విశ్వాసం, సాధారణ జనం అంతరంగానికి, మనోభావాలకు భిన్నమైన ధోరణులకు ప్రజాస్వామ్యంలో చోటు లేదని మొన్నటి ఢిల్లీ జెన్ జీ ఉద్యమం, నేటి బిహార్ బై పోల్ ఫలితం రూఢీ చేస్తోంది. ఎన్డీయే హ్యాట్రిక్ పాలనకు ముందు అంచనా కట్టినన్ని పార్ల మెంటు సీట్లు రాకపోవడంతో ప్రాంతీయ పార్టీల మద్దతు మీద ఆధారపడి మనగలుగుతున్న బీజేపీ ఆనాడే వాస్తవ స్థితిని అంగీకరించా ల్సింది. తనకు ఎదురు లేదనే భ్రమల్లోంచి బయటపడాల్సింది. దేశ ప్రజల గుండె చప్పుడు సరిగా వింటూ, ఇకనైనా యధార్థ స్థితిగతుల మేరకు పరిపాలన చేస్తే ఆ పార్టీకే మంచిదని తాను బాగా నమ్ముకొని, ఆధారపడే ఉత్తర భారతంలోని బాంకీపూర్ బీజేపీకి పదునైన సందేశం పంపిస్తున్నది.

జనంసాక్షి



ఇల్లెందుల దుర్గాప్రసాద్
జర్నలిస్ట్, 9440850384

## శ్రీకారం

ఈదేశం మీ సొత్తండి
డ్రగ్స్ బారిన పడకండి
ముష్కరుల తరమండి
బతుకు బాట నెరగండి

నేటి యువతే నవతండి
మమతను పండించండి
ద్వేషం విడనాడండి
సమతను నెలకోల్పండి

కన్నవారిని తలవండి
ప్రగతికి పట్టం కట్టండి
జగతికి ప్రతిభను చాటండి
క్రాంతిని స్వాగతించండి

విత్తము ముఖ్యము కాదండి
పొత్తము చేత పట్టండి
చిత్తము నిలిపి కదలండి
మత్తుకు చిత్తు కాకండి

ఆరోగ్యమే మన భాగ్య మండి
భవితకు ప్రాణం పోయండి
విజ్ఞానమే పరిజ్ఞానమండి
అజ్ఞానాన్ని సమాధి చేయండి

భారతమాతను సదా కొలవండి
భావి పౌరులుగా వెలగండి
వ్యసనానికి భానిసలవకండి
నేడే ఐక్యతగా శ్రీకారం చుట్టండి

జనంసాక్షి

నమిలి కొండ నాగేశ్వర్ రావు
సెల్ నెం 8688553470 మేడ్చల్

## యాంటీవైరస్

బొద్దింకలుగా అవమానింపబడ్డ
విద్యార్థులంతా
గుండె మండి సంఘటితమయ్యారు
చినుకూ చినుకూ కలిసి వరదై పోటెత్తినట్టు
మహాదండై రాజధాని రోడ్ల మీదికెక్కారు
కాలుతున్న కడుపులతో కదిలి
నిరసనల నిప్పులు కక్కారు

లాఠీల చేతులు కర్కశంగా విరుచుకుపడ్తే
గులాబి పువ్వుల్నందించారు
జాతీయ జెండాలెత్తిపట్టారు

బాష్పవాయువులు ప్రయోగించి
భయపెట్టజూస్తే
రాజ్యాంగ పీఠిక పఠనం గావించారు
సెల్యూట్ కొట్టి దేశగీతమాలపించారు

నీటిఫిరంగులతో చెదరగొట్టజూస్తే
రెయిన్ డాన్సులు చేశారు



ఎదురేగి ఎగిరెగిరి గంతులేశారు

బారికేడ్లు అడ్డుపెట్టి ఆపబోతే
బట్టలారేసుకున్నారు
భారీతాళ్ళతో కట్టడి చేయబోతే
ఆటలాడుకున్నారు

వ్యంగ్య కార్టూన్లు, నినాదాలు రూపొందించి
ఎంచక్కా ఫ్లకార్డుల మీదికెక్కించారు
సినిమా డైలాగులు, పాటలు మార్చి
గంభీరరాగంలో వెళ్ళగక్కారు

బలవంతపు క్రూరాత్మక అణచివేతను
శాంతిమంత్రంతో అణచొచ్చని
సరికొత్త పాఠం నేర్పారు
కొట్టకుండా కొట్టడమంటే ఏంటో
గుండెలు గుద్దుకొని చూపించారు

వినోదాత్మకమైనవన్నింటిని
విప్లవాత్మకం చేసి
అరుదైన సందర్భాన్ని సృష్టించారు

వినూత్న ప్రతిఘటనలతో
ప్రత్యర్థులను స్థాణువులను చేసి
నూతనోద్యమానికి నాంది పలికారు

పారాసైట్స్‌గా నిందించబడ్డ నిరుద్యోగ
యువత
ఇప్పుడీ దేశ విద్యావ్యవస్థకు సోకిన వైరస్
లను
ఒక్కొక్కటిగా మట్టికరిపించి రూపుమాపేసే
యాంటీవైరస్ కావాలి
యాంటీవైరస్ కావాలి
జయహో జెన్ జెడ్!!

జనంసాక్షి


కార్తీక రాజు
హనుమకొండ
8977336447

## వెతుకులాట

జనంసాక్షి

చెట్టు నాకిష్టం
దానికి కూడ ఉంటుంది
శ్వాస నిశ్వాస
ఆనందం బాధ కూడా
వాటికి సహజం
నూ నూగు మీసాల
యవ్వన సోగ్గాడిలా

పచ్చని ఆకుల మిలమిల
చెట్టు జీవితం
మహా జీవన గ్రంథం
పత్రహరితం లో హరితం
ఆవిరైనపుడు
ప్రాయం సడలిన
ముసలి తనం ముడుతల
కపోలాలు
రాలిపోయె ఆకులు
రాగాలు తీయవు



వేదాంత నర్మగర్భరహస్యం వృక్షం
అన్వేషణయే
మానవ కర్తవ్యం

రేడియమ్
ఫోన్ : 9291527757

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత

- సిఎంసి కమిషనర్

**శేరిలింగంపల్లి, ఆగస్టు 3 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంకోసం ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఎఎస్ అధికారిని సృజన పేర్కొన్నారు. ఈ మేరకు మాదాపూర్ న్యాక్ భవనంలోని సిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రజా సమస్యల పరిష్కారం కోసం విచ్చేసిన ఫిర్యాదుదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు అందజేస్తున్న ఫిర్యాదులను ఎలాంటి అలసత్వం ఉండకూడదని, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధి వివిధ ప్రాంతాల నుండి సిఎంసి కార్యాలయానికి విచ్చేసిన ఫిర్యాదుదారులు, అర్జిదారులు ఆయా అధికారులకు వివరించడం జరిగింది. ఇందులో భాగంగా సిఎంసి కమిషనర్ వివిధ అవసరాల నిమిత్తం అందిన ఫిర్యాదులపై ఆరా తీశారు. ప్రజావాణి కార్యక్రమం ఎంతో బాధ్యతతో కూడుకుందని, ప్రతివారం నిజాయితీగా కొనసాగుతుందని, జిహెచ్ఎంసి పరిధిలో ప్రతి సర్కిల్ కార్యాలయం, జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత



ప్రాధాన్యత లభిస్తుందన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా సర్కిళ్లలో ఉదయం పది గంటలనుండి సాయంత్రంవరకు కీలక అధికారులు అంతా సమయాన్ని కేటాయిస్తూ అర్జీదారుల నుండి ఫిర్యాదులు అందుకోవడం జరుగుతుందని సిఎంసి కమిషనర్ వివరించారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఐడి మరియు ట్రాకింగ్ లింక్ కేటాయించి సంబంధిత శాఖలకు పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 35 వినతులు అందాయని, ప్రతి అర్జీని ప్రత్యక్షంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో వాటిపై తక్షణ చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా ఆమె అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. అందిన ఫిర్యాదులలో భాగంగా పట్టణ ప్రణాళిక అవిభాగం నుండి అత్యధికంగా 21, ఇంజనీరింగ్ విభాగంనుండి 09, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగం నుండి 03, అర్బన్ బయోడైవర్సిటీ నుండి 02 అందినట్లు అధికారులు తెలియజేశారు. ఫిర్యాదులు తీసుకోవడానికి మాత్రమే అధికారులు పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలో సమగ్రత నిర్వహించి వాటి పరిష్కారం లభించే అంతవరకు అధికారులు వారి గురుతర బాధ్యతను విస్మరించకూడదని ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేసిన అర్జీదారులు వాటి పరిష్కారం కోసం మళ్లీ కార్యాలయం మెట్లు ఎక్కకుండా పారదర్శకమైన యంత్రాంగాన్ని దీని కోసం కేటాయించి ప్రజల మన్ననలు పొందే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని సిఎంసి కమిషనర్ పేర్కొన్నారు.

**మియాపూర్ సర్కిల్ పరిధిలో...**

శేరిలింగంపల్లి జోన్ పరిధి మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి స్పందన సాధారణంగానే కొనసాగింది. దీంతో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 01, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 02 ఫిర్యాదులు మాత్రమే అందినట్లు అధికారులు వెల్లడించారు.

## ఆగస్టు 10న 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**ముషీరాబాద్, జూలై 28 (జనం సాక్షి) :** భారత్-అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఖీూ) రద్దు, అన్ని పంటలకు జ2ం50% సూత్రంతో కనీస మద్దతు ధర (మీూ)కు చట్టబద్ధ హామీ, సమగ్ర రుణమాఫీ, రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (రాఖవీ) పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ రాజ్ బహదూర్ గౌడ్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు తీగల సాగర్, పశ్య పద్మ, జక్కుల వెంకటయ్య, చంద్రారెడ్డి, భాస్కర్, తుకారాం నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. డిమాండ్లు నెరవేరకపోతే రాష్ట్రవ్యాప్తంగా జైల్ భరో, రైల్ రోకో, రోడ్ రోకో వంటి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు విజయ్, శివకుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం



**తాండూరు, అగస్టు 3 (జనంసాక్షి) :** పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి 12వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ పార్క్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతతో పాటు అన్ని వయసుల వారు వ్యాయామం చేసేలా ఓపెన్ జిమ్ పార్క్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, తాండూర్ టౌన్ ప్రెసిడెంట్, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హన్మగల్ భూములను కాపాడాలి

- పేదలు, రైతులకు అండగా బీజేపీ, టిఆర్ఎస్
- టిడిపి పార్టీల అఖిలపక్షం నాయకులు

**హయత్‌నగర్, ఆగస్టు 3 (జనం సాక్షి) :** హయత్‌నగర్ మండల పరిధిలోని హన్మగల్ -హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలోని సర్వే నంబర్ 255/1లో గల భూములను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్లాట్ల యజమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ సర్వే నంబర్ 255/1లో మొత్తం 74 ఎకరాల 37 గుంటల భూమి ఉందని, గతంలో ప్రజా అవసరాల కోసం కొంత భూమిని ప్రభుత్వం వినియోగించగా, ప్రస్తుతం మిగిలిన సుమారు 18 ఎకరాల భూమిని కూడా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ భూముల్లో దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ జీవితకాల పొదుపుతో చిన్నచిన్న



ప్లాట్లు కొనుగోలు చేసుకున్నాయని తెలిపారు. గతంలో ప్రభుత్వం అర్హులైన రైతులకు పట్టాలు మంజూరు చేసి, ఇప్పుడు అదే భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయడం సరికాదని ఆయన అన్నారు. ఒకవైపు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పేదలకు ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం చెబుతూ.. మరోవైపు పేదలు కొనుగోలు చేసిన ఇంటి స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హన్మగల్ ప్రాంతం లోని రైతులు, ప్లాట్ల యజమానులు, స్థానిక ప్రజలకు బీజేపీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే భూముల స్వాధీనం ప్రక్రియను నిలిపివేసి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్థులు, రైతులు, ప్లాట్ల యజమానులతో కలిసి బిజెపి, బి ఆర్ ఎస్, టిడిపి రాజకీయ పార్టీల అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, సామ తిరుమల్ రెడ్డి, తెలంగాణ తెలుగు యువత మాసి అధికార ప్రతినిధి సింగిరెడ్డి మురళీధర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉగాది ఎల్లప్ప, డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్లాట్ల యజమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలే మేలు

- జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి



**రంగారెడ్డి, ఆగస్టు 3 (జనంసాక్షి) :** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సాగు మార్గదర్శక పుస్తకాన్ని ఆయన వ్యవసాయ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు, కూరగాయల పంటలు, ఆయిల్ పామ్ సాగు దృష్టి సారించాలని తెలిపారు. అటువంటి లక్ష్యంతో జిల్లా, మండల, గ్రామాల్లో విస్తృత స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ వివిధ జిల్లాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన సూచనలు, సలహాలు, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, సాగు విధానాలు, నీటి వినియోగ సామర్థ్యం, పంటల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పొందుపరుస్తూ ఒక ప్రత్యేక సాగు మార్గదర్శక పుస్తకాన్ని రూపొందించిందన్నారు. రాష్ట్ర నిపుణుల కమిటీ రూపొందించిన ఈ మార్గదర్శక పుస్తకం రైతులకు శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన పెంచుకోనందుకు దోహద పడుతుందని తెలిపారు. మెరుగైన దిగుబడులు సాధించడానికి దోహదపడుతుందని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ మార్గదర్శకాలను రైతులకు విస్తృతంగా చేరవేసి, అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చంద్ర రెడ్డి అదన కలెక్టర్ కిరణ్మయి, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత తదితరులు ఉన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకే అధిక ప్రాధాన్యత

- మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్
- మున్సిపాలిటీలో రూ.83 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**శంకర్‌పల్లి, ఆగస్టు 3 (జనం సాక్షి) :** మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం సాధారణ నిధులతో మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో 37.60 లక్షల 15వ వార్డులో 39.50 14వ వార్డులో 5.90లక్షల రూపాయతో అభివృద్ధి పనులను వైస్ చైర్పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి తో కలిసి పనులను ప్రారంభించారు.సందర్భంగా మాట్లాడుతూ..మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతని ఇస్తుందని సాధారణ నిధులతో చేపడుతున్న ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా, డ్రైనేజీ సమస్యలు తీరుతాయని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో శంకర్పల్లి మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ యోగేష్, కౌన్సిలర్లు పైముదాబేగం, ప్రశాంత్,గణేష్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు చంద్రమౌళి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, కో అప్టేట్ సభ్యులు బాలకృష్ణారెడ్డి, మైమూద్, నాయకులు శేఖర్, బాలకృష్ణ, కృష్ణారెడ్డి,శేరి అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.



## జర్నలిస్టుల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 3 (జనం సాక్షి) :** జర్నలిస్టుల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేద్దామని టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి,రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ పేర్కొన్నారు. సోమవారం సదాశివపేటలోని ఓ బ్యాంక్ హాల్వ లో జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ తొలి సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, యూనియన్ భవనం తదితర అంశాలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించాలని సమావేశం నిర్ణయించింది. అలాగే సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, నారాయణఖేడ్, జోగిపేట, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని, హత్నూరులో కూడా త్వరలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డు మంజూరు చేయాలని, మిగిలిన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, కేబుల్ టీవీ జర్నలిస్టులకు ఒక యూనిట్ అక్రిడేషన్ కార్డు తక్షణమే మంజూరు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్ మాట్లాడుతూ... యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని, క్రమశిక్షణను పాటించాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కుల సాధనకు రాజీలేని పోరాటమే మార్గమని, ఐక్య ఉద్యమాల ద్వారానే జర్నలిస్టుల సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. అనిల్ కుమార్ మాట్లాడుతూ కష్టపడితే తప్పకుండా గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి అన్వర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం,ఐజేయూ సభ్యుడు సిద్ధన్న పాటిల్, ఈశ్వర్ చవాన్ సదాశివపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హాజీ, శ్రీధర్ జైన్, ఉల్లిగడ్డల శివకుమార్, అంజయ్య, సంగమేశ్వర్, నరేష్ , విశ్వనాథ్ ,జయరాములు, లింగం, బాలయ్య , జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణలోని జగిత్యాలలో 100వ శాఖను ప్రారంభించిన సారథి ఫైనాన్స్



**ముంబై, ఆగస్టు 3 (జనం సాక్షి) :** ఎంఎస్ఎంఈ రంగంపై దృష్టి సారించిన ఎన్‌బీఎఫ్‌సీ సారథి ఫైనాన్స్ నేడు తెలంగాణలోని జగిత్యాలలో తన 100వ శాఖను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ కొత్త శాఖతో ఉత్తర తెలంగాణలో సంస్థ తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, ఆ ప్రాంతంలోని ఎంఎస్ఎంఈలు, పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపార యజమానులకు సకాలంలో, వినియోగదారుల అవసరాలకు అనుగుణమైన ఆర్థిక పరిష్కారాలను మరింత సమర్థవంతంగా అందించనుంది. 2025 ఏప్రిల్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన సారథి ఫైనాన్స్, కేవలం 2026 ఆగస్టు 3 నాటికే 100 శాఖల మైలురాయిని చేరుకోవడం ద్వారా తన వేగవంతమైన వృద్ధిని, అలాగే ఆర్థిక సమ్మిళిత విస్తరణకు ఉన్న నిబద్ధతను చాటుకుంది. ఎంఎస్ఎంఈలపై దృష్టి సారించిన ఈ ఎన్‌బీఎఫ్‌సీ, రూ.5 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు లోన్ అగెనెస్ట్ ప్రాపర్టీ (ఎల్.ఎ.పి.) రుణాలను అందిస్తోంది. దీని ద్వారా చిన్న వ్యాపారాలు, పారిశ్రామికవేత్తలు తమ ఆస్తుల విలువను సమర్థంగా వినియోగించుకొని వ్యాపార విస్తరణకు, వర్కింగ్ క్యాపిటల్‌ను పెంపొందించుకోవడానికి, అలాగే తమ వ్యాపార లక్ష్యాలను సాకారం చేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని పొందగలుగుతున్నారు. సంస్థ 100వ శాఖ ప్రారంభం సందర్భంగా సారథి ఫైనాన్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ వివేక్ బన్సల్ మాట్లాడుతూ, "100 శాఖల మైలురాయిని చేరుకోవడం, రూ.650 కోట్లకు పైగా నిర్వహణలోని ఆస్తులు (ఎ.యు.ఎం.) సాధించడం మా వ్యాపార నమూనా బలాన్ని, అలాగే దానిని సమర్థవంతంగా అమలు చేసిన మా సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. మా విస్తరణ కొనసాగుతున్నప్పటికీ, స్థిరమైన వృద్ధి, వివేకవంతమైన రిస్క్ నిర్వహణ, సాంకేతికత ఆధారిత రుణ సేవల వ్యవస్థను నిర్మించడం పైనే మా ప్రధాన దృష్టి కొనసాగుతుంది. ఈ విధంగా మా వినియోగదారులు, భాగస్వాములు, పెట్టుబడిదారులు సహా అన్ని వాటాదారులకు దీర్ఘకాలిక విలువను సృష్టించడమే మా లక్ష్యం" అని అన్నారు.

సారథి ఫైనాన్స్ స్వతంత్ర డైరెక్టర్ శశి శేఖర్ వెంపటి మాట్లాడుతూ, "కేవలం ఏడాదికి కొద్దిగా మించిన వ్యవధిలోనే సారథి ఫైనాన్స్ 100వ శాఖను ప్రారంభించడం, ఆర్థిక సమ్మిళిత ముందుకు తీసుకెళ్లేందుకు సాంకేతికత, పటిష్ఠమైన కార్పొరేట్ పాలన, వినియోగదారుల అవసరాలకు ప్రాధాన్యమిచ్చే విధానాన్ని సమన్వయం చేయాలన్న సంస్థ దూరదృష్టికి నిదర్శనం. భారతదేశం డిజిటల్ పరివర్తన దిశగా వేగంగా ముందుకు సాగుతున్న ఈ సమయంలో, ఎంఎస్ఎంఈలకు బాధ్యతాయుతంగా రుణ సౌకర్యాలను విస్తరించే సంస్థలు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, నవకల్పనలకు ఊతమివ్వడం, అలాగే దేశం యొక్క సుస్థిర ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి" అని అన్నారు.

ఈ సందర్భంగా టీవీఎస్ క్యాపిటల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ శ్రీనివాసన్ మాట్లాడుతూ, "కేవలం ఏడాదికి కొద్దిగా మించిన కాలంలోనే 100 శాఖలను ప్రారంభించడం సారథి ఫైనాన్స్ నాయకత్వం, బృందం సామర్థ్యానికి నిదర్శనం. ఇంత పెద్ద స్థాయిలో వేగం మరియు క్రమశిక్షణ రెండింటినీ ఒకేసారి కొనసాగించడం చాలా అరుదు. అయితే, సారథి ఈ రెండింటినీ విజయవంతంగా సాధించింది. ఏడాదికి కొద్దిగా మించిన చరిత్ర కలిగిన సంస్థకు ఇది ఎంతో విశేషమైన ఘనత. సంస్థను ముందుకు నడిపిస్తున్న బృందం ప్రతిభ, సామర్థ్యాన్ని ఇది స్పష్టంగా తెలియజేస్తోంది. టీవీఎస్ క్యాపిటల్లో మేము అత్యున్నత లక్ష్యాలతో పాటు క్రమబద్ధమైన అమలు సామర్థ్యం కలిగిన వ్యవస్థాపకులకు మద్దతు ఇస్తాము. సారథి ఫైనాన్స్ తన ఆవిర్భావం నుంచే ఈ రెండు లక్షణాలను చక్కగా ప్రదర్శించింది. ఈ విజయయాత్రలో భాగస్వాములుగా ఉండటం మాకు గర్వకారణం. సంస్థ మొత్తం బృందం ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము" అని అన్నారు.

## ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

- జడ్పీ సీఈఓకు ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి



**రంగారెడ్డి, ఆగస్టు 3 (జనంసాక్షి) :** ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇబ్రహీంపట్నం మండల ఫీల్డ్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. ఈ నేరకు జిల్లా పరిషత్ సీఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు ఉత్తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమయ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా వేతనాలు అందక తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా శాఖల అధికారులు, సిబ్బందికి అన్ని సదుపాయాలు అందుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రం వేతనాలు లేక వీధుల్లోనే ఉండాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. పెండింగ్ వేతనాలతో పాటు తమ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు సమ్మెలో ఉన్నారని తెలిపారు. తాము మాత్రం క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నామని వివరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నిర్లక్ష్యం సహించేది లేదు

- అధికారులపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆగ్రహం
- శ్రీరంగాపురం ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే
- తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల సమస్యలపై తీవ్ర అసంతృప్తి
- విద్యార్థుల ఆరోగ్యం, భద్రతతో రాజీ పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**శ్రీరంగాపూర్, ఆగస్టు 3 (జనంసాక్షి) :** వనపర్తి నియోజకవర్గంలోని శ్రీరంగాపురం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సోమవారం ఆకస్మికంగా సందర్శించి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ప్రతి తరగతి గదిని పరిశీలించిన ఎమ్మెల్యే నేరుగా విద్యార్థులతో మాట్లాడి పాఠశాలల్లో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.తాగునీటి సౌకర్యం లేకపోవడం, తరగతి గదులు సక్రమంగా లేకపోవడం, మరుగుదొడ్లు అత్యంత దయనీయ స్థితిలో ఉండడం వంటి సమస్యలను విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే స్వయంగాపరిశీలించారు.వంటగదిలో పరిశుభ్రత, కూరగాయల నాణ్యత, వంట సామగ్రి, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి విద్యార్థికి పరిశుభ్రమైన, నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని సంబంధిత సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం సహించబోమన్నారు. వెంటనే మరుగుదొడ్లను శుభ్రపరచి, నిరంతర పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.తరగతి గదుల్లో ఫ్యాన్లు పనిచేయకపోవడం, కొన్ని గదుల్లో మౌలిక వసతులు లేకపోవడంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారువిద్యార్థులు ఇబ్బందులు పడకుండా వెంటనే ఫ్యాన్లకు మరమ్మతులు చేపట్టి, అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.పాఠశాల ఆవరణలో కొందరు గ్రామస్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని పేర్కొన్న ఎమ్మెల్యే, విద్యాలయ ప్రాంగణం పవిత్రమైన విద్యా కేంద్రంగా ఉండాలని, ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. పాఠశాల ఆవరణలో భద్రతను కట్టుదిట్టం చేసి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన మౌలిక వసతులు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం.విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదు.సమస్యలు వెంటనే పరిష్కరించాలి. లేకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, సర్పంచ్ మద్దిలేటి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీహరి రాజు పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది హత్యకు నిరసనగా కోర్టులో లాయర్ల విధుల బహిష్కరణ



**మక్తల్, ఆగస్టు 3 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవల్లిలో న్యాయవాది మల్లయ్య దారుణ హత్యకు నిరసనగా మక్తల్ కోర్టులో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ తిమ్మన్న మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై వరుసగా దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పెంట్లవల్లిలో న్యాయవాది మల్లయ్యను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, లాయర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సూచించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రంకుల ఆనంద్, సూర్య ప్రకాష్, జి. సురేందర్, వెంకటేష్ గౌడ్, ఎస్. శివకుమార్, సురేందర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం




**శ్రీరంగాపూర్, ఆగస్టు 3 (జనం సాక్షి) :** శ్రీరంగాపురం మండల కేంద్రంలో సోమవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, ప్రభుత్వ విద్య బలోపేతమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రూ.10 లక్షలతో నిర్మించనున్న గ్రామ మహిళా సమాఖ్య భవనానికి, రూ.10 లక్షలతో నిర్మించనున్న మండల మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపనలు నిర్వహించారు.అనంతరం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న గోదాం భవనానికి భూమిపూజ చేశారు.అలాగే స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రూ.14.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పీఎం శ్రీ కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలతో, చప్పట్లతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, నాణ్యమైన విద్య ప్రతి విద్యార్థికి అందుబాటులోకి రావాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పిస్తూ డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం నేటి విద్యార్థులకు అత్యవసరమైందని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మద్దిలేటి, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీహరి రాజు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగ బాబాకు దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

**తూప్రాన్, ఆగస్టు 3 (జనం సాక్షి) :** ఇంటికి పెద్ద దిక్కు లేదని తెలుసుకున్న ఓ దొంగ బాబా ఇంట్లో గుప్తనిధులు ఉన్నాయని నమ్మించి మోసానికి పాల్పడడంతో గ్రామ దొంగ బాబాకు దేహ శుద్ధి చేసిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి లో చోటు చోటు చేసుకుంది గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబంలోని దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరి తల్లి గారి ఊరు సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం చౌదర్పల్లి. ఇక్కడ నాజర్ మస్తాన్ అలియాస్ హేమంత్ బాబాగా ఒకరు పరిచయం చేసుకున్నాడు. ఇతడు మిర్యాలగూడ నుంచి ఇక్కడికి వచ్చాడు. కుటుంబానికి దగ్గరయ్యాడు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో వారింట్లోనే ఉంటున్నాడు. రెండు నెలల కిందట వారి రెండో కుమార్తెను పెళ్లి చేసుకున్నాడు. అప్పటికే అతనికి రెండు వివాహాలు అయ్యాయి ఎవరో తెలియని వ్యక్తిని ఇంట్లో పెట్టుకుని రెండో అమ్మాయిని ఎలా పెళ్లి చేశారు, అంటూ గ్రామస్తులు కుటుంబ సభ్యులను నిలదీయడంతో దొంగ బాబా ఊరు నుంచి పారిపోయాడు. ఆదివారం మళ్లీ గుండ్రెడ్డిపల్లి గ్రామానికి



రావడంతో పలువురు గ్రామస్తులు ఆయనను పట్టుకొని వివరాలు అడిగిన ఇంతకీ సమాధానం చెప్పకపోవడంతో చివరికి దేహశుద్ధి చేశారు . అతడి ఫోన్ తనిఖీ చేయగా అందులో పలువురు మహిళా యువతుల ఫోటోలు ఉన్నాయి. కూలి నాలి పనులు చేసుకునే ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా వాడుకున్నాడు. నేను బాబా ని నాకు మంత్రాలు వచ్చు ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయంటూ ఇంట్లో తవ్వకలు చేశాడు. కుటుంబ సభ్యుల బంగారం నగదును సైతం వాడుకున్నాడు. నజర్ మస్తాన్ అలియాస్ హేమంత్ విషయం పోలీసులకు చెప్పగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## యంగ్ ఇండియా స్కూల్ పనులను వేగవంతంగా చేపట్టాలి



**మక్తల్, ఆగస్టు 3 (జనంసాక్షి) :** మక్తల్ మున్సిపాలిటీ శివారులో 200 కోట్ల రూపాయల నిధులతో చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంత్రి వాకిటి శ్రీహరి పనులను ఆన్ లైన్ లో పరిశీలించి, అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని, పూర్తి నాణ్యతతో పనులను పూర్తి చేసి, వచ్చే అకాడమిక్ ఇయర్ వరకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మేనేజర్ నాగిరెడ్డి, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ అల్మూరి రవికుమార్, కల్లూరి గోవర్ధన్, అధికారులు సత్యపాల్, బాలస్వామి తదితరులు ఉన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 3 (జనం సాక్షి) :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా, పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే జిల్లా స్థాయి వేడుకలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. వేదిక, అతిథుల సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారిని ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను పాటిస్తూ ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల వివరాలతో కూడిన ప్రశంసా పత్రాల ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి డిగ్రీ కళాశాలలో ఘనంగారసాయన శాస్త్ర దినోత్సవం



**కల్వకుర్తి, ఆగస్టు 3 (జనం సాక్షి) :** భారత రసాయన శాస్త్ర పితామహుడు ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే జయంతిని పురస్కరించుకుని కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ రసాయన శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ శార్వాణి అధ్యక్షతన,రసాయన శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ బారోతు రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించినివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శార్వాణి మాట్లాడుతూ భారత రసాయన శాస్త్ర అభివృద్ధికి ప్రఫుల్ల చంద్ర రే చేసిన విశేష సేవలను వివరించారు. వైద్య, వ్యవసాయ, పర్యావరణ, పారిశ్రామిక,శాస్త్ర--సాంకేతిక రంగాల్లో రసాయన శాస్త్రం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు."మానవ జీవితం--రసాయన శాస్త్రం"అనే అంశంపై శాస్త్రీయ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ గౌడ్, అధ్యాపకుడు చంద్రప్రకాశ్ రావు, అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదర్శ్ నగర్‌లో శోభాయమానంగా బోనాల ఉత్సవాలు

**సంగారెడ్డి, ఆగస్టు 3(జనం సాక్షి) :** సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో గల ఆదర్శనగర్ కాలనీలో శోభాయ మానంగా అమ్మవారికి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కే. శంకర్ ఆధ్వర్యంలో కాలనీలో బోనాల పండుగ నిర్వహించడం ఇది 12వ సారి ప్రతి సంవత్సరం ఆషాడ మాసం పురస్కరించుకొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మహిళలు బోనాలతో బయలుదేరి అమ్మవారికి సమర్పిస్తారు. బోనాల ఉత్సవాలలో కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు నర్సింగ్ , చంద్రశేఖర్, రాజ్ కుమార్, తుకారం, ఆనంద్ వెంకటేశం, ఏవీ నర్సింలు, నరసింహ రాజు, మారుతి, ప్రశాంత్,



మల్లారెడ్డి, అడివయ్యా, మహిళలు, ప్రసన్నవాణి , అంజలి, విశాల, వాణి, లక్ష్మి, రుక్మిణి, మహిళలు పాల్గొన్నారు.

## పదోన్నతి బాధ్యతలను మరింత పెంచుతుంది

- జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 3 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్ లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ రెడ్డి ఇటీవలే ఏఎస్ఐ గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అభినందనలు తెలిపి తన చేతుల మీదుగా సుధాకర్ రెడ్డి కి అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్(ఏఎస్ఐ) హోదాకు సంబంధించిన స్టార్స్ అలంకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పదోన్నతి అనేది కేవలం ఉద్యోగంలో ఉన్నత స్థానానికి ఎదగడమే కాకుండా, బాధ్యతలు మరింత పెంచుతుందని తెలిపారు. పదోన్నతి పొందిన ప్రతి పోలీస్ సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడి కష్టాన్ని సానుభూతితో వినడం, వారికి తక్షణ సహాయం అందించడం, న్యాయం జరిగేలా కృషి చేయడం పోలీస్ సిబ్బంది ప్రధాన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, నిరుపేదలు వంటి బలహీన వర్గాలకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం వంటి విలువలను పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ రామ్ లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## నంగునూరు, చిన్నకోడూరు మండలాలకు మినీ స్టేడియం మంజూరు చేయాలి

**నంగునూరు, ఆగస్టు 3 (జనం సాక్షి) :** సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలంలోని యువతలో క్రీడల పట్ల అపారమైన ఆసక్తి, ప్రతిభ ఉన్నప్పటికీ, సరైన క్రీడా మౌలిక వసతులు లేక వారు తమ ప్రతిభను పూర్తిస్థాయిలో ప్రదర్శించలేకపోతున్నారని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ దేవులపల్లి యాదగిరి తెలిపారు. ఈ నేపథ్యంలో నంగునూరు మండల కేంద్రంలో మరియు చిన్నకోడూరు మండలంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన మినీ స్టేడియంను తక్షణమే మంజూరు చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ, క్రీడలు మరియు యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నంగునూరు మండలం మరియు చిన్న కోడూరు మండలంలు గ్రామీణ ప్రాంతమైనప్పటికీ ఇక్కడి యువత కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్స్, ఖోఖో తదితర క్రీడల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని వివరించారు. అనేక మంది జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ, సాధనకు తగిన మైదానం లేకపోవడం వల్ల వెనుకబడుతున్నారని పేర్కొన్నారు.

### గ్రామీణ క్రీడాకారులకు పెద్ద లోటు - సరైన మైదానం లేక ఇబ్బందులు



ప్రస్తుతం క్రీడాకారులు పాఠశాల మైదానాలు, ఖాళీ స్థలాలు లేదా వ్యవసాయ భూముల అంచుల్లోనే సాధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో సాధన పూర్తిగా నిలిచిపోతుండగా, వేసవిలో తాగునీరు, విశ్రాంతి వంటి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేవని వినతిపత్రంలో వివరించారు. ఫలితంగా ప్రతిభ ఉన్న అనేక మంది యువకులు క్రీడలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### మినీ స్టేడియంతో యువతకు కొత్త అవకాశాలు

నంగునూరులో మరియు చిన్న కోడూరు లలో మినీ స్టేడియములు ఏర్పాటు అయితే మండల స్థాయి క్రీడా పోటీలు, శిక్షణా శిబిరాలు, పాఠశాలల మధ్య పోటీలు, యువజన కార్యక్రమాలు నిర్వహించేందుకు అనువైన వేదిక ఏర్పడుతుందని తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఇది కీలకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు.

### ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలే బాట

ప్రస్తుత కాలంలో యువత మొబైల్ ఫోన్లు, డిజిటల్ వినోదాల వైపు ఎక్కువగా ఆకర్షితమవుతున్న పరిస్థితుల్లో, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా వారిని శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాల వైపు మళ్లించవచ్చని యాదగిరి పేర్కొన్నారు. క్రీడలు కేవలం పతకాలు సాధించే సాధనం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కూడా బలమైన పునాది అని అన్నారు.

### మంత్రి స్పందన సానుకూలం

వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి వాకిటి శ్రీహరి సమస్యను సానుకూలంగా పరిశీలించి, రెండు మండలలకు అవసరమైన వివరాలు తక్షణమే సేకరించాలని, తన వ్యక్తిగత కార్యదర్శి (పీఎస్)ను ఆదేశించినట్లు తెలిపారు.

# వెంకటాపూర్‌కు తొలి ఆర్టీసీ బస్సు

- నెరవేరిన గ్రామస్తుల చిరకాల కోరిక
- ఆనందోత్సాహాల మధ్య బస్సుకు ఘన స్వాగతం
- డ్రైవర్,కండక్టర్‌కు సాలువాలతో సన్మానం




**నెరడిగొండ, ఆగస్టు 3 (జనంసాక్షి):** మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి తొలిసారిగా ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభమవడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.ఎన్నో సంవత్సరాలుగా గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న ఆర్టీసీ బస్సు గ్రామంలోకి రావడంతో తమ చిరకాల కోరిక నెరవేరిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.గ్రామంలోకి చేరుకున్న తొలి ఆర్టీసీ బస్సుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బస్సు డ్రైవర్,కండక్టర్‌లను సాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి తమ కృతజ్ఞత తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు సేవలతో విద్యార్థులు ఉద్యోగులు రైతులు వృద్ధులు మహిళలకు రవాణా సౌకర్యం మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు.గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలు కల్పించేందుకు కృషి చేసిన ప్రజాప్రతినిధులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ కు, అధికారులు, ఆర్టీసీ యాజమాన్యానికి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ బస్సు సేవలు నిరంతరంకొనసాగించాలని వారు కోరారు.అలాగే అదే రూట్లో మాదాపూర్ వాగ్దరి గ్రామానికి కూడా బస్సు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## మణుగూరు పీకే-2 డిప్ సైడ్ ఎక్స్‌పెన్షన్ ప్రాజెక్టు
# సింగరేణికి దక్కడం చారిత్రాత్మక విజయం



**నస్పూర్(జనంసాక్షి):** వేలం ద్వారా మణుగూరు పీకే -2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టు సింగరేణి సంస్థకు దక్కడం చారిత్రాత్మక విజయమని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ యూనియన్ బిఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాతడి శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు వేలంలో జెన్‌కోను సింగరేణికి పోటీగా నిలపడం కార్మికుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు.గత నెల జూలై 19,20 తేదీలలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సింగరేణి ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా కూడా పీకే-2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టును సింగరేణికే కేటాయించేలా చర్యలు విజయానికి నిరంతరం కృషి చేసిన బిఎంఎస్ జాతీయ నాయకులు కే.లక్ష్మారెడ్డి కి,సింగరేణి ప్రయోజనాలను పరిరక్షించే దిశగా అప్రమత్తంగా వ్యవహరించి,ప్రాజెక్టు సింగరేణికే దక్కేలా ప్రత్యేక శ్రద్ధ చూపిన కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి యూనియన్ తరఫున హృదయపూర్వక అభినందనలు,కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు సింగరేణి అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటిస్తూనే,మరోవైపు తీసుకో వాలని బిఎంఎస్ తరఫున ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.నేడు ఈ ప్రాజెక్టు సింగరేణికి దక్కడం మణుగూరు ప్రాంత భవిష్యత్తుకు, వేలాది మంది కార్మికుల ఉపాధి భద్రతకు,సింగరేణి సంస్థ అభివృద్ధికి ఎంతో కీలకమైన పరిణామమని పేర్కొన్నారు. సింగరేణి ప్రయోజనాల పరిరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా నిరంతరం పోరాడిన బిఎంఎస్ కృషికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు.

# జనసంద్రంగా గీతన్నల జైత్రయాత్ర

- గీతన్నలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి
- రాష్ట్ర అధ్యక్షులు రమణ,ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు
- గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేల సమ్మయ్య గౌడ్



**కేసముద్రం ఆగస్టు 3 (జనం సాక్షి) :** గీత కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణ,ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు చేపట్టిన అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర మున్సిపాలిటీ కేంద్రంలో జనసంద్రంగా కొనసాగింది. మండల అధ్యక్షులు బబ్బూరి ఉప్పలయ్య, కార్యదర్శి మోడం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ అధ్యక్షన ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రారంభమైన యాత్రలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో 1000 ద్విచక్ర వాహనలపై 2000 మందికి పైగా గౌడన్నలు, గీత కార్మికులు,యువకులతో నిర్వహించిన బైక్ ర్యాలీతో చైతన్య యాత్రను సమ్మయ్య గౌడ్ రాష్ట్ర బృందానికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని,గీత కార్మికుల సమస్యలను గ్రామస్థాయి నుంచి తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ చైతన్య యాత్ర చేపట్టినట్లు అధ్యక్ష,కార్యదర్శులు తెలిపారు.గౌడ సమాజ చారిత్రక వారసత్వానికి ప్రతీక అయిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్ మీద ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.జిల్లా అధ్యక్షులు గౌని వెంకన్న,రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు,బన్నీ వెంకట మల్లయ్య, వెంకట నరసయ్య,సాంబయ్య, సీతారాములు, రమేష్ గౌడ్,వెంకట్ గౌడ్, వెంకన్న, వెంకటేశ్వర్లు, వీరస్వామి,సుధాకర్, నర్సయ్య, రాంబాబు,రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ రాజేష్ వివిధ సంఘ నాయకులు, కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

# వజ్జ సారయ్య సేవలు మరువలేనివి

- ఆయన నాయకత్వంలోనే 23 మంది సర్పంచ్‌ల విజయం
- కొత్తగూడలో కాంగ్రెస్ అభినందన సభలో మంత్రి సీతక్క




**కొత్తగూడ, ఆగస్టు 3 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం గత 16 సంవత్సరాలుగా అపారమైన సేవలు అందించిన మాజీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య కృషి ఎంతో ప్రశంసనీయమని, ఆయన నాయకత్వంలో ఏకంగా 23 మంది సర్పంచ్‌లు గెలుపొందడం ఆయన కార్యదక్షతకు, నాయకత్వ పటిమకు ప్రత్యక్ష నిదర్శనమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) కొనియాడారు. కొత్తగూడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య వీడుకోలు సభతో పాటు, నూతనంగా కొత్తగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన బానోత్ రూప్ సింగ్ అభినందన సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గత 16 ఏళ్లుగా పార్టీ జెండాను భుజాన ఎత్తుకొని, ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తూ వజ్జ సారయ్య అందించిన సేవలను స్మరించుకున్నారు. మండలంలో 23 మంది సర్పంచ్‌లను గెలిపించి కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అనంతరం నూతనంగా మండల కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన బానోత్ రూప్ సింగ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సారయ్య చూపిన బాటలో రూప్ సింగ్ కూడా ప్రతి ఒక్క కార్యకర్తను, నాయకుడిని కలుపుకొని పోతూ, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వజ్జ సారయ్యను ఘనంగా సన్మానించి వీడుకోలు పలకడమే కాకుండా, నూతన అధ్యక్షుడు బానోత్ రూప్ సింగ్‌కు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణ రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి, బ్లాక్ ఉపాధ్యక్షులు కర్ర జనార్దన్ రెడ్డి, ఈర్ప రాజేశ్వర్, బిట్ల శ్రీనివాస్, లావణ్య వెంకన్న, మాజీ జడ్పీటీసీ పుష్పలత, ఓబీసీ జనరల్ సెక్రెటరీ వల్లపు రంజిత్, బోయిని ప్రశాంత్, గొంతి రాజు,కొత్తగూడ సర్పంచ్ భాగ్యమ్మ, మల్లెల రణధీర్లు, గ్రామాల సర్పంచ్ లు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాకతీయ వైభవానికి కేంద్రం పెద్దపీట వేయాలి

- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 03 (జనం సాక్షి) :** వరంగల్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కాకతీయ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి అంశాన్ని లోక్‌సభ వేదికగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బలంగా ప్రశ్నించారు. కాకతీయుల చరిత్ర, సంస్కృతి, కళా వైభవం కేవలం తెలంగాణకే కాకుండా దేశానికి గర్వకారణమని, అలాంటి వారసత్వ సంపదకు మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రధానంగా వరంగల్‌కు చరిత్రక గుర్తింపుగా నిలిచిన కాకతీయ కట్టడాలు, సంప్రదాయ కళలు, చేనేత-- హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాలు, పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకుందో వివరించాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు.ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సమాధానం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పరిధిలో 9 రక్షిత కట్టడాలు ఉన్నాయని, వాటిలో వరంగల్ జిల్లాకు చెందిన కాకతీయ వారసత్వ కట్టడాలు కూడా ఉన్నాయని తెలిపారు. అవసరాలు, నిధుల లభ్యత మేరకు వాటి పరిరక్షణ, నిర్వహణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, కాకతీయ కళా సంపద, చేనేత, హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాల అభివృద్ధికి ఇంకా విస్తృత స్థాయిలో చర్యలు అవసరమని అన్నారు. హెరిటేజ్ సిటీగా వరంగల్‌కు గుర్తింపు లభించినప్పటికీ, నగరంలోని చారిత్రక కట్టడాల అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావాలని డా. కడియం కావ్య అభిప్రాయపడ్డారు. వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి వద్ద ప్రపంచ స్థాయి పర్యాటక సదుపాయాలు కల్పిస్తే వేలాది మంది దేశ, విదేశీ పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రసాద్ పథకం కింద రామప్ప దేవాలయ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, కాకతీయ వారసత్వానికి సంబంధించిన అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను కేంద్రం రూపొందించాలన్నారు. కాకతీయుల చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక సాంస్కృతిక, పర్యాటక ప్రాజెక్టులు చేపట్టాలని కోరారు.వరంగల్ కోట అభివృద్ధికి ఏఎస్ఐ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మధ్య ఒప్పందం కుదరడం స్వాగతించదగ్గ విషయమని, అయితే పనులు కాగితాలకే పరిమితం కాకుండా త్వరితగతిన పూర్తయ్యేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని సూచించారు."కాకతీయుల వారసత్వం తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఈ సంపదను పరిరక్షించడం, భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అన్నారు. వరంగల్ అభివృద్ధి, కాకతీయ వైభవ పునరుద్ధరణ కోసం పార్లమెంట్‌లోనూ, కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనూ నిరంతరం తాను పోరాడుతాను" అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు.

# టైగర్ జోన్ పేరిట రైతులకు ప్రజలకు ఇబ్బందులు పెట్టవద్దు

- బిజెపి నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

**కడెం, ఆగస్టు 3 (జనంసాక్షి) :** ఖానాపూర్ నియోజకవర్గంలో కవ్వాల్ టైగర్ జోన్ పేరిట పోడు వ్యవసాయం చేసే గిరిజన రైతులకు గిరిజన నేతల రైతులకు ప్రజలకు ఆటవి శాఖ అధికారులు ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దని బిజెపి నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. సోమవారం రోజున కడెం మండలంలోనీ ఉడుంపూర్ గ్రామాన్ని రితేష్ రాథోడ్ పర్యటించి ఉడుంపూర్ బాధిత గిరిజన రైతులకతో గ్రామస్తులతో మాట్లాడారు ఈ సందర్భంగా రితేష్ రాథోడ్ మాట్లాడుతూ గత కొన్ని ఏళ్ల నుండి ఆటవి భూములలో పంటలు సాగు చేసుకుంటూ పట్టాలు పొంది కుటుంబ జీవనం కొనసాగిస్తున్న రైతులకు ప్రజలకు ప్రస్తుతం సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ రైతుల పంట పొలాల్లో ట్రాక్టర్ల ద్వారా కేజీలు కొట్టకుండా అడ్డుకోవడం అటవీ భూమి అంటూ సరిహద్దులు ఏర్పాటు చేసి కంచెలు ఏర్పాటు చేయడం పై భూముల్లో ట్రాక్టర్ నిషేధం అంటూ ఆటవి అధికారులు రైతులపై దౌర్జన్యం చేయడం సరైంది కాదన్నారు. తమ న్యాయమైన సమస్య కోసం ఆటవి భూముల రైతులు అటవీ అధికారులను అడుగుతే 17 మందిపై రైతులపై అక్రమ కేసులు ఆటవి అధికారులు నమోదు చేయడం జరిగింది అన్నారు. అందువల్ల అటవీ శాఖ అధికారులకు సిబ్బందికి ఉద్యోగులకు పై గ్రామాల రైతులు గ్రామస్తులు ఎలాంటి సహాయం చేయకుండా సహాయ నిరాకరణ ఉద్యమం చేయడానికి తీర్మానించుకున్నారనీ అన్నారు. పై ఉద్యమానికి బిజెపి పార్టీ పూర్తి సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ దృష్టికి పై విషయాన్ని తీసుకెళ్లి సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గంలోని కవ్వాల్ టైగర్ జోన్ ఎత్తివేయడానికి నిర్ణయం తీసుకుంటే తమ బిజెపికి చెందిన తెలంగాణ 8 మంది ఎంపీలు ఎమ్మెల్యేలు పూర్తి సహకారాన్ని అందిస్తారన్నారు. ఆటవి శాఖ అధికారుల సిబ్బంది బదిలీలు చేస్తే సమస్య పరిష్కారం కాదన్నారు అడవి భూముల రైతులకు ప్రజలకు ఇబ్బందులు పెట్టే పద్ధతిని ఆటవిశాఖ అధికారులు సిబ్బంది మానుకోవాలని లేనిపక్షంలో వారికి తగిన బుద్ధి రైతులు గ్రామాల ప్రజలు చెప్తారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కడెం మండల అధ్యక్షుడు కాశ వేణి శ్రీనివాస్ యాదవ్ నాయకులు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## వ్యవసాయ బావిలో మొసలి

**గూడూరు, ఆగస్టు 3 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు అటవీ శాఖ రేంజ్ పరిధిలో సీతానగరం శివారులో దేశిడి జితేందర్ రెడ్డి బావిలో మొసలి కనిపించిందని సదరు రైతు వెంటనే అటవీ శాఖ రేంజ్ అధికారి ప్రసాద్ రావు తెలపడంతో వెంటనే తన సిబ్బందితో కలసి గ్రామస్తులతో అక్కడకు చేరుకొని బావిలో నుంచి సురక్షితంగా బయటికి తీసి ప్రథమ చికిత్స చేసి,ప్రత్యేక వాహనంలో మొసలిని పాకాల పెద్ద చెరువులో సురక్షితంగా వదిలిపెట్టడం జరిగిందని ప్రసాద రావు తెలిపారు.ఈకార్యక్రమంలో భూపతిపేట డిఆర్ఓ బుచ్చిబాబు,ఈడిసి సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్ట్

- మొత్తం 28 మోటార్ సైకిళ్ల స్వాధీనం
- విలేకరుల సమావేశంలో వరంగల్ సిపి శ్వేత వెల్లడి



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 03 (జనం సాక్షి) :** వరుస ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు వరంగల్ సిపి శ్వేత ఐపీఎస్ తెలిపారు. ఈ మేరకు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల చోరీలపై సంబంధిత పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదుకాగా బైక్ చోరీలు చైన్ స్నాచింగ్ కేసులకు కూడా దారి తీస్తునందుకు సెంట్రల్ జోన్ డిసిపి కవిత ఆధ్వర్యంలో స్పెషల్ టీం లను నియమించాము. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ప్రత్యేక దృష్టి సారించి నేర విచారణ చేయడం జరిగింది. గత కొద్ది కాలంగా జరిగిన నేరాలను విశ్లేషణ చేయగా, సోమవారం ఉదయం ఇద్దరు అనుమానితులను అదుపులోనికి తీసుకోని విచారణ చేయగా బైక్ చోరీలకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. 1)దొంతుల ప్రశాంత్ కుమార్ (20), నివాసం: పి.కె. రాజయ్య కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఎన్‌టీపీసీ, మంచిర్యాల మరియు 2) దుర్గం సాయి కార్తీక్ (21), నివాసం: వేలాల గ్రామం, జైపూర్ మండలం, మంచిర్యాల జిల్లా. వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. వాహన తనిఖీల సందర్భంగా నిందితులు ప్రయాణిస్తున్న అనుమానాస్పద పల్సర్ మోటార్ సైకిల్ ఏపీ 36 ఏ వై 4700 గలదాన్ని పోలీస్ టీం స్వాధీనం చేసుకుని విచారించగా, వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టిన వాహనాల గురించి సమాచారం అందించారు. వారి చూపిన మేరకు కే యూ సిపిఎస్ మునిపల్లి గ్రామ శివారు మరియు ఎలుకతుర్తి సమీపంలోని ప్రాంతాల నుండి మొత్తం 28 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నాము. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో హోండా షైన్, హీరో స్ప్లెండర్ ప్లస్, హీరో గ్లామర్, హెచ్ఎఫ్ డీలక్స్, బజాజ్ పల్సర్, హోండా హార్నెట్ తదితర మోడళ్లకు చెందిన ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. అవి వరంగల్ కమీషనరేట్ లో -8, కరీంనగర్ కమీషనరేట్ లో -9, రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి లో -3, సిద్దిపేట కమీషనరేట్ లో - 2 హైదరాబాద్ కమీషనరేట్ లో-3, రాచకొండ కమీషనరేట్ లో -1 మరియు భూపాలపల్లి జిల్లాలో -2 మొత్తం 28 మోటార్ సైకిల్ల దొంగతనాలు చేసినారు. వీటికి సంబంధించిన కేసులను ఆయా పోలీస్ స్టేషన్లతో అనుసంధానం చేస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులపై గతంలో కూడా పలు పోలీస్ స్టేషన్లలో ఆస్తి నేరాలకు సంబంధించిన కేసులు నమోదు అయినాయి. స్వాధీనం చేసుకున్న వాహనాల అసలు యజమానులను గుర్తించి చట్టపరమైన ప్రక్రియ అనంతరం అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నాము .ప్రజలు తమ వాహనాలను భద్రంగా పార్కింగ్ చేసి, స్టీరింగ్/వీల్ లాక్స్ వంటి అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. పై వరుస వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన సి సి ఎస్ ఇన్స్పెక్టర్ లు రాఘవేందర్, హరికృష్ణ.రామకృష్ణ , ఇన్స్పెక్టర్ రవి కుమార్ ని ఎస్సై శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబుల్లు నసీమ్ అహ్మద్, రవిప్రసాద్, జంపయ్య, కానిస్టేబుల్లు విశ్వేశ్వర్, వంశీ, వినోద్ లను, ఐటీ కోర్ ఏవో ఎండి. సల్మాన్ పాషా మరియు కానిస్టేబుల్ నగేష్, క్రైమ్ కానిస్టేబుల్లును మన స్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఈ మీడియా సమావేశంలో హన్మకొండ, సిసిఎస్ ఏసీపీ లు నర్సింహారావు, సదయ్య పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం

- సమస్యల పరిష్కారానికి అధికారులు సమగ్ర దృక్పథం తో పనిచేయాలి..
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న




**వరంగల్ ఎంజీఎం,ఆగస్టు 3 (జనంసాక్షి):** ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం ఏమాత్రం సహించబోమని, ప్రతి ఫిర్యాదును నిర్దేశిత గడువులో పరిష్కరించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగర ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన వినతిపత్రాలను కమిషనర్ స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా మొత్తం 98 దరఖాస్తులు అందాయి.అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమగ్ర దృక్పథం తో పనిచేయాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఏఈలు, డీఈలు, ఈఈలు బోనాలు, బతుకమ్మ వంటి ప్రధాన పండుగలకు సంబంధించి ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకు అవసరమైన అంచనాలు (ఎస్టిమేట్లు) ముందుగానే రూపొందించి, పరిపాలనా అనుమతులు, సాంకేతిక అనుమతులు పొందడంతో పాటు టెండర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి పనులు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి క్యాలెండర్ సంవత్సరంలో నిర్వహించాల్సిన పండుగలపై పూర్తి అవగాహనతో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు.ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. తాను నిర్వహించే శానిటేషన్ తనిఖీల సమయంలో పన్ను వసూళ్ల పురోగతిని కూడా సమీక్షిస్తానని తెలిపారు. నగర పరిధిలోని ప్రతి వ్యాపార సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందిన తర్వాతే కార్యకలాపాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లను మరింత వేగవంతం చేయాలని సూచించారు.ప్రజావాణిలో అందిన దరఖాస్తుల వివరాలు (శాఖల వారీగా): టౌన్ ప్లానింగ్ 39,ఇంజినీరింగ్ 31,హెల్త్ అండ్ శానిటేషన్ 11,రెవెన్యూ 9,నీటి సరఫరా 8 మొత్తంగా 98 వినతులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, డీఎఫ్‌వో శంకర్ లింగం, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, కార్యదర్శి అనిల్ బాబు, హెల్త్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, పన్నుల అధికారి రామకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కేటీకే 1 ఇంక్లైన్ ను సందర్శించిన జీఎం రాజేశ్వర్ రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సోమవారం సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి కేటీకే 1 ఇంక్లైన్ ను సందర్శించారు. గనిలో ఏర్పాటు చేసిన 12 టన్నుల క్రేన్ ను ప్రారంభించారు. దీంతో భారీ యంత్రాలు, విడిభాగాల నిర్వహణ వేగవంతంగా, సురక్షితంగా జరుగుతుందని ఆయన తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా గని ఆవరణలో మొక్కలు నాటారు. 56వ భద్రతా వారోత్సవాల్లో పిట్ సేఫ్టీ విభాగంలో ప్రథమ బహుమతి, సాండ్ స్టోవింగ్ మైన్స్ లో తృతీయ బహుమతి సాధించిన కేటీకే 1 ఉద్యోగులను అభినందించారు. భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మరిన్ని పురస్కారాలు సాధించాలని సూచించారు. అనంతరం ఉత్పత్తి కార్యకలాపాలు, భద్రతా ప్రమాణాలు, యంత్రాల నిర్వహణను సమీక్షించారు. భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రమాద నివారణ చర్యలు బలోపేతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఉత్పత్తి లక్ష్యాలు నాణ్యతతో సాధించాలని, కార్మిక సంక్షేమం, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్, సాంబశివరావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్, రవీందర్, సివిల్ ఏజీఎం, రవి కుమార్, కేటీకే 1 గ్రూప్ ఏజెంట్, తిరుపతి, మైన్ మేనేజర్, ప్రవీణ్ విక్రమ్, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 3 (జనం సాక్షి) :** ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. సోమవారం రఘునాథపాలెంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సిపి సునీల్ దత్ లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక (షెడ్యూల్) సిద్ధం చేయాలని సూచించారు. వైద్య కళాశాల ప్రహరీ గోడ, హాస్టల్, అంతర్గత రహదారులు పూర్తి చేయాలని, అవసరమైన నిర్మాణ పనులకు సంబంధించిన రివైజ్డ్ ఎస్టిమేట్స్‌కు నిరంతరం ఫాలోఅప్ చేసి త్వరితగతిన ఆమోదాలు పొందాలని అధికారులను ఆదేశించారు. బాలికల హాస్టల్ నిర్మాణాన్ని సెప్టెంబర్ 1 నాటికి పూర్తి చేయాలని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహాతో టెలిఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనుల పూర్తి కోసం అదనంగా రూ.64 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని, ప్రధానంగా విద్యుత్, మౌలిక సదుపాయాల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, నిధులు మంజూరైతే పూర్తి చేసి కళాశాలను ప్రారంభించే అవకాశం ఉంటుందని వివరించారు. ముందుగా గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌కు సంబంధించిన విద్యుత్ పనులను పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని, సెప్టెంబర్‌లో హాస్టళ్ల నిర్మాణం, అక్టోబర్‌లో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ పనులు పూర్తి చేసి, డిసెంబర్ చివరి నాటికి అన్ని నిర్మాణాలను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు. ఖమ్మంలో ముఖ్యమంత్రి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో అప్పటిలోగా అన్ని పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే జిల్లా కలెక్టర్, తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వైద్య కళాశాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి, మొత్తం 17 బ్లాకులు, పేరెంట్స్ లాంజ్, కిచెన్, డైనింగ్ హాల్‌తో పాటు అన్ని నిర్మాణాలను నాణ్యతతో పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా హాస్టళ్లు, అకడమిక్ బ్లాకులు, అంతర్గత రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాన్ని పూర్తిచేసి సంబంధిత శాఖకు అప్పగించాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా అన్ని పనులను సమయానికి పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, ఆర్డీఓ శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, వైద్య శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి పవర్ ప్లాంట్ ఎదుట భూనిర్వాసితుల నిరసన



**మిర్యాలగూడ, ఆగస్టు 3 (జనంసాక్షి) :** జిల్లాలోని దామరచర్ల మండల పరిధిలోని వీర్లపాలెం గ్రామంలో గల యాదాద్రి పవర్ ప్లాంట్ ఎదుట భూనిర్వాసితులు బైటాయించి నిరసన వ్యక్తం చేసారు. ప్లాంట్ పరిధిలోని తాళ్ళవీరప్పగూడెం, వీర్లపాలెం, తిమ్మాపురం, నర్సాపురం, కళ్లేపల్లి గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు ప్లాంట్ నిర్మాణ సమయంలో ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలు చెయ్యాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ జష్టుతేం.లిధర్నాకు మాజీ ఎమ్మెల్యే రంగన్న సంఘీభావం భూ నిర్వాసితుల ధర్నా తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జులకంటి రంగారెడ్డి ప్లాంట్ వద్దకు చేరుకొని సంఘీభావం తెలియజేశారు. భూ నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పరచాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి శాస్త ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. దామరచర్ల ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో భూనిర్వాసితుల తో మాట్లాడి ధర్నా విరమింపజేశారు.

## గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష

- రూ.25 వేల చొప్పున జరిమానా విధించిన కోర్టు

**బూర్గంపహాడ్, ఆగస్టు 3 (జనంసాక్షి) :** గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా అండ్ సెషన్స్ న్యాయమూర్తి శ్రీమతి ఎస్. సరిత సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, 2020 మార్చి 22న భారత్ బంద్ సందర్భంగా బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌కు చెందిన అప్పటి ఎస్ఐ బి. బాలకృష్ణ సిబ్బందితో కలిసి సారపాక బస్‌స్టాప్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హోండా స్కూటీపై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరిని ఆపి తనిఖీ చేయగా, వారి వద్ద 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా గ్రామానికి చెందిన బీమనపల్లి శ్రీనివాసులు, రావిరాల లక్ష్మీనారాయణగా గుర్తించారు. అనంతరం బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయగా, అప్పటి ఏఎస్ఐ కె. సోమేశ్వరరావు కేసు నమోదు చేశారు. తర్వాత అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పి. నవీన్, టి. సత్యనారాయణ దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. విచారణలో ఏడుగురు సాక్షులను పరిశీలించిన కోర్టు, నిందితులపై అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించింది. దీంతో ఇద్దరికీ ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. ఫణికుమార్ వాదనలు వినిపించగా, కోర్టు నోడల్ అధికారి డి. రాఘవయ్య, కోర్టు లైజాన్ అధికారి ఎస్. వీరభద్రం, కోర్టు డ్యూటీ ఆఫీసర్ పీసీ అక్రమ్ కేసు విచారణలో సమన్వయం చేసి సహకరించారు.

## ప్రజల భద్రత రక్షణలో నిరంతరం పోలీసుల కృషి

- 20 లక్షల విలువైన 102 మొబైల్స్ బాధితులకు అందజేత
- జిల్లాలో 14వ సారి బాధితులకు మొబైల్స్ అందించిన ఎస్పీ నరసింహ




**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 3 (జనంసాక్షి) :** జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న సుమారు 20 లక్షల రూపాయల విలువ గల 102 ఫోన్లను గుర్తించి రికవరీ చేసి 14వ సారి సంబంధిత మొబైల్ ఫోన్ల యజమానులకు, బాధితులకు జిల్లా ఎస్పీ కె.నరసింహ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా ఉంటే నష్టాలు తప్పవని, అప్రమత్తంగా, సురక్షితంగా ఉండాలన్నారు. అత్యాశకు పోయి, ఆదమరిచి ఉన్నా సైబర్ మోసగాళ్లు ఆర్థిక నష్టం కలిగిస్తారన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందిందని, రవాణాలో వేగం పెరిగిందని, వీటితో అదే స్థాయిలో సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. వీటిని తగ్గించాలంటే అవగాహన అప్రమత్తతే మార్గం అన్నారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికి నిత్యవసరమైందని, వివిధ రకాలుగా వినియోగించడం జరుగుతుందన్నారు. మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుందన్నారు. నేరగాళ్లు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్ వర్డ్స్ ను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మద్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారని పేర్కొన్నారు. ఒక్కో మొబైల్ రికవరీ చేయడానికి సైబర్ వారియర్స్ పోలీస్, టెక్నికల్ టీం పోలీసు సిబ్బంది చాలా కృషి చేశారని తెలిపారు. ఇతర రాష్ట్రాల వారి నుండి ఈ మొబైల్స్ ను రికవరీ చేశారన్నారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని సూచించారు. మొబైల్ ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా ధరఖాస్తు సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో వివిధ రూపాల్లో వినియోగదారులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ ను సిఈఐఆర్ అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐటి కోర్ సిబ్బందిని, పోలీస్ సిబ్బందిని అభినందించారు. మీజిల్లా పోలీసులు సంవత్సర కాలంలో 1846 మొబైల్స్ రికవరీ చేశారు. ఇప్పటి వరకు 4 కోట్ల 80 లక్షల విలువైన ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్ రెడ్డి, సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఐటీ కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది, పోలీస్ సైబర్ వారియర్స్, మొబైల్ పోగొట్టుకున్న బాధితులు పాల్గొన్నారు.

## విద్యుత్ మౌలిక వసతులు కల్పించాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 3 (జనం సాక్షి) :** రానున్న పదేళ్లలో ఖమ్మం నగరం మరింత విస్తరించనున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. సోమవారం రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద నూతనంగా రూ.3.62 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి ఖమ్మం నగర అభివృద్ధి వేగంగా జరుగుతున్న నేపథ్యంలో రాబోయే విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. రానున్న పదేళ్ల అవసరాలను అంచనా వేసి అదనపు విద్యుత్ ఉపకేంద్రాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఖమ్మం నగరానికి 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రం అత్యవసర అవసరమని పేర్కొన్న మంత్రి, ఉపకేంద్రం ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూమిని వెంటనే గుర్తించి, ఎక్కడ నిర్మించాలనే అంశంపై ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. స్థల ఎంపిక, అంచనా వ్యయం, సాంకేతిక ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి తక్షణమే పంపించాలని ఆదేశించారు. కొత్తగా ప్రతిపాదించే విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి కావాలని, భూమి కేటాయింపు పూర్తికాగానే శంకుస్థాపన చేసి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి జిల్లాకు చెందిన వారే కావడంతో అవసరమైన పరిపాలనా, ఆర్థికపరమైన అనుమతులు త్వరితగతిన లభిస్తాయని అన్నారు జిల్లా కలెక్టర్ స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల నుంచి అవసరమైన అనుమతులు, ఎన్‌ఓసీలు సకాలంలో జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ఖమ్మం నగర భవిష్యత్ అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీఓ శ్రీనివాస్, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం వద్ద సాధారణ స్థితికి చేరిన గోదావరి

భద్రాచలం, ఆగస్టు 3 (జనంసాక్షి) : భద్రాచలం వద్ద గోదావరి సాధారణ స్థితికి చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు 40.20 అడుగులున్న గోదావరి సోమవారం ఉదయం 5 గంటలకు 38.90, 8 గంటలకు 38.20, 11 గంటలకు 37.70 అడుగులకు చేరింది. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు 36.90, సాయంత్రం 5 గంటలకు 36.10 అడుగులకు చేరింది. మంగళవారం నాటికి మరింతగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో పాటు ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల నిలిచిపోవడంతో గోదావరి క్రమేపి తగ్గుతోంది. అలాగే వరద బాధిత శిబిరాల్లో ఉన్న వారిని సైతం సోమవారం ఇళ్లకు పంపారు. అదేవిధంగా భద్రాచలం–వెంకటాపురం మార్గంలో, భద్రాచలం కూనవరం మార్గాల్లో రాకపోకలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. పర్ణశాల రామాలయాన్ని సందర్శించేందుకు సైతం భక్తులు వెళ్లే మార్గంలో వరద నీరు తొలగడంతో ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నాయి.

## కోదాడలో భారీగా గంజాయి, కోడీన్ సిరప్ స్వాధీనం

- ఏడుగురు నిందితులు, ముగ్గురు బాల నేరస్తులపై ఎన్‌డీపీఎస్ కేసు
- ఒడిశా నుంచి గంజాయి సరఫరా చేస్తున్నట్లు ప్రధాన నిందితుడి అంగీకారం
- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా కోడీన్ సిరప్ విక్రయం వెలుగులోకి..




**కోదాడ, ఆగస్టు 3 (జనం సాక్షి) :** కోదాడ టౌన్ పోలీసులు మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిర్వహించిన ప్రత్యేక దాడిలో 6 కిలోల గంజాయి, 38 టోసెక్స్ (కోడీన్) సిరప్ బాటిళ్లు, ఒక హీరో గ్లామర్ మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఏడుగురు నిందితులు, ముగ్గురు బాల నేరస్తులపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం, ఆగస్టు 2న సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు శ్రీరంగాపురంలోని దేగబాబు ఫంక్షన్ హాల్ సమీపంలో కోదాడ టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన నిందితుడు మద్దీ రవితేజను అదుపులోకి తీసుకుని విచారించగా, ఒడిశాలోని మల్కనగిరి ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి కోదాడకు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు తెలిపారు. అతని ద్వారా మరికొందరికి గంజాయి సరఫరా జరుగుతున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. విచారణలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా కోడీన్ కలిగిన టోసెక్స్ సిరప్‌ను అక్రమంగా విక్రయిస్తున్న వ్యవహారం కూడా బయటపడిందన్నారు. వైరా రోడ్డులోని ఏజే మెడినోవా మెడికల్ అండ్ జనరల్ స్టోర్ నుంచి సిరప్ కొనుగోలు చేసినట్లు గుర్తించి 38 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి పాత్రపై కూడా విచారణ కొనసాగుతోందన్నారు.

## ప్రజావాణి వినతుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 3 (జనం సాక్షి) :** సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డిఆర్ఓ పద్మావతి లతో కలసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కల్పించిన అత్యంత కీలక వేదిక అని అన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలం అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని బాలాజీనగర్ కాలనీవాసులు పెంట్లం సబ్‌స్టేషన్‌కు 132/33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణ పనులు గ్రామ శివారు నుంచి చేపట్టాల్సి ఉండగా కాలనీ మధ్యలో చేపడుతున్నారని, దీనివల్ల ప్రజలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. విద్యుత్ లైన్ నిర్మాణాన్ని కాలనీ మధ్య నుంచి కాకుండా గ్రామ శివారు నుంచి చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సమర్పించిన వినతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల నిమిత్తం సంబంధిత విద్యుత్ శాఖ ఈఈకు ఎండార్స్ చేశారు.

## ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు తల్లిదండ్రుల ఫిర్యాదు

- స్పందించిన కలెక్టర్..
- హుటాహుటిన డీఈవో ఆకస్మిక తనిఖీ

**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 3 (జనం సాక్షి) :** పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు నరసింహారావు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు నాలుగోసారి ఫిర్యాదు చేశారు. సంబంధిత ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల విద్యాభివృద్ధికి నష్టం జరుగుతోందని, గతంలో మూడు సార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు. ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించగా, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) బిక్షపతి వెంటనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు, బోధన, పాఠశాల నిర్వహణను పరిశీలించి సంబంధిత ఉపాధ్యాయుల నుంచి వివరణ కోరినట్లు సమాచారం. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తెలిసింది. ఆరోపణలు నిజమని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. కాగా, విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా సంబంధిత ఇద్దరు ఉపాధ్యాయులపై తక్షణ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**మెదక్ బ్యూరో, ఆగస్టు 3 (జనం సాక్షి) :** ప్రజా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు జిల్లా నలుమూల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఫిర్యాదులను స్వీకరించారు. అందులో భూభారతి 14, పెన్షన్లు 7, హౌసింగ్ 6 , ఇతర 30 , మొత్తం 57 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 4 (జనం సాక్షి) :** కొత్తగూడెం ప్రగతి మైదానంలో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి, పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని, ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రగతి మైదానంలో ప్రధాన వేదికను ఆకర్షణీయంగా రూపొందించడంతో పాటు ప్రోటోకాల్‌కు అనుగుణంగా ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, అధికారులు, విశిష్ట అతిథులు, మీడియా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను సక్రమంగా ఏర్పాటు చేసి బ్యారికేడ్లు, పార్కింగ్, సూచిక బోర్డులు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వాటర్‌ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు వేదిక, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచి సౌండ్ సిస్టమ్, మైకులు, లైటింగ్, ఎల్ఈడీ స్క్రీన్లు ముందస్తుగా పరీక్షించాలని సంబంధిత శాఖలకు సూచించారు. వేడుకల ప్రాంగణంలో 108 అంబులెన్స్, వైద్య బృందాలు, ప్రథమ చికిత్స కేంద్రం, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని ఆరోగ్య శాఖకు ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఫైర్ టెండర్లను సిద్ధంగా ఉంచాలని, పోలీసు శాఖ ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం భారత ప్రభుత్వ ప్రోటోకాల్‌కు అనుగుణంగా అత్యంత గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, అటవీ, వైద్యం, విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, ఆర్టీసీ తదితర శాఖలు తమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఆకర్షణీయమైన ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులతో దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, నాటికలు నిర్వహించి జాతీయ భావనను పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించాలని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రశంసా పత్రాల ప్రదానం కోసం శాఖల వారీగా ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగుల వివరాలను నిర్ణీత గడువులోపు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు తమకు అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి సమన్వయంతో పనిచేసి జిల్లా ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేలా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డిఆర్ఓ పద్మావతి, జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రెపో రేటుపై ఆర్బీఐ కసరత్తు.. యథాతథానికే మొగ్గు?

- మూడు రోజుల ఎంపీసీ సమావేశం ప్రారంభం.. ఆగస్టు 5న నిర్ణయం వెల్లడి
- భౌగోళిక ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణ ఆందోళనలతో వడ్డీ రేటు కోతపై సందేహాలు
- చమురు ధరల ప్రభావంతో ద్రవ్యోల్బణ అంచనాల పెంపు.. జీడీపీ వృద్ధి అంచనాల తగ్గింపు
- పరిస్థితులు స్పష్టమయ్యే వరకు 'స్టేటస్ కో' కొనసాగించే అవకాశమే ఎక్కువ: నిపుణులు




**ముంబయి, ఆగస్టు 3 (జనంసాక్షి) :**
దేశంలో కీలక వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకునే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల సమావేశం సోమవారం ప్రారంభమైంది. ఈ సమావేశం అనంతరం ఆగస్టు 5న ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ద్రవ్య పరపతి విధాన సమీక్షా నిర్ణయాలను ప్రకటించనున్నారు. ఈసారి రెపో రేటులో కోత ఉండే అవకాశాలు స్వల్పంగానే ఉన్నాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ భౌగోళిక అనిశ్చితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో ఆర్బీఐ మరోసారి వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించే అవకాశమే ఎక్కువగా కనిపిస్తున్నట్లు విశ్లేషిస్తున్నారు.
గత జూన్‌లో జరిగిన ఎంపీసీ సమావేశంలో పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్బీఐ వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. రెపో రేటును 5.25 శాతం వద్దనే కొనసాగించింది. అనంతరం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, దేశీయంగా ఇంధన ధరలపై ఒత్తిడి పెరగడంతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాను 4.6 శాతం నుంచి 5.1 శాతానికి పెంచింది. అదే సమయంలో జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది.
ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక అనిశ్చితులు కొనసాగుతున్నాయని, ముడి చమురు ధరలు, విదేశీ మారకపు విలువల్లో తీవ్ర ఒడుదొడుకులు నెలకొన్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచే అవకాశమున్నందున రెపో రేటుతో పాటు ద్రవ్య పరపతి వైఖరినీ ఆర్బీఐ యథాతథంగా కొనసాగించే అవకాశమే ఎక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.
పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, నైరుతి రుతుపవనాల ప్రభావంపై మరింత స్పష్టత వచ్చే వరకు ఆర్బీఐ వేచి చూసే ధోరణినే అనుసరించే అవకాశం ఉందని క్రిసిల్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్, ప్రిన్సిపల్ ఎకనమిస్ట్ దీప్తి దేశ్‌పాండే తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వడ్డీ రేట్లపై తొందరపాటు నిర్ణయం తీసుకునే అవకాశం తక్కువేనని, ఆర్థిక పరిస్థితులను మరికొంతకాలం పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలపై స్పష్టత వచ్చే అవకాశముందని ఆర్థిక వర్గాలు భావిస్తున్నాయి.

# విదేశీ పెట్టుబడులకు ఊతం

*ఈ వారం పార్లమెంటులో కొత్త పన్ను బిల్లు!*

- విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రం కీలక చర్య
- డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రోత్సాహకాలు
- ఎఫ్ఐఐలకు పన్ను మినహాయింపునకు చట్టబద్ధత
- ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లు ప్రవేశపెట్టే అవకాశం




న్యూఢిల్లీ, ఆగస్టు 3: విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించడంతో పాటు డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో దేశీయ తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'పన్నులు మరియు ఇతర చట్టాల (సవరణ) బిల్లు-2026'ను ఈ వారం పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో పెట్టుబడులకు అనుకూలమైన పన్ను నిబంధనలతో పాటు తయారీ రంగానికి అదనపు ప్రోత్సాహకాలు కల్పించే ప్రతిపాదనలు ఉండనున్నట్లు సమాచారం. ముఖ్యంగా భారత్‌ను గ్లోబల్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ చర్యలు ఉపయోగపడతాయని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టే విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులకు (ఎఫ్ఐఐలు) విత్‌హోల్డింగ్ పన్ను నుంచి మినహాయింపు కల్పిస్తూ జూన్ 5న తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించే నిబంధనలను కూడా ఈ బిల్లులో చేర్చనున్నట్లు తెలుస్తోంది. దీంతో విదేశీ పెట్టుబడులు పెరగడంతో పాటు భారత ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## 'యస్' చెబితేనే నగదు బదిలీ.. యూపీఐకి కొత్త భద్రతా ఫీచర్

న్యూఢిల్లీ: యూపీఐ చెల్లింపుల్లో సైబర్ మోసాలను అరికట్టేందుకు బ్యాంకులు కొత్త భద్రతా ఫీచర్‌ను ప్రతిపాదించాయి. హైరిస్క్ లావాదేవీల్లో పిన్ లేదా బయోమెట్రిక్ ధృవీకరణ తర్వాత కస్టమర్'వం' ఎంపికను నొక్కిన తర్వాతే నగదు బదిలీ పూర్తయ్యేలా ఆర్బీఐకి సూచించినట్లు సమాచారం. అనుమానాస్పద లావాదేవీని బ్యాంకు ఫ్రాడ్ డిటెక్షన్ సిస్టమ్ గుర్తిస్తే కస్టమర్ మొబైల్‌లో 'యస్' పాప్-అప్ కనిపిస్తుంది.'వం' ఎంచుకుంటేనే డబ్బు బదిలీ అవుతుంది. ఇటీవల ఫోన్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా యూపీఐ వినియోగదారులను మోసగించే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఫీచర్‌ను కేవలం హైరిస్క్ ట్రాన్సాక్షన్లకే అమలు చేయాలని బ్యాంకులు ప్రతిపాదించగా, దీనిపై ఆర్బీఐ పరిశీలిస్తోంది.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 530 | ₹ 63.60 |
| వరంగల్ | ₹ 532 | ₹63.84 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹1,44,220 | ₹1,32,200 |
| చెన్నై | ₹1,44,550 | ₹1,32,500 |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్ ₹2,35,000

# ఐటీ రంగంలో తగ్గనున్న 'బెంచ్' ఉద్యోగులు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెరుగైన వర్క్‌ఫోర్స్ ప్లానింగ్, డిమాండ్ ఆధారిత నియామకాలతో భారత ఐటీ రంగంలో ఉద్యోగ నియామక విధానం వేగంగా మారుతోంది. దీంతో రానున్న సంవత్సరాల్లో దేశంలోని అగ్రశ్రేణి ఐటీ కంపెనీలు చాలా తక్కువ 'బెంచ్ స్ట్రెంగ్త్'లిలితోనే కార్యకలాపాలు నిర్వహించే అవకాశముందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (ంజూ), ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్‌టెక్, విప్రో, టెక్ మహీంద్రా వంటి ప్రముఖ ఐటీ సంస్థల్లో సగటు బెంచ్ స్ట్రెంగ్త్ గత మూడు సంవత్సరాల్లో గణనీయంగా తగ్గి సింగిల్ డిజిట్ స్థాయికి, లేదా గరిష్ఠంగా 12 శాతానికి చేరినట్లు సమాచారం. గతంలో భవిష్యత్ ప్రాజెక్టులను దృష్టిలో ఉంచుకుని పెద్ద సంఖ్యలో ఉద్యోగులను బెంచ్‌పై ఉంచే సంస్థలు, ఇప్పుడు అవసరానికి అనుగుణంగా మాత్రమే నియామకాలు చేపడుతున్నాయి. ఏఐ ఆధారిత ఆటోమేషన్, ఖర్చుల నియంత్రణ, ఉద్యోగుల వినియోగ సామర్థ్యాన్ని పెంచడంపై కంపెనీలు దృష్టి సారించడంతో ఐటీ రంగంలో సంప్రదాయ ఉపాధి విధానంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో భవిష్యత్‌లో బెంచ్‌పై ఎక్కువకాలం ఉద్యోగులు ఉండే పరిస్థితులు తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

- ఒక్కరోజే రూ.5 లక్షల కోట్ల సంపద పెరుగుదల
- ట్రంప్ ప్రకటనతో పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారిన ప్రభావం
- వరుసగా నాలుగో సెషన్ లాభాల్లో ముగిసిన సూచీలు
- సెన్సెక్స్ 544 పాయింట్లు, నిఫ్టీ 391 పాయింట్లు ఎగిసిన తీరు
- ఐటీ షేర్లకు డిమాండ్.. ఇండిగో, టీసీఎస్, ఇన్ఫోసిస్‌కు భారీ లాభాలు


# స్టాక్ మార్కెట్లలో జోరు



**ముంబయి, ఆగస్టు 3 (జనంసాక్షి) :**
దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం మరోసారి భారీ లాభాలతో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో చర్చలు జరగనున్నాయని ప్రకటించడంతో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు కొంత సద్దుమణిగాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టగా, విదేశీ సంస్థాగత మదుపర్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఈ సానుకూల పరిణామాల ప్రభావంతో దేశీయ సూచీలు వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. ఒక్కరోజులోనే మదుపర్ల సంపద సుమారు రూ.5 లక్షల కోట్ల మేర పెరిగింది.
ఉదయం సానుకూల సంకేతాలతో ప్రారంభమైన బీఎస్ఈ సెన్సెక్స్ 78,883.34 పాయింట్ల వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించిం ది. రోజంతా లాభాల బాటలో కొనసాగిన సూచీ ఇంట్రాడేలో 78,895.10 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. చివరికి 544.39 పాయింట్లు పెరిగి 78,639.03 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 390.70 పాయింట్లు ఎగబాకి 24,774. 30 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.31 వద్ద కొనసాగింది.
సెన్సెక్స్‌లోని 30 ప్రధాన షేర్లలో ఇండిగో, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎటర్నల్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ సుజుకి, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు స్వల్ప నష్టాలను చవిచూశాయి.
అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 83.83 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,054.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మార్కెట్లలో అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, చమురు ధరల కదలికలపై మదుపర్లు దృష్టి సారించినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

- రోడ్డు భద్రతకు కేంద్రం కీలక ప్రతిపాదన
- వాహనాల మధ్య సమాచార మార్పిడితో ప్రమాదాల నివారణ
- కొత్త వాహనాలకు దశలవారీగా అమలు చేసే యోచన
- డ్రైవర్లకు ముందస్తు హెచ్చరికలతో భద్రత పెంపే లక్ష్యం

# 2028 నుంచి వాహనాల్లో వి2వి కమ్యూనికేషన్ తప్పనిసరి?



న్యూఢిల్లీ, ఆగస్టు 3: దేశంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రయాణ భద్రతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదన చేసింది. 2028 నుంచి కొత్త వాహనాల్లో వాహనం-టు-వాహనం కమ్యూనికేషన్ వ్యవస్థను తప్పనిసరి చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ సాంకేతికత ద్వారా ఒక వాహనం తన వేగం, దిశ, బ్రేకింగ్ వంటి సమాచారాన్ని సమీపంలోని ఇతర వాహనాలతో నేరుగా పంచుకుంటుంది. దీంతో ఆకస్మిక బ్రేకింగ్, బ్లైండ్ స్పాట్‌లు, కూడళ్ల వద్ద ఢీకొనే ప్రమాదాలు, లేన్ మార్పుల సమయంలో జరిగే ప్రమాదాలను ముందుగానే గుర్తించి డ్రైవర్లకు హెచ్చరికలు అందించవచ్చు. ప్రతిపాదన ప్రకారం 2028 నుంచి తయారయ్యే కొత్త వాహనాల్లో ఈ వ్యవస్థను దశలవారీగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో రోడ్డు భద్రత మరింత మెరుగుపడటంతో పాటు ఆధునిక, అనుసంధానిత రవాణా వ్యవస్థకు భారత్ మరో అడుగు ముందుకు వేయనుంది. అయితే ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం నుంచి అధికారిక నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది.

# ఈపీఎఫ్ పరిధి విస్తరణకు అడుగు

- వేతన పరిమితి రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంపు ప్రతిపాదన
- తుది నిర్ణయం కేంద్ర మంత్రివర్గం ఆమోదంపైనే
- కోట్లాది ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్)లో మరింత మంది ఉద్యోగులను చేర్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈపీఎఫ్‌లో తప్పనిసరి సభ్యత్వానికి అమల్లో ఉన్న నెలవారీ వేతన పరిమితి రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచే ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తుది ఆమోదం కోసం ఈ ప్రతిపాదనను త్వరలో కేంద్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉందని సమాచారం.
ప్రస్తుతం నెలకు రూ.15 వేల వరకు వేతనం పొందే ఉద్యోగులకు మాత్రమే ఈపీఎఫ్ సభ్యత్వం తప్పనిసరిగా వర్తిస్తోంది. కొత్త ప్రతిపాదన అమల్లోకి వస్తే రూ.25 వేల వరకు వేతనం పొందే ఉద్యోగులు కూడా తప్పనిసరిగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. దీంతో లక్షలాది మంది ఉద్యోగులకు పదవీ విరమణ అనంతర ఆర్థిక భద్రతతో పాటు భవిష్యనిధి ప్రయోజనాలు అందే అవకాశం ఉంది.
వేతన పరిమితి పెంపుతో ఉద్యోగుల చేతికి వచ్చే జీతంలో స్వల్ప మార్పు ఉండే అవకాశం ఉన్నప్పటికీ, భవిష్యత్తు కోసం అధిక మొత్తంలో పొదుపు సమకూరుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ఉద్యోగుల తరఫున ఈపీఎఫ్‌కు చెల్లించాల్సిన వాటా పెరగడంతో యాజమాన్యాలపై కూడా అదనపు భారం పడే అవకాశముంది. ఈపీఎఫ్ వేతన పరిమితిని చివరిసారిగా 2014లో రూ.6,500 నుంచి రూ.15 వేలకు పెంచారు. అప్పటి నుంచి దాదాపు పదేళ్లుగా అదే పరిమితి కొనసాగుతోంది. వేతన స్థాయిలు పెరగడం, సంఘటిత రంగంలో ఉద్యోగుల సంఖ్య అధికమవుతున్న నేపథ్యంలో పరిమితిని పెంచాల్సిన అవసరం ఉందని చాలా కాలంగా కార్మిక సంఘాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు వచ్చిన వార్తలకు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈ ప్రతిపాదన అమల్లోకి రావాలంటే కేంద్ర మంత్రివర్గం అధికారికంగా ఆమోదించి, ప్రభుత్వం ప్రకటన విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.


# రష్యా చమురుకే భారత్ మొగ్గు..

- జులైలో రికార్డు స్థాయి దిగుమతులు
- రోజుకు 2.8 మిలియన్ బ్యారెళ్ల దిగుమతి..
- మూడేళ్లలో తొలిసారి అత్యధికం
- మొత్తం దిగుమతుల్లో రష్యా వాటా 55.5 శాతం
- ఎల్పీజీ కోసం అమెరికాపైనే ఆధారం.. దిగుమతుల్లో 73 శాతం వాటా

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (జనంసాక్షి) :** భారత్‌కు రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు జులై నెలలో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన 2022 తర్వాత తొలిసారిగా రోజుకు 2.8 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత్ దిగుమతి చేసుకుంది. హర్మూజ్ జలసంధిలో పరిస్థితులు మెరుగుపడడంతో పశ్చిమాసియా దేశాల నుంచి కూడా సరఫరాలు పెరుగుతున్నప్పటికీ, తక్కువ ధరలకు నిరంతరాయంగా అందుబాటులో ఉండే రష్యా చమురుపైనే భారత రిఫైనరీలు ఎక్కువగా ఆధారపడుతున్నట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. షిప్ ట్రాకింగ్ సంస్థ 'కెప్లర్' వివరాల ప్రకారం జులై నెలలో భారత్ ప్రపంచవ్యాప్తంగా రోజుకు 5 మిలియన్ బ్యారెళ్లకు పైగా ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఇది జూన్ నెలతో పోలిస్తే స్వల్పంగా అధికం. రష్యా నుంచి జూన్‌లో రోజుకు 2.7 మిలియన్ బ్యారెళ్ల దిగుమతి కాగా, జులైలో అది 2.8 మిలియన్ బ్యారెళ్లకు పెరిగింది. దీంతో దేశ మొత్తం ముడి చమురు దిగుమతుల్లో రష్యా వాటా 55.5 శాతానికి చేరింది.
రష్యా నుంచి చమురు సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుండటమే దిగుమతులు పెరగడానికి ప్రధాన కారణమని కెప్లర్ ప్రధాన విశ్లేషకుడు నిఖిల్ దుబే తెలిపారు. మరోవైపు ఎల్పీజీ దిగుమతుల విషయంలో మాత్రం భారత్ అమెరికాపైనే ఎక్కువగా ఆధారపడింది. జులైలో దిగుమతి చేసుకున్న 1.2 మిలియన్ టన్నులకు పైగా ఎల్పీజీలో సుమారు 73 శాతం అమెరికా నుంచే కొనుగోలు చేసినట్లు నివేదిక పేర్కొంది. జులై నెల నుంచి భారతీయ రిఫైనరీలు పశ్చిమాసియా దేశాల నుంచి కూడా ముడి చమురు కొనుగోళ్లను పెంచినట్లు కెప్లర్ వెల్లడించింది. ముఖ్యంగా సౌదీ అరేబియా నుంచి దిగుమతులు గణనీయంగా పెరిగాయి. జూన్‌లో రోజుకు 2.9 లక్షల బ్యారెళ్లుగా ఉన్న దిగుమతులు జులైలో 4.2 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయి. ఇరాక్, కువైట్‌ల నుంచి కూడా సరఫరాలు మళ్లీ పెరిగాయి. అయితే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి ముడి చమురు దిగుమతులు జూన్‌లో రోజుకు 5.1 లక్షల బ్యారెళ్లుగా ఉండగా, జులైలో 4.6 లక్షల బ్యారెళ్లకు తగ్గాయి. అయినప్పటికీ భారతదేశానికి రెండో అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా యూఏఈ తన స్థానాన్ని కొనసాగించింది. ప్రపంచ ఇంధన మార్కెట్లో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తక్కువ ధరలు, స్థిరమైన సరఫరాను దృష్టిలో ఉంచుకుని భారత్ తన దిగుమతి వ్యూహాన్ని కొనసాగిస్తున్నట్లు ఇంధన రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# 140 కోట్ల మందిపై చైనా నిఘా?

- విదేశీయుల వ్యక్తిగత వివరాలూ వెబ్‌సైట్‌లో ఉన్నట్లు అమెరికా మీడియా వెల్లడి
- ఫోన్ సిగ్నల్స్, కెమెరాల ద్వారా కదలికలపై నిరంతర పర్యవేక్షణ
- భారతీయులు సహా పలు దేశాల విద్యార్థులు, సందర్శకుల సమాచారం నమోదు
- కథనాలపై అధికారికంగా స్పందించని చైనా



**బీజింగ్/వాషింగ్టన్, ఆగస్టు 3 (జనంసాక్షి) :**
చైనా ప్రపంచవ్యాప్తంగా సుమారు 140 కోట్ల మందిపై విస్తృత స్థాయిలో నిఘా వ్యవస్థను నిర్వహిస్తున్నట్లు అమెరికాకు చెందిన ఓ ప్రముఖ పత్రిక సంచలన కథనాన్ని ప్రచురించింది. చైనా పౌరులతో పాటు ఆ దేశాన్ని సందర్శించిన విదేశీయుల వ్యక్తిగత వివరాలు, ప్రయాణ సమాచారం, కదలికలు కూడా ప్రత్యేక డేటాబేస్‌లో నమోదై ఉన్నట్లు ఆ కథనం పేర్కొంది. ఈ అంశం అంతర్జాతీయ స్థాయిలో గోప్యత, డేటా భద్రతపై మరోసారి చర్చకు దారితీసింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం సైబర్ భద్రత పరిశోధకుడు మార్క్ హోఫర్ ఈ ఏడాది జనవరిలో చైనా నిఘా వ్యవస్థపై పరిశోధన చేస్తుండగా 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే వెబ్‌సైట్‌ను గుర్తించారు. అందులో తన పేరు, ఫొటో, పాస్‌పోర్టు నంబర్, గతంలో చైనా పర్యటన సందర్భంగా ఉపయోగించిన మొబైల్ నంబర్ వంటి వ్యక్తిగత వివరాలు కనిపించడంతో ఆయన ఆశ్చర్యానికి గురైనట్లు వెల్లడించారు.
పరిశీలనలో భాగంగా చైనాలోని జాంగ్‌జియాకౌ నగరాన్ని సందర్శించిన విదేశీయుల వివరాలు పెద్ద ఎత్తున నమోదై ఉన్నట్లు గుర్తించారు. భారత్, తైవాన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, బ్రిటన్, అమెరికా, ఈజిప్ట్, ఇరాన్, ఇజ్రాయెల్, మొరాకో, పాకిస్థాన్, సూడాన్ తదితర దేశాల పౌరుల సమాచారం అందులో ఉన్నట్లు తెలుస్తోంది. హెబే నార్త్ యూనివర్సిటీలో చదువుతున్న విదేశీ విద్యార్థుల వివరాలు కూడా నమోదై ఉండగా, వారిలో భారతీయులు, పాకిస్థాన్‌కు చెందిన విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. విదేశీయుల వ్యక్తిగత వివరాలతో పాటు వారు ఎక్కడికి వెళ్లారు, ఏ రవాణా సౌకర్యాన్ని ఉపయోగించారు, ఏ విమానం లేదా రైలులో ప్రయాణించారు, సీటు నంబర్లు వంటి సమాచారం కూడా నమోదు చేసినట్లు కథనం వెల్లడించింది. కెమెరాలు, మొబైల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వారి కదలికలను ట్రాక్ చేసినట్లు, వారు స్వదేశాలకు తిరిగి వెళ్లిన తర్వాత కూడా పర్యవేక్షణ కొనసాగినట్లు పేర్కొంది.
ఈ వెబ్‌సైట్‌కు చైనా పోలీసు విభాగాలకు రోబోటిక్స్, నిఘా పరికరాలను సరఫరా చేసే 'ఆరిజిన్ డైనమిక్' సంస్థతో సంబంధాలు ఉన్నట్లు కూడా కథనంలో ప్రస్తావించారు. 2019లో హాంకాంగ్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు చెలరేగిన తర్వాత చైనా తన నిఘా వ్యవస్థను మరింత విస్తరించిందని, విదేశీ సంబంధాలు కలిగిన వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొంది. అయితే ఈ వెబ్‌సైట్‌లోని సమాచారం మే నెలలో అకస్మాత్తుగా అదృశ్యమైనట్లు తెలుస్తోంది. అంతకుముందే పరిశోధకుడు మార్క్ హోఫర్ సంబంధిత డేటాను డౌన్‌లోడ్ చేసుకోవడంతో ఈ వివరాలు వెలుగులోకి వచ్చినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. కాగా, ఈ ఆరోపణలపై చైనా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. గోప్యత, డిజిటల్ నిఘాపై ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న చర్చల మధ్య ఈ కథనం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ట్రంప్ హెచ్చరికలతో మళ్లీ ఉద్రిక్తమైన గల్ఫ్ ప్రాంతం

- 'విజన్-2030' లక్ష్యాలకు యుద్ధం అడ్డంకిగా మారే భయం
- ఇరాన్ ప్రతీకార హెచ్చరికలతో అప్రమత్తమైన సౌదీ అరేబియా
- హూతీల ముప్పు, హర్మూజ్ సంక్షోభంతో శాంతి చర్చలపై దృష్టి



**రియాద్/వాషింగ్టన్, ఆగస్టు 3 (జనంసాక్షి) :**
అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మరోసారి యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. హర్మూజ్ జలసంధి కేంద్రంగా ప్రారంభమైన తాజా పరిణామాలు గల్ఫ్ ప్రాంతంలో ఆందోళనలను మరింత పెంచుతున్నాయి. ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, కీలక మౌలిక సదుపాయాలపై దాడులు చేపట్టేందుకు వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వరుస హెచ్చరికలు చేస్తుండగా, ఈ పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించాలని సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ నేరుగా ట్రంప్‌ను ఫోన్‌లో కోరినట్లు సమాచారం. ఈ పరిణామం గల్ఫ్ ప్రాంత భద్రతకు సౌదీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని మరోసారి స్పష్టం చేసింది.
ప్రపంచంలో అతిపెద్ద చమురు ఉత్పత్తి దేశాల్లో ఒకటైన సౌదీ అరేబియా ప్రస్తుతం 'విజన్-2030' అభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. చమురుపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థను విస్తరించి పెట్టుబడులు, పర్యాటకం, లాజిస్టిక్స్, సాంకేతిక ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో భారీ సంస్కరణలు చేపడుతోంది. అయితే అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ ప్రాంతంలో అనిశ్చితి నెలకొనడం, హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాపై ప్రభావం పడే పరిస్థితులు ఏర్పడడం సౌదీ ఆర్థిక ప్రయోజనాలకు సవాలుగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు, అమెరికా తన విద్యుత్ కేంద్రాలు లేదా కీలక మౌలిక సదుపాయాలపై దాడులకు దిగితే తీవ్ర ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరిస్తోంది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ ప్రాంతంలోని దేశాల మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలు, అమెరికా సైనిక స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని టెహ్రాన్ సంకేతాలు ఇస్తోంది. ముఖ్యంగా సౌదీ అరేబియాలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు దాడుల పరిధిలోకి వచ్చే ప్రమాదం ఉందన్న ఆందోళన రియాద్‌లో వ్యక్తమవుతోంది. ఇక యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులకు ఇరాన్ మద్దతు ఉండటం కూడా సౌదీకి మరో ప్రధాన ఆందోళనగా మారింది. గతంలో హూతీలు డ్రోన్లు, క్షిపణులతో సౌదీ లక్ష్యాలపై దాడులు చేసిన అనుభవం ఉండటంతో, తాజా యుద్ధం మరింత విస్తరించే అవకాశాలను సౌదీ తక్కువగా అంచనా వేయడం లేదు. గల్ఫ్ ప్రాంతంలో కొత్త ఘర్షణలు చెలరేగితే హూతీలు కూడా రంగంలోకి దిగే అవకాశం ఉందని భద్రతా నిపుణులు భావిస్తున్నారు.
ఈ నేపథ్యంలో ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు దౌత్య ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఇటీవల పాకిస్థాన్, తుర్కియే, సౌదీ అరేబియా ఉన్నతాధికారులతో సమావేశమై ప్రాంతీయ భద్రతపై చర్చించారు. మరోవైపు అమెరికా--ఇరాన్ మధ్య రాజీ కుదిర్చేందుకు ఖతార్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, హర్మూజ్ జలసంధిలో రవాణా సాధారణ స్థితికి తీసుకురావడానికి ఒమన్ కూడా ఇరాన్, అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతోంది. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధం మరింత విస్తరించకుండా దౌత్యపరమైన పరిష్కారమే ఏకైక మార్గమని అంతర్జాతీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# అగ్నిప్రమాదం.. 3 లక్షల నగదు బూడిద

**గద్వాల, జులై 3(జనంసాక్షి)**



గద్వాల్ పట్టణంలోని పిల్లిగుండ్ల కాలనీలో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పట్టణంలో నివాసముంటున్న బుడగ జంగాల గోపాల్ గారి గుడిసెలో ఎవరూ లేని సమయంలో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించేలోపే గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఇంటి అవసరాల కోసం తెచ్చిన రూ.3 లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు, ఇంటి ప్లాట్ పత్రాలు, కుమారుడి చదువు సర్టిఫికెట్లు మరియు ఇంట్లోని సామాగ్రి మొత్తం కాలి బూడిదయ్యాయి. ఒక్కసారిగా అంతా కోల్పోవడంతో గోపాల్ కుటుంబం రోడ్డున పడింది. "ప్రభుత్వం, దాతలు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని" బాధితుడు గోపాల్ కన్నీరుమున్నీరుగా వేడుకుంటున్నారు.

# చిట్టీల పేరుతో మోసం



**అమీన్పూర్, ఆగస్టు 3 (జనం సాక్షి) :** ఇద్దరు భార్య భర్తలు చిట్టీల పేరుతో సుమారు రూ. 2.50కోట్లు మోసం చేసి పారిపోయిన సంఘటన అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్పూర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పటేల్ గూడా బిఎస్ఆర్ కాలనీలో ఉండే శిరీష, సాంబశివరావు భార్యాభర్తలు. గత 20 ఏళ్లుగా చిట్టీల వ్యాపారం చేస్తున్నారు. చిట్టీలు వేస్తున్న వారి వద్ద నుంచి డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వకుండా కాలం వెలదీస్తూ వస్తున్నారు. సుమారు 20 మంది బాధితులకు సుమారు రూ.2.50 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆదివారం కాలనీలో ఉండే సొంత ఇంటిని కూడా అమ్ముకొని ఎవరికి చెప్పకుండా పారిపోయారు. దాంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏటీఎంల వద్ద హెల్పింగ్.. పిన్ తీసుకుని జంపింగ్

## అమాయకులకు మోసం చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



**అమీన్‌పూర్, ఆగస్టు 03 (జనం సాక్షి)**

ఏటీఎంల వద్ద అమాయకులు, ముఖ్యంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని వారి ఏటీఎం కార్డులను మార్చి నగదు కాజేస్తున్న అంతర్రాష్ట్ర నేర ముఠాను అమీన్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో రాజస్థాన్, హర్యానాకు చెందిన ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో 8 మంది పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. జూలై 29న అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఓ బాధితుడు ఫిర్యాదు చేశాడు. జూలై 27న కిష్టారెడ్డిపేటలోని ఎస్‌బీఐ ఏటీఎంకు నగదు డ్రా చేసేందుకు వెళ్లిన సమయంలో నగదు రాకపోవడంతో అక్కడే ఉన్న ఇద్దరు వ్యక్తులు సహాయం చేస్తామని చెప్పి అతని ఏటీఎం కార్డు, పిన్ నంబర్ తీసుకుని ప్రయత్నించారు. అనంతరం మరో కార్డును అతనికి ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరుసటి రోజు తన ఖాతా నుంచి రూ.65,400 నగదు డ్రా అయినట్లు సందేశాలు రావడంతో మోసపోయిన విషయం తెలుసుకుని పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అమీన్‌పూర్ పోలీసులు సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించి రాజస్థాన్‌కు చెందిన షాహజద్, హజరుద్దీన్, మొహమ్మద్ జాఫర్, హర్యానాకు చెందిన మొహమ్మద్ వాసిం, షాకీబ్, మొహమ్మద్ అశ్వక్ ఖాన్‌లను అరెస్టు చేశారు. నిందితులు ఏటీఎంల వద్ద మాటల్లో పెట్టి బాధితుల పిన్ నంబర్ తెలుసుకుని, చాకచక్యంగా వారి కార్డులను మార్చి, అనంతరం వివిధ ఏటీఎంలలో నగదు డ్రా చేయడంతో పాటు పీఓఎస్ (స్వైపింగ్) యంత్రాల ద్వారా లావాదేవీలు నిర్వహించి డబ్బు కాజేసినట్లు విచారణలో వెల్లడైంది. నిందితులు జీడిమెట్లలో ఓ గదిలో ఉంటూ అమీన్‌పూర్‌తో పాటు హైదరాబాద్, సైబరాబాద్ పరిధి, పరిసర ప్రాంతాలు, హర్యానాలోనూ ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. దోచుకున్న నగదులో కొంత మొత్తాన్ని వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేసినట్లు వారు అంగీకరించినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 33 బ్యాంకులకు సంబంధించి 130 ఏటీఎం కార్డులు, రెండు భీమ్ యూపీఐ పైన్ ల్యాబ్స్ పీఓఎస్ స్వైప్ యంత్రాలు, నేరాలకు ఉపయోగించిన మూడు ఆటోరిక్షాలు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.27,230 నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మరో ఇద్దరు సహచరులు గతంలో హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో ఇదే తరహా నేరాలకు పాల్పడినట్లు సమాచారం లభించిందని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించి నిందితులను పట్టుకున్న అమీన్‌పూర్ పోలీసు అధికారులను సైబరాబాద్ పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో శేర్లింగంపల్లి ఏసిపి శ్రీనివాసరావు, అమీన్పూర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, ఎస్సై విజయ్ కుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**ప్రజలకు పోలీసుల సూచనలు**

ఏటీఎంలలో నగదు డ్రా చేసే సమయంలో అపరిచితుల సహాయం తీసుకోవద్దని, ఎవరికీ ఏటీఎం పిన్ నంబర్ చెప్పవద్దని, కార్డును ఇతరుల చేతికి ఇవ్వవద్దని పోలీసులు సూచించారు. ఏటీఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్--100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



# వరద కాలువల ప్రవాహ ఆటంకాలను తొలగించండి

## హైడ్రా ప్రజావానికి 52 ఫిర్యాదులు

**హైదరాబాద్, ఆగస్టు 03:** సహజ వరద కాలువలను రూటు మార్చడం, ఆక్రమణలకు పాల్పడడం, పైపులు వేసి వాటిపై రహదారులు నిర్మించడం వంటి పనులతో వరద ప్రవాహానికి ఆటంకాలు సృష్టిస్తున్నారని హైడ్రా ప్రజావాణిలో పలు కాలనీ వాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కాలువలను కబ్జా చేయడంతో వరద ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. వర్షం నీరు రహదారులపై నిలవకుండా కాలువలోకి చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అమీన్‌పూర్ పెద్ద చెరువులో 50 సర్వే నంబర్లలోని 20 వరకూ లే ఔట్లు మునిగిపోయాయని, ఇందులోని ప్లాట్ల యజమానులకు టీడీఆర్ ద్వారా తగిన నష్టపరిహారం వచ్చేలా చూడాలని హైడ్రా ప్రజావాణిలో పలువురు ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు. అలాగే తమ నివాసాలకు దారిలేకుండా ఆటంకాలు సృష్టిస్తున్నారని, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, యిలా సోమవారం హైడ్రా ప్రజావానికి మొత్తం 52 ఫిర్యాదులు అందాయి.

# ఇందిరా పార్క్ చౌరస్తాలో నిరుద్యోగుల మెరుపు ధర్నా

## పోలీస్ ఉద్యోగాల వయోపరిమితి పెంపునకు డిమాండ్

**ముషీరాబాద్, ఆగస్టు 03 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరుద్యోగులు మెరుపు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను వెల్లడించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకుడు కొడంగల్ రవి మాట్లాడుతూ, పోలీస్ నియామక నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, దరఖాస్తు రుసుమును తగ్గించడంతో పాటు ప్రస్తుతం ప్రకటించిన 7,437 పోస్టులతో సరిపెట్టకుండా సుమారు 19 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీకి మరో నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు మధుసూదన్, శ్రీకాంత్ రాథోడ్, విరేశ్, కరుణాకర్, ప్రతాప్, శివ, విక్రమ్‌తో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.




# 6న గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయండి

## పోస్టర్ ఆవిష్కరించిన గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ

**సిద్దిపేట, ఆగస్టు 3 (జనంసాక్షి)**



ఈనెల 6 న సిద్దిపేటలో, హైదరాబాద్ లో జరిగే ప్రజాయుద్ధ నౌక గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ పిలుపునిచ్చింది. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో వర్ధంతి సభ పోస్టర్ ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమం లో కమిటీ చైర్మన్ పోచబోయిన శ్రీహరి, కో చైర్మన్ ఆస లక్ష్మణ్,ఫూఖీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జి. తిరుపతి రెడ్డి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. రంగాచారి, ప్రజాగాయకులు భీమసేన, చికోటి నర్సింలు, అవని పత్రిక సంపాదకులు కూతురు రాజిరెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మంజీరా రచయితల సంఘం ప్రధానకార్యదర్శి సిద్దెంకి యాదగిరి, తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు పొన్నాల బాలయ్య,దీజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కంకిటి నవీన్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దాస అంజయ్య, దీ=నా నాయకులు గుండు శ్రీనివాస్, తెలిజీరు శ్రీనివాస్ యాదవ్, గడీల రమేష్ రెడ్డి, చిటుకుల మైసా రెడ్డి తదితరులు కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ పోచబోయిన శ్రీహరి యాదవ్, కో చైర్మన్ ఆస లక్ష్మణ్ లు మాట్లాడుతూ తన 60 ఏండ్ల జీవితాన్ని ప్రజలకు, ప్రజా యుద్దానికి, పీడిత ప్రజల విముక్తి కోసం అంకితం చేసి, ప్రజలకు తన పాటను అంకితం చేసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ భౌతికంగా దూరమై మూడేళ్లు గడుస్తున్నాయని చెప్పారు.. ఆయన భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు, ఆయన బోధించిన ఆకాంక్షలు, ఆయన పాట ఇంకా ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయని అన్నారు.

ప్రజాయుద్ధ నౌక గద్దర్ కు మరణం లేదని తెలిపారు. ఆయన చూపించిన మార్గంలో అసమ సమాజాన్ని అంతం చేసే వరకు ప్రజల పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించడం కోసం గద్దర్ కుమారుడు సూర్యం ఆధ్వర్యంలో గద్దర్ ఫౌండే షన్ ఏర్పడిందని తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6 న హైదరాబాద్ రవీంద్రభారతి లో సాయంత్రం 4 గంటలకు వర్ధంతి సభ జరుగుతుందని తెలిపారు.. అదేరోజు ఉదయం 8 గంటలకు సిద్దిపేటలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు ప్రతి పాదించిన స్థలం లో సిద్దిపేట గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ రెండు వర్ధంతి కార్యక్రమాల్లో గద్దర్ అభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు,గాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తంగేళ్లపల్లి విద్యార్థులు

**జడ్చర్ల, ఆగస్టు 3 (జనంసాక్షి):** జడ్చర్ల మండలంలోని తంగేళ్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థినీలు జూలైలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన పోటీలలో జిల్లా స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ బాలరాజు సోమవారం తెలిపారు. జడ్చర్ల ప్రేరణ బ్రిలియంట్ హైస్కూల్ కు చెందిన మూడవ తరగతి విద్యార్థినిలు సాక్షి అండర్-8 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో, దీపిక అండర్-10 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో, నాలుగో తరగతి విద్యార్థిని సహస్ర అండర్-8 విభాగంలో లాంగ్ జంప్ పోటీలో సత్తా చాటారు. ఎంపికైన ఈ విద్యార్థినులు ఆగస్టు 7, 8 తేదీలలో వరంగల్‌లో నిర్వహించనున్న తొలి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విద్యార్థినులను అభినందించి మాట్లాడుతూ విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహేష్, చంద్రకుమార్, నారాయణ, ఉషన్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లవాగు ప్రాజెక్టు నీటిని వెంటనే విడుదల చేయాలి

## మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి డిమాండ్

### సాగునీరు, యూరియా, 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మీడియా సమావేశంలో విమర్శ



**నారాయణఖేడ్, ఆగస్టు 03: (జనం సాక్షి) :** సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టులో నీటిమట్టం 89 లెవెల్‌కు చేరుకున్నప్పటికీ సాగునీటిని విడుదల చేయకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్ల వాగు ప్రాజెక్టు కింద ఉన్న వేలాది ఎకరాల రైతులు నీటి కోసం ఎదురుచూస్తుండగా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సాగునీటిని విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యాప్‌ల ద్వారా కాకుండా గ్రామాల సమీపంలోని సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల్లో తగినంత యూరియా అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, మోటార్లు సరిగా పనిచేయక పంటలు నష్టపోతున్నాయని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయడంతో పాటు ఎరువుల కొరతను నివారించాలని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

## ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల నిధులు విడుదల చేయాలి

### వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్త

**ముషీరాబాద్, ఆగస్టు 3 (జనంసాక్షి):**

వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, ఆర్యవైశ్య కార్పొరేషన్ కు రూ.500 కోట్ల నిధులు కేటాయించి 15 మంది డైరెక్టర్లను నియమించాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కాచం సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్దగల ధర్నా చౌక్ లో వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో సాధన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ స్పీకర్ మధుసూదనాచారి హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ రాష్ట్రంలో వైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వైశ్య సమాజానికి సంబంధించిన పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఫ్యూచర్ సిటీలో వైశ్యులకు 1,000 ఎకరాలు కేటాయించడం, ఈడబ్ల్యూఎస్ (జుబొ)లో వర్గీకరణ తీసుకురావడం, స్కిల్ యూనివర్సిటీలో 25 శాతం సీట్లు కేటాయించడం, వైశ్య బంధు పథకాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఇండస్ట్రియల్ కారిడార్లలో వైశ్య పారిశ్రామికవేత్తలకు 25 శాతం కేటాయింపులు చేయాలని, రాబోయే జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన వైశ్యులకు రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు కుల గణన నివేదికలో అగ్రవర్ణాల వివరాలను కులాల వారీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్ నరేష్ ఖురానా, రమేష్, కొత్త రవి, కేవీ పద్మప్, సాము, వీరేందర్, రాజు సప్త, నిఖిల్, ప్రణీత్, రాంబాబు, వీరు, కారం వెంకట్, గిరి, శ్రీకాంత్, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించాలి

## అధికారులు తప్పిదంతో ఆగిన రైతు భరోసాను చెల్లించాలి

### జి.వెంకట్రాంరెడ్డి ధర్మరాజ్, గోపాల్ రెడ్డి, నిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు



**నారాయణపేట జిల్లా బ్యూరో ఆగస్టు 3(జనం సాక్షి):** మక్తల్-నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం కొరకై సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించాలని ఆర్డీవో కార్యా లయం ముందు సోమవా రం భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాకు హాజరైన రైతులను ఉద్దేశించి జీ వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఊట్కూరు పేరుపల్ల రిజర్వాయర్ల పరిధిలోని రైతులకు పరిహారం ఇవ్వడం ఆలస్యం అవుతుందన్నారు. నిధులు ఉన్నప్పటికిని గత నెల రోజులకు పైగా అధికారులు తరచూ వాయిదాలు చెబుతూ రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రధానంగా రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈ నిర్లక్ష్యం జరుగుతుందని ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని విడాలన్నారు. నిర్వాసితులకు భూము లపరిహారం సమస్య తో పాటు, కోల్పోయిన ఇతర ఆస్తులు బోరుబావులు మోటార్లు పైపులైన్లు భారీ వృక్షాలు,పామాయిల్ తోటల రైతులకు పరిహారం అందలేదని, అలాగే పరిహా రం పొందిన భూమి కంటే కాంట్రాక్టర్లు అదనంగా భూముల్ని వాడుకొని పంట లకు నష్టం కలిగిస్తున్నారని మట్టి కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారుల నిర్లక్ష్యం కారణంగా భూమి కోల్పోయిన మొత్తం సర్వే నంబర్ను హోల్డ్ లో పెట్టి రైతు భరోసా రాకుండా నష్టం కలిగించిన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మెమొరండం స్వీకరిస్తూ వారం రోజుల్లో పూర్తిగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి బి బలరాం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, దామరగిద్ద మండలం మాజీ ఉపాధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సంఘం నాయకులు నర్సప్ప, కృష్ణయ్య, నరసింహులు,సాయి బన్న, నిడుగుర్తి,లక్ష్మీ పల్లి, బాపూర్, ఊట్కూరు, గడి ముస్కంపల్లి, రైతులు పాల్గొన్నారు.



# పిజెపి డ్యామ్ 27 గేట్లు ఎత్తివేత

## 1.78 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల

**ధరూరు, ఆగస్టు 3(జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు (పిజెపి) కు వరద నీరు భారీగా చేరుతోంది. ఎగువ నుండి వస్తున్న వరద కారణంగా అధికారులు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు 27 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.

ప్రాజెక్టు వద్ద ప్రస్తుత జలమట్టం 317.66 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు మొత్తం సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.245 టీఎంసీల నీరు నిల్వ ఉంది. స్థూల నిల్వ 7.952 టీఎంసీలు గా ఉంది. డ్యామ్‌లోకి 1,78,000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. అందులో 1,57,420 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అందులో స్పిల్‌వే ద్వారా 1,18,557 క్యూసెక్కులు, పవర్ హౌస్ ద్వారా 33,860 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుండి వరద కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు డ్యామ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కృష్ణా నది దిగువన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నది పొంగి పొర్లే అవకాశం ఉండడంతో ఎవరూ నదిలోకి దిగవద్దని కోరారు.

# మణుగూరు డీప్ సైడ్ బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయింపు

**కార్మికుల పోరాట విజయమే : బి.జనక్ ప్రసాద్**



**యైటింక్లైన్ కాలనీ, ఆగస్టు 3, (జనంసాక్షి) :** మణుగూరు డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి కాలరీస్ కంపెనీకి కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సింగరేణి కార్మికుల ఐక్య పోరాటానికి దక్కిన విజయమని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ, ఆగస్టు 1న సింగరేణి వ్యాప్తంగా వందలాది మంది కార్మికులతో చేపట్టిన ఆందోళనలు, నిరసనలు, వినతిపత్రాల సమర్పణ వంటి ఉద్యమాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఈ విజయాన్ని సింగరేణి కార్మికులందరికీ అంకితం చేస్తున్నామని, సంస్థ పరిరక్షణతో పాటు అభివృద్ధి కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, ధర్మపురి, ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణ రెడ్డి, నాయకులు అక్రమ్, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ బైపాస్ బ్రిడ్జి కింద ప్రమాదకరంగా ఎంట్రీ రోడ్డు



**కరీంనగర్ టౌన్, ఆగస్టు 3 (జనంసాక్షి) :** కరీంనగర్ బైపాస్‌లోని పెద్దపల్లి వెళ్లే మార్గంలో బ్రిడ్జి కింద నుంచి కరీంనగర్ నగరంలోకి ప్రవేశించే సర్వీస్ రోడ్డు అధ్వాన్నంగా మారింది. రహదారిపై భారీ గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతల కారణంగా భారీ వాహనాలు సైతం నెమ్మదిగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడగా, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతలను ముందుగానే గుర్తించలేక ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. నగరంలోకి ప్రవేశించే ప్రధాన మార్గం కావడంతో ప్రతిరోజూ వందలాది వాహనాలు ఈ రోడ్డును వినియోగిస్తున్నాయి. అయినప్పటికీ రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రాత్రి వేళల్లో రిఫ్లెక్టర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి శాశ్వత మరమ్మతులు చేపట్టడంతో పాటు రిఫ్లెక్టివ్ సైన్‌బోర్డులు, ప్రమాద హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేసి వాహనదారుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# భయం గుప్పిట్లో బడి పిల్లలు

**శిథిల భవనం... పెచ్చులూడే కప్పులు**

**మునిపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల దుస్థితి • నూతన భవనం నిర్మించాలంటున్న తల్లిదండ్రులు, స్థానికులు**

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 03 (జనంసాక్షి) :**


60 సంవత్సరాల చరిత్ర కలిగిన మునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అది. ఇక్కడ చదివిన అనేక మంది విద్యార్థులు నేడు ఇంజనీర్లు, ఉపాధ్యాయులుగా ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అంతటి ప్రాధాన్యం కలిగిన మునిపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రస్తుతం అధ్వాన స్థితికి చేరింది. ఒకప్పుడు ఇక్కడ చదివేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపేవారు. పాఠశాలలో స్థానం కోసం విద్యార్థులు ఆరాటపడేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. పాఠశాల భవనం, గదులు శిథిలావస్థకు చేరడం వల్ల విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు.





**శిథిలావస్థకు పాఠశాల భవనం**

పాఠశాల తరగతి గదిలో ప్రశాంతంగా విద్యనభ్యసించాల్సిన విద్యార్థులు భయం గుప్పిట పాఠాలు వింటున్నారు ఉరుస్తున్న పైకప్పు, శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్న పాఠశాల గదులు వెరసి ఎప్పుడు ఏం జరుగుతోందనని విద్యా ర్థులు భయాందోళనకు గురవుతున్నారు విద్యాభివృద్ధికి కృషి చేస్తామని సమావేశాల్లో చెప్పే ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఇలాంటి పాఠశాలలు కనిపించడం లేదు. పాఠశాలల నివేదికలపై సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాల్సిన ఉన్నతాధికారులు ఆదిశగా చర్యలు చేపట్టలేదు దీనికి నిదర్శనమే సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన మునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. పాఠశాలలో దాదాపు 6 నుంచి 10 వ తరగతి వరకు దాదాపు 150 మంది విద్యను అభ్యసిస్తున్నారు. తరగతి గదుల పైకప్పు పెచ్చులు కింద పడుతుండడంతో విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




**నూతన భవనం మంజూరు చేయండి**

మునిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు. గత 60 సంవత్సరాల క్రితం నిర్మించిన పాఠశాల భవనం పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయని, స్వల్ప మరమ్మతులు చేసిన వర్షాకాలంలో ఇబ్బందులు ఏర్పడతాయని వారు చెప్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాల నూతన భవన నిర్మాణ విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు. శుక్రవారం ఎంపీడీవో, ఎంఈఓ లు మునిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల భవనాన్ని పరిశీలించి పాఠశాలలోని సమస్యను తెలుసుకున్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో భారీ అవకతవకలు

**డిప్యూటీ తహసిల్దార్‌కు ఫిర్యాదు**



**శంకర్ పల్లి, ఆగస్టు 03 (జనంసాక్షి) :** శంకర్పల్లిలో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల స్థానిక కోటా కేటాయింపులో భారీ అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి,మాజీ ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి, మాలచిన్న నరసింహులు సోమవారం శంకర్పల్లి తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన 1500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో 10 శాతం అంటే 153 ఇళ్లను స్థానికులకు కేటాయించారు.కానీ ఆ లబ్ధిదారుల ఎంపికలో భారీ అవకతవకలు జరిగాయి అని అన్నారు. అర్హులను పక్కన పెట్టి అనర్హులకు, అన్నదమ్ములకు ఇళ్లు కేటాయించారు ఇళ్ల కేటాయింపులో ఏ ప్రాతిపదిక తీసుకున్నారో స్పష్టత లేదు నిబంధనల ఉల్లం కేటాయింపు ప్రక్రియలో నిబంధనలు పాటించలేదు కేటాయింపుపై పూర్తిస్థాయి విచారణ జరపాలని,అనర్హులకు కేటాయించిన ఇళ్లను రద్దు చేసి అర్హులైన లబ్ధిదారులకు తిరిగి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు కార్యక్రమంలో శంకర్పల్లి మాజీ సర్పంచ్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్, మాజీ కౌన్సిలర్ శ్రీనాథ్ గౌడ్, నాయకులు వాసుదేవ్ కన్నా,ఉపేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డయల్-100 కాల్‌తో పరుగెత్తి.. ప్రాణం కాపాడిన హెడ్‌కానిస్టేబుల్



**చండూరు (జనంసాక్షి) :** డయల్–100కు వచ్చిన సమాచారంపై వెంటనే స్పందించిన చండూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఆదిమూలం శ్రీనివాస్ సమయస్ఫూర్తితో వ్యవహరించి ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడారు. ఉడతలపల్లి గ్రామంలో భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతోందన్న సమాచారంతో విధుల్లో ఉన్న శ్రీనివాస్ కేవలం ఐదు నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో ఓ వ్యక్తి ఉరివేసుకుని ప్రాణాపాయ స్థితిలో ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే ఇంటి ప్రధాన ద్వారం పగులగొట్టి లోపలికి ప్రవేశించి ఉరిని తొలగించారు. అనంతరం బాధితుడికి తక్షణ ప్రాథమిక చికిత్స అందించి ఆసుపత్రికి తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ అప్రమత్తత, ధైర్యసాహసం, సమయస్ఫూర్తిని స్థానికులు, పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

# కరాటేలో బంగారు, కాంస్య పథకాలు సాధించిన తుంగతుర్తి విద్యార్థులు



**తుంగతుర్తి ఆగస్టు 3 (జనంసాక్షి) :** హైదరాబాదులో జరిగిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్షిప్ కరాటే పోటీల్లో తుంగతుర్తి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారని తుంగతుర్తి సుమన్ చోటు ఖాన్ కరాటే అకాడమీ శిక్షకురాలు బొంకూరి అరుణ తెలిపారు, సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుమన్ చోటు కరాటే అకాడమీ నుండి అండర్ 14 విభాగంలో తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన బయ్య హర్షిత గోల్డ్ మెడల్ మెంతబోయిన లాస్య కాంస్య పథకం సాధించి కరాటే లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారని తెలిపారు, దీంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పథకాలు సాధించడం పట్ల అభినందించారు

# మిషన్ భగీరథ ఏఈ అనూష హఠాన్మరణం



**రంగారెడ్డి ఆగస్టు 3(జనంసాక్షి) :** మంచాల మండల మిషన్ భగీరథ ఎఇ అనూష (33) హఠాన్మరణం చెందారు. వనస్థలిపురంలోని వారి ఇంట్లో తీవ్రమైన గుండెపోటుతో కుప్పకూలిన అనూషను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. రెండు రోజుల పాటు నగరంలోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమె సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మిషన్ భగీరథ ప్రాజెక్టులో ఇబ్రహీంపట్నం సహాయక ఇంజనీర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమె అబ్దుల్లాపూర్ మెట్ అదనపు బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. అనూషకు భర్త , ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. చిన్న వయసులోనే మంచి అధికారినిగా గుర్తింపు పొందిన అనూష ఆకస్మిక మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ కార్యక్రమం ప్రారంభం నుండి ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఆమె చాలా కష్టపడి పనిచేశారని గుర్తు చేశారు. ఎఇ అనూష ఆకస్మిక మరణంతో ఇబ్రహీంపట్నంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



# మూడున్నర గంటల్లోనే అగ్గిపెట్టెలో ఇమిడే చీర

**అద్భుతం సృష్టించిన యెల్ది హరిప్రసాద్**



**సిరిసిల్ల టౌన్ 3 (జనం సాక్షి)** సిరిసిల్ల చేనేతకు పుట్టినిల్లు, సిరిసిల్ల నేత కార్మికులు చేనేత కళా రంగంలో అత్యంత ప్రతిభనైపుణ్యాన్ని చాటుకుంటున్నారు, సిరిసిల్లకు చెందిన నేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్ అగ్గిపెట్టెలో ఇమిడే చీరను, దబ్బనంలో దూరే చీర వరకు గతంలో తయారుచేసి అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించారు. మన్ కి బాత్ లో ప్రధాని మోడీ సిరిసిల్ల చేనేత కళాకారుల గురించి, హరిప్రసాద్ గురించి ప్రస్తావించారు. అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు.60 గంటల ఇంగ్లీష్ నాన్ స్టాప్ టీచింగ్ ఉత్తమ ఉపాధ్యాయులైన ఆడెపు వీరయ్యను స్ఫూర్తిగా తీసుకుని జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని యెల్దిహరిప్రసాద్ మరమగ్గానికి ధీటుగా చేనేత మగ్గంపై170 నిమిషాల్లో దాదాపు మూడు గంటల్లో ఐదు పాయింట్ ఐదు మీటర్ల పొడవు, 45 అంగుళాల వెడల్పు గల పూర్తి చేనేత చీరను ప్రత్యక్షంగా నేసి, అదే చీరను ప్రత్యేకమైన నైపుణ్యంతో మడిచి, 12 సెంటీమీటర్ల పొడవు 6.5 సెంటీమీటర్ల వెడల్పు, రెండు పాయింట్ ఐదు సెంటీమీటర్ల ఎత్తు గల అగ్గిపెట్టెలో ఇమిడే విధంగా ప్రదర్శించారు.. మూడు గంటల్లోనే అగ్గిపెట్టెలో ఇమిడే చీరను తయారు చేయాలన్న సంకల్పంతో సిరిసిల్లకు చెందిన యెల్ది హరిప్రసాద్ నేత కార్మికులకు మనోధైర్యాన్ని కల్పిస్తూ తయారుచేసిన విధానం ప్రతి ఒక్కరిని అబ్బుర పరిచింది. కష్టపడితే సాధ్యం కానిది అంటూ ఏదిలేదని నిరూపించారు.

# తాత్కాలికంగా తల్మడ్ల రైల్వే అండర్ బ్రిడ్జి మూసివేతకు అనుమతి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా తల్మడ్ల యార్డు వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి (RUB) నెం. 569ానను తాత్కాలికంగా మూసివేయడానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అనుమతి మంజూరు చేశారు. ఈ మేరకు జూలై 31, 2026న ఉత్తర్వులు జారీ చేశారు. ముద్‌ఖేడ్– మేడ్చల్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా అండర్ బ్రిడ్జి విస్తరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో, రెండు నెలల పాటు RUB నెం. 569ానను మూసివేసి, వాహనాలను RUB నెం. 570A ద్వారా మళ్లించాలని నిర్ణయించారు. ఈ ప్రతిపాదనపై పోలీసు శాఖ, ఆర్ అండ్ బీ, రెవెన్యూ, జిల్లా పంచాయతీ అధికారుల నుంచి నివేదికలు తీసుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ట్రాఫిక్ సజావుగా సాగుతుందని, శాంతిభద్రతల సమస్యలు తలెత్తవని పోలీసు శాఖ నివేదించింది. అలాగే ఆర్ అండ్ బీ, రెవెన్యూ శాఖలు కూడా ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపాయి. అయితే, గ్రామస్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ అండర్‌పాస్ మార్గంలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సూచించారు. రైల్వే అధికారులు మూసివేత సమయంలో బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం, హెచ్చరిక బోర్డులు, డైవర్షన్ సూచికలు ఏర్పాటు చేయడం, ప్రత్యామ్నాయ మార్గంలో ట్రాఫిక్‌ను సక్రమంగా నిర్వహించడం వంటి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# మంథనిలో బొక్కలవాగు చెక్‌డ్యాం ఆధునికరణకు శ్రీకారం

**రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులతో కట్ట సుందరీకరణ, వాక్‌వే, చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు**
**నిధులు కేటాయించిన కోకకోలా కంపెనీకి అభినందనలు : మంత్రి శ్రీధర్ బాబు**




**మంథని, ఆగస్టు 03,( జనంసాక్షి ) :** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని బొక్కలవాగు చెక్‌డ్యాం ఆధునికరణతో పాటు కట్ట సుందరీకరణ పనులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం శ్రీకారం చుట్టారు. కోకాకోలా కంపెనీ సీఎస్ఆర్ నిధుల కింద రూ. 2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, కోకాకోలా సంస్థ ప్రతినిధులతో కలిసి మంత్రి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మంథని అభివృద్ధికి సహకరించాలని కోకాకోలా కంపెనీ ప్రతినిధులను కోరగా, వారు సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ పనులను చేపట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతంలో నీటి సంరక్షణ మెరుగుపడడంతో పాటు, స్థానిక ప్రజలకు చుట్టుపక్కల వాతావరణం కూడా మెరుగుపడుతుందని అన్నారు. హిందుస్తాన్ కోకా–కోలా బేవరేజెస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు కంపెనీకి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి పనిచేస్తే సమాజానికి మరింత మేలు చేయవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను తెలంగాణ వ్యాప్తంగా మరిన్ని పరిశ్రమలు ముందుకు వచ్చి చేపట్టాలని ఆకాంక్షించారు. బొక్కలవాగులో గత కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని, దీంతో చెక్‌డ్యాం నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు వర్షాకాలంలో నీటి సంరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. చెక్‌డ్యాం కట్టను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. ఇందులో భాగంగా ప్రజలు నడక కోసం ప్రత్యేక వాక్‌వే, చిన్నారుల కోసం చిల్డ్రన్ పార్క్, పచ్చదనం పెంపు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం, ప్రజలకు మెరుగైన వినోద, విశ్రాంతి వసతులు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇతర పట్టణాల తరహాలోనే మంథనిని అన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

# పొలాల్లో చెమట.. సరిహద్దుల్లో రక్తం

**దేశం కోసం బిడ్డలు.. ధైర్యం కోసం గ్రామం**

**సరిహద్దుల్లో బిడ్డలు.. పొలాల్లో తల్లిదండ్రులు**

**కూచురు కుటుంబాల త్యాగగాథ.. దేశసేవకు ఆదర్శ గ్రామం**




*పచ్చని పంట పొలాల మధ్య ప్రశాంతంగా కనిపించే ఆ గ్రామమే కూచురు. కానీ, ఆ ఊరి గుండెల్లో దేశభక్తి ఉప్పొంగుతోంది. వ్యవసాయమే జీవనాధారమైన ఈ పల్లెలో, ప్రతి ఇంటా ఒక దేశ సైనికుడు ఉన్నాడు.కన్న తల్లిదండ్రులను, ఉన్న ఊరిని వీడి, దేశ రక్షణే ధ్యేయంగా సరిహద్దుల్లో కాపలా కాస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తి పొందుతూ, ఆ గ్రామ యువత అంతా భారత సైన్యంలో చేరుతున్నారు.తల్లిదండ్రులు పొలాల్లో చెమటోడ్చి దేశానికి అన్నం పెడుతుంటే, వారి బిడ్డలు సరిహద్దుల్లో రక్తం చిందించి దేశాన్ని కాపాడుతున్నారు.*

**నవాబుపేట్, ఆగస్టు 03 (జనంసాక్షి) :**

'జై జవాన్.. జై కిసాన్' అనే నినాదాన్ని ఈ కూచురు గ్రామం అక్షరాలా నిజం చేసి చూపిస్తోంది.కూచురు గ్రామంలోని ప్రతి సైనికుని వెనుక కన్నవారి కఠోర శ్రమ దాగి ఉంది. ఇక్కడి తల్లిదండ్రులు రెక్కాడితే గాని డొక్కాడని సామాన్య వ్యవసాయదారులు. పొలాల్లో ఎండనక, వాననక చెమటోడ్చి, కష్టాలు ఎదుర్కొంటూనే తమ బిడ్డలను దేశాన్ని రక్షించే జవాన్లుగా తీర్చిదిద్దారు.తమ పేదరికం బిడ్డల భవిష్యత్తుకు అడ్డుకాకూడదని, అప్పులు చేసైనా వారిని సైన్యానికి సిద్ధం చేశారు. బిడ్డలు సరిహద్దుల్లో శత్రువులతో పోరాడుతుంటే, ఇక్కడ తల్లిదండ్రులు పొలాల్లో ప్రకృతితో పోరాడుతూ దేశానికి అన్నం పెడుతున్నారు. కన్నబిడ్డలు కళ్లముందు లేకపోయినా, వారు దేశ రక్షణలో ఉన్నారనే గర్వంతో ఈ తల్లిదండ్రులు తమ కష్టాలను మర్చిపోతున్నారు. గ్రామ సర్పంచ్ (బైరు రవీందర్




సుమతి), ఉప సర్పంచ్ (బైండ్ల రాములు) పాటు గ్రామ ప్రజలందరూ ఈ సైనికుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. దేశ సేవలో ఉన్న బిడ్డల తల్లిదండ్రులను ఊరి పెద్దలు ఎల్లప్పుడూ గౌరవిస్తూ, వారికి ఏ కష్టం వచ్చినా తామున్నామంటూ భరోసా ఇస్తున్నారు.

**దేశ రక్షణలో నిలిచిన బిడ్డలు..**

అండగా నిలిచిన గ్రామం ఊరి పొలిమేరల్లోకి అడుగుపెట్టగానే దేశభక్తి సువాసనలు గుబాళిస్తాయి. సరిహద్దుల్లో తుపాకీ పట్టి దేశాన్ని కాపాడే సైనికులు ఒకరైతే, ఆ సైనికుల కుటుంబాలకు కొండంత అండగా నిలిచే గ్రామస్థులు ఇంకొకరు. స్వార్థం పెరిగిపోతున్న నేటి రోజుల్లో, ఆ గ్రామం మాత్రం దేశసేవలో ఉన్న తమ బిడ్డల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ సరికొత్త ఆదర్శాన్ని చాటుతోంది.గ్రామ సర్పంచ్ బైరు రవీందర్ సుమతి, ఉప సర్పంచ్ బైండ్ల రాములు నేతృత్వంలో ఊరి పెద్దలంతా కలిసి సైనికుల ఇళ్లకు పెద్ద దిక్కుగా మారారు. "మీ బిడ్డలు దేశ సరిహద్దుల్లో ఉండి మనల్ని కాపాడుతున్నారు... వారి కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనది" అనే సంకల్పంతో వారు ముందుకు సాగుతున్నారు.ఆ సైనికుల తల్లిదండ్రులకు ఏ చిన్న కష్టం వచ్చినా, అనారోగ్యం పాలైనా గ్రామ పెద్దలు, ప్రజలందరూ క్షణాల్లో అక్కడ వాలిపోతారు. "మీరు ఒంటరి వాళ్లు కాదు... మీ బిడ్డ దేశానికి కొడుకైతే, మేమంతా మీకు బిడ్డలమే" అంటూ ఇచ్చే భరోసా ఆ వృద్ధ తల్లిదండ్రుల గుండెల్లో కొండంత ధైర్యాన్ని నింపుతోంది. దేశ సేవలో ఉన్న బిడ్డల తల్లిదండ్రులను ఊరి పెద్దలు ఎల్లప్పుడూ ప్రత్యేకంగా గౌరవిస్తూ ఉంటారు.సైనికులు సరిహద్దుల నుండి ఫోన్ చేసినప్పుడు... "ఇంట్లో అందరూ బాగున్నారు, ఊరంతా మనకు తోడుగా ఉంది" అని తల్లిదండ్రులు చెప్పే మాటలు, ఆ జవాన్లకు మరింత ఉత్సాహాన్ని, దేశం కోసం పోరాడే శక్తినీ ఇస్తున్నాయి. ఊరి ప్రజలందరి ఐక్యత, సర్పంచ్, ఉప సర్పంచ్‌ల చొరవతో ఆ గ్రామం దేశభక్తికి ఒక నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.



ఇటీవల అందుబాటులోకి వచ్చిన ఆ గ్రామ సైనికుడు రాఘవేందర్ 'జనంసాక్షి' ప్రతినిధి మాట్లాడినప్పుడు ఆయన భావోద్వేగానికి గురయ్యారు. 'మేము సరిహద్దుల్లో ఎటువంటి ఆందోళన లేకుండా దేశాన్ని కాపాడుతున్నామంటే దానికి మా ఊరి ప్రజలు, పెద్దలు ఇస్తున్న ధైర్యమే కారణం. మా అమ్మానాన్నలకు ఏ కష్టం వచ్చినా ఊరంతా అండగా ఉంటుందనే నమ్మకం మాకు ఉంది' అని రాఘవేందర్ గర్వంగా పంచుకున్నారు.

# గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్

- 25 మంది విద్యార్థినులకు అస్వస్థత
- ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స
- వైద్య సేవలను పరిశీలించిన అధికారులు
- వర్ధన్నపేటలో కలకలం రేపిన సంఘటన



**వర్ధన్నపేట, ఆగస్టు 3 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు ఆందోళన కలిగిస్తున్న వేళ, వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో మరో ఘటన చోటుచేసుకుంది. వర్ధన్నపేట గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో కలుషిత ఆహారం తీసుకున్నట్లు భావిస్తున్న 25 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, కడుపునొప్పి, వికారం వంటి లక్షణాలు కనిపించడంతో పాఠశాల సిబ్బంది అప్రమత్తమై వెంటనే వారిని వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు విద్యార్థినులకు తక్షణ చికిత్స అందించగా, ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ విజయసాగర్, జిల్లా పరిషత్ సీఈవో రామ్‌రెడ్డి, డీటీడీఓ నారాయణరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరిన్ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థినులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అధికారులు ఒక్కో విద్యార్థినిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి, అస్వస్థతకు దారితీసిన పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఘటనకు గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టి, ఆహార నమూనాలను పరీక్షలకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై మరింత కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని ప్రజలు కోరుతున్నారు.

# గురుకులానికి అధికార యంత్రాంగం

- కారంపొడే దిక్కు..! 'జనం సాక్షి' కథనానికి కలెక్టర్, డీఈఓల స్పందన
- కలెక్టర్, డీఈఓల ఆదేశాలతో కదిలిన జిల్లా యంత్రాంగం
- న్యాల్ కల్ కస్తూర్బా గురుకులాన్ని తనిఖీ చేసిన జీసిడీఓ, ఫుడ్ ఇన్స్ స్పెక్టర్
- సమస్యలను కలెక్టర్ కు నివేదికను పంపనున్నట్లు తెలిపిన జీసిడీఓ
- నాణ్యత, పోషక విలువలు లేని ఆహారాన్ని పరిశీలించిన ఫుడ్ ఇన్స్ స్పెక్టర్



**న్యాల్‌కల్, ఆగస్టు 02, (జనం సాక్షి) :** ఆగస్టు 1న 'కంపు కొడుతున్న న్యాల్ కల్ కస్తూర్బా గురుకులం"..! ఆగస్టు 02న, "కారంపొడే దిక్కు"..! "న్యాల్ కల్ కస్తూర్బా గురుకులంలో నిర్వాకం".. శీర్షికన ప్రచురించిన రెండు వేరు వేరు.."జనం సాక్షి" కథనాలకు జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, జిల్లా విద్యాధికారిణి రోహిణి, ఉమ్మడి జిల్లా జోనల్ ఫుడ్ ఇన్స్ స్పెక్టర్ అమృతలు


కారంపొడే దిక్కు!
న్యాల్‌కల్ కస్తూర్బా గురుకులంలో నిర్వాకం
PRADEEP
జిసిడిఓతో విచారణ చేపడతాం : జిల్లా విద్యాధికారిణి రోహిణి
జనంసాక్షి

స్పందించారు. ప్రచూరించిన12 గంటల్లోపే.. కలెక్టర్, డీఈఓ, ఫుడ్ ఇన్స్ స్పెక్టర్ ల ఆదేశాల మేరకు.. సోమవారం సంగారెడ్డి జిల్లా జీసిడీఓ సునీత ఖన్నా, సంగారెడ్డి జిల్లా ఫుడ్ ఇన్స్ స్పెక్టర్ రాజేశ్వర్, స్థానిక తహసిల్దార్ ప్రభువులు, ఎంపీడీఓ షాగుఫ్తా ఇర్ఫత్, ఎంఈఓ మారుతీ రాథోడ్, ఫుడ్ సేకరణ సహాయకులు మహేష్ లు పరిశీలించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు గురుకులంలో నెలకొన్న పలు సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. పలు సమస్యలను బాలికలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో అధ్వానంగా ఉన్న సెప్టిక్ ట్యాంక్, పలు తరగతి గదులు, వంట, సామాగ్రి, కూరగాయల గది, గురుకుల ఆవరణ, శౌచలయాలను పరిశీలించారు. నాణ్యత, పోషక విలువలు లేని కూరగాయలు, ఫలాలను బాలికలకు అందించడం ఏంటని స్థానిక నిర్వాహక సిబ్బందిపై అసహనం వ్యక్తం చేస్తూ జిసిడిఓ మండిపడ్డారు. అనంతరం అధికారుల బృందం బాలికలతో కలిసి ఆహారాన్ని స్వీకరించారు. నాణ్యత, పోషక విలువలతో కూడిన కూరగాయలను అందించాలని సదరు కాంట్రాక్టర్ కు ఆదేశిస్తూ మండిపడ్డారు.



### వెంటనే కలెక్టర్ కు నివేదిక : జిల్లా జీసిడీఓ సునీత ఖన్నా

కలెక్టర్, డీఈఓల ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు గురుకులంలో నెలకొన్న సమస్యలను నేరుగా పరిశీలించాం. ప్రధానంగా సెప్టిక్ ట్యాంక్ నుండి విడుదలవుతున్న మురుగు, దుర్వాసన.. నాణ్యతలేని కూరగాయలు, లోపించిన పారిశుద్ధ్యం, వారం రోజులుగా మెనూకు విరుద్ధంగా ఉదయం అల్పాహారానికి బదులుగా అన్నాన్ని అందించడం, టమాట కర్రీ లేకపోవడంతో కొందరు బాలికలు కారంపొడి, పెరుగుతో సరిపెట్టుకోవడం, సెప్టిక్ ట్యాంక్ పునర్నిర్మాణం, తదితర సమస్యల నివేదికను కలెక్టర్, జిల్లా విద్యాధికారిణిలకు నివేదికలను పంపనున్నాం. నాణ్యత, పోషక విలువలు లేని పలు రకాల కూరగాయలను సేకరించడం జరిగిందని, నాణ్యత ప్రమాణాలను గుర్తించిన అనంతరం.. కూరగాయల నాణ్యత వివరాలను జిల్లా అధికారులకు నివేదికను అందజేయున్నట్లు జిల్లా ఫుడ్ ఇన్స్ స్పెక్టర్ రాజేశ్వర్ "జనం సాక్షి"కి వివరణ ఇచ్చారు. స్థానిక గురుకులానికి చెందిన ఓ బాలిక (పదవ తరగతి) గురుకులంలో నెలకొన్న పలు సమస్యలపై ఏ మాత్రం భయాందోళనకు గురికాకుండా నేరుగా జీసిడీఓ, అధికారుల బృందానికి వివరించడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. అందుకు జిసిడిఓ స్పందిస్తూ.. నేరుగా నా సెల్ ఫోన్ (చరవాణి)కి ఫోన్ చేయాలని, చరవాణి నంబర్ ని బాలికలకు తెలిపారు. జిల్లా అధికారులు చేపట్టిన తనఖీ బృందంలో.. స్థానిక గ్రామ పంచాయతీ అధికారి శ్రీకాంత్ రెడ్డి, గ్రామస్తులు శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, ఉమేష్, శ్రీకాంత్, కిష్టన్న, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ఆధునిక సాంకేతిక

- వీ2వీ సాంకేతికతను అమలు చేసేందుకు కేంద్రం ముసాయిదా



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3 (జనంసాక్షి) :** దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాహనాల మధ్య నేరుగా సమాచార మార్పిడి జరిగే వీ2వీ సాంకేతికతను అమలు చేసేందుకు కేంద్ర రహదారి రవాణా శాఖ కొత్త ముసాయిదాను విడుదల చేసింది. ఈ సాంకేతికత ద్వారా వాహనాలు ఒకదానితో ఒకటి సమాచారం పంచుకుంటాయి. రోడ్డుపై ఎదురుగా ప్రమాదం, అకస్మాత్తుగా బ్రేక్ వేయడం, వాహనం వేగం తగ్గడం వంటి పరిస్థితులపై ముందుగానే హెచ్చరికలు అందుతాయి. దీంతో డ్రైవర్లు అప్రమత్తమై ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కొన్ని వాహనాల్లో ఉన్న అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ కెమెరాలు, సెన్సార్ల ఆధారంగా పనిచేస్తుంది. అయితే కొత్తగా తీసుకురానున్న సీ-వీ2ఎక్స్ సాంకేతికత వాహనాలు, రోడ్డు మౌలిక సదుపాయాలు, ఇతర వాహనాలతో నేరుగా కమ్యూనికేట్ చేసేలా రూపొందించనుంది. దీంతో డ్రైవర్‌కు కనిపించని ప్రమాదాలను కూడా ముందుగానే గుర్తించి హెచ్చరికలు అందించే అవకాశం ఉంటుంది. ఈ సాంకేతికత కోసం 5.875 ఉఊళి నుంచి 5.925 ఉఊళి వరకు ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌ను లైసెన్స్ రహితంగా కేటాయించాలని కేంద్రం ప్రతిపాదించింది. దీనివల్ల వాహనాల మధ్య వేగవంతమైన సమాచార మార్పిడి సాధ్యమవుతుంది. ఈ కొత్త వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం 2027 అక్టోబర్ నుంచి దశలవారీగా అమల్లోకి తీసుకురానుంది.

# అంతర్జాతీయ దొంగల ముఠా అరెస్ట్

- పలు రాష్ట్రాల్లో దోపిడి, దొంగతనాలు
- నిందితులు బంగ్లాదేశ్‌కు చెందినవారే
- సహకరించిన స్వదేశీయుడు తరుణ్ సింగ్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ (జనంసాక్షి) :** బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించి దేశంలోని పలు రాష్ట్రాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను ఆదిలాబాద్ పోలీసులు ఛేదించారు. నకిలీ ఆధార్ కార్డులతో తొమ్మిదేళ్లుగా ఏడు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న ఈ ముఠాకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌లోని దినాజ్‌పూర్ జిల్లాకు చెందిన మహమ్మద్ జానీ అలీ, మహమ్మద్ రొమాన్స్ అలీ అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించి నకిలీ ఆధార్ కార్డులు సృష్టించుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రధాన నిందితుడు మహమ్మద్ జానీ అలీ 12 మంది సభ్యులతో ముఠాను ఏర్పాటు చేసి రాజస్థాన్, ఒడిశా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. జూలై 11న బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి ప్రవేశించిన ఈ ముఠా సభ్యులు ముందుగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో మోటార్ సైకిళ్లు, కార్లు చోరీ చేసి, అనంతరం తెలంగాణలోని ఆదిలాబాద్‌కు చేరుకుని దొంగతనాలకు పాల్పడ్డారని వెల్లడించారు. ప్రధాన నిందితుడు మహమ్మద్ జానీ అలీ గతంలో మధ్యప్రదేశ్‌లో నమోదైన ఓ చోరీ కేసులో అరెస్టై జైలు శిక్ష కూడా అనుభవించినట్లు ఎస్పీ తెలిపారు. బంగ్లాదేశ్‌కు చెందిన మరో 12 మంది సభ్యులతో వీరికి సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

### కుక్కర్లు అమ్ముతూ రెక్కీ.. రాత్రిళ్లు చోరీలు

ఈ ముఠా సభ్యులు పగటి సమయంలో కుక్కర్లు, గ్రైండర్లు విక్రయిస్తున్నట్లు నటిస్తూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో ఇటీవల ఈ ముఠా చోరీకి పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రూ.8 లక్షల విలువైన 73.05 గ్రాముల బంగారం, 151.30 గ్రాముల వెండి, ఐఫోన్లు, ఐప్యాడ్‌తో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసులో మహమ్మద్ జానీ అలీ, మహమ్మద్ రొమాన్స్ అలీ, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన తరుణ్ సింగ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో తొమ్మిది మంది సభ్యుల కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన మావల సీఐ బీడీ ప్రేమ్‌కుమార్, సైబర్ క్రైమ్ ఎస్సై గోపీకృష్ణ, సిబ్బంది త్రిశూల్, శ్రీనివాస్ తదితరులను ఎస్పీ అభినందించారు. మీడియా సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సైబర్ క్రైమ్ ఎస్సై గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ నేతల దిగజారుడు విమర్శలు

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

**హైదరాబాద్, ఆగస్ట్3 (జనంసాక్షి) :** తెలంగాణ భవన్ ఉద్యమాల వేదిక ..పోరాటానికి ప్రతిరూపమైన వేదిక.. కుక్క కాటుకు చెప్ప దెబ్బ అనే కాంగ్రెస్ నేతల పిచ్చి ఆరోపణలకు కూడా సమాధానం చెప్పాల్సి వస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ పిచ్చోడికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని కేసీఆర్ అంటుంటారు. కాంగ్రెస్ నేతలు క్షుద్ర పూజలు అంటూ హరీశ్ రావు మీద వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. ఇది రాజ్యాంగం ప్రసాదించిన విలువలను కించపరచడమే.. కాంగ్రెస్ నేతలు అత్యంత నీచానికి పాల్పడు తున్నారు.. కనకపు సింహాసనం మీద శునకాన్ని కూర్చోబెట్టిన ట్టుగా రేవంత్ హయాంలో గాంధీ భవన్‌ను బూతుల అడ్డాగా మార్చారు. గాంధీ వచ్చి కూర్చున్న భవన్‌ను అపవిత్రంగా మార్చా రన్నారు. సెక్యులరిజం భావనను కాంగ్రెస్ నేతలు అపహాస్యం చేస్తున్నారు. హరీష్ రావు క్షుద్ర పూజలు చేశారు అని అసత్యపు ప్రచారం చేస్తున్నారన్నారు.



# సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు

- సమర్థంగా 1అమలుకు కలసి పనిచేయాల్సిందే
- అధికారులతో సమీక్షలో సిఎస్ స్పష్టీకరణ

**హైదరాబాద్, ఆగస్ట్ 3 (జనంసాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే పలు అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు మరింత పటిష్టంగా అమలయ్యేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయము అవసరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాల యంలో వివిధ శాఖల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యద ర్శులు, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, మహేష్ దత్ ఎక్క, సవ్య సాచి ఘోష్, వాణి ప్రసాద్, దాన కిషోర్, నవీన్ మిట్టల్,ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, క్రిస్టినా చొంగ్తూ, రఘునందన్ రావ్, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, హరిచందన, బాల మాయా దేవి, సురేంద్ర మోహన్, ఇలంబర్తి తదితరులు హాజరయ్యారు. సందర్భంగా సి.ఎస్ మాట్లాడు తూ రాష్ట్ర ముఖ్యమంత్రి గారి దార్శనికతతో రాష్ట్రంలో పురోగతిలో ఉన్నఅనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవం తంగా అమలయ్యేందుకు వివిధ శాఖల మధ్య అంతర్గత సమన్వయము అవసరమని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల పురోగతి, లక్ష్యాలు, అమలు తదితర వివరాలను సవివరంగా తెలిపే డాష్ బోర్డు ను ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా ఈ పథకాలు, కార్యక్రమాలు లక్ష్యాల మేరకు అమలవడానికి స్పీడ్ సెల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. మరో వారం రోజుల్లో ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ పథకాలు, కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల పనితీరు, లక్ష్యాలు, పురోగతి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కేంద్రప్రాయోజిత పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యదర్శులతో త్వరలో సమీక్షా సమావేశం నిర్వహించ నున్నారని, ఇందుకు సన్నద్ధం కావాలని కార్యదర్శులకు సూచించారు. ప్రతీ శాఖలో అమలవుతున్న వినూత్న పథకాలు/ విజయ గాథాలపై నివేదిక రూపొందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని ప్రభుత్వ కార్యాల యాలు, గ్రామ పంచాయ తీలతో సహా అన్నింటికీ టి- ఫైబర్ కనెక్టివిటీ ని తీసుకో వాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన విజన్ డాక్యుమెంట్-2047 లో సూచించిన నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వా నికి సమర్పించాల్సిన యుటిలైజేషన్ సర్టిఫికె ట్లు, నివేదికలు, ప్రతిపాదనలను సకాలంలో కేంద్ర ప్రభుత్వానికి సమర్పిం చాలని, తద్వారా కేంద్ర నిధులు విడుదల కావడానికి మార్గం సుగమం అవుతుంద న్నారు. నవంబర్ 14వ తేదీ నుండి రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే ఖేలో- ఇండియా క్రీడోత్సవాలను విజయ వంతంగా నిర్వహించేందుకు వివిధ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. దాదాపు 7 వేలకు పైగా క్రీడా కారులు, అధికా రులు, కోచ్ లు హాజరయ్యే ఈ ఖేలో ఇండియా స్పోర్ట్స్ కు 26 క్రీడా రంగాల్లో పోటీలను 11 వేదికలలో నిర్వహిస్తామని వెల్లడించారు.

# సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

- సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో పక్రియ పూర్తిచేయాలని లక్ష్యం
- 60 రోజుల్లో ప్రధాన పరిపాలనా, దరఖాస్తుల పక్రియ పూర్తి
- గౌరవెల్లి పంప్‌హౌస్‌ను సర్వసన్నద్ధంగా ఉంచాలి
- అనుమతులు రాగానే సీతారామ సాగర్ పనులు పునఃప్రారంభించాలి
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్ట్3 (జనంసాక్షి) :** రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే పక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల పక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు సంబంధిత చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్హమైన ప్రతిపాదనను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సోమవారం రోజున రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పులో పేర్కొన్న అంశాలను ప్రస్తావించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గతంలో చట్టబద్ధంగా పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు ఆ రక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న దరఖాస్తులను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను ప్రాజెక్టులవారీగా సమగ్రంగా పరిశీలించి, సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం చట్టపరంగా అవకాశం ఉన్నచోట తిరిగి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై సుదూర ప్రభావం చూపగల ఈ తీర్పు వెలువడటం వెనుక తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు సాధించేందుకు నిరంతరంగా సాగించిన న్యాయపోరాటం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ తీర్పులోని న్యాయసూత్రాలను లోతుగా అధ్యయనం చేసి, రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టుకు అవి ఏ విధంగా వర్తిస్తాయో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణ సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం అత్యంత కీలకమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ విభాగాన్ని తగిన సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్?ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలు, చట్టబద్ధ సంస్థల ముందు తెలంగాణ వాదనను శాస్త్రీయ ఆధారాలు, సమగ్ర పత్రాలతో బలంగా వినిపించే సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370